సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 186

మంగళవారం 26-9-2023



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'డబుల్' ధమాకా...

ఆసియా క్రీడల్లో భారత్‌కు 2 స్వర్ణ పతకాలతో పాటు 4 కాంస్యాలు లభించాయి. పురుషుల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో భారత జట్టు ప్రపంచ రికార్డు నెలకొల్పి పసిడి పతకం నెగ్గింది. తొలిసారి బరిలోకి దిగిన భారత మహిళల క్రికెట్ జట్టు బంగారు పతకం సాధించింది. షూటింగ్‌లో రెండు, రోయింగ్‌లో రెండు కాంస్యాలు దక్కాయి.

12లో



ప్రస్థానం ముగిసినట్లేనా!

'చంద్రయాన్-3' ల్యాండర్, రోవర్ స్లీప్‌మోడ్‌లోకి వెళ్లిపోయాయి. వీటి నుంచి సంకేతాలు అందడం లేదని ఇస్రో చెబుతోంది.

- వివరాలు 6లో



కరోనాను మించిన 'ఎక్స్' వైరస్!

కరోనాను మించిన డిసీజ్ 'ఎక్స్'.. త్వరలో ప్రపంచంలో పీనవక్షం 5 కోట్ల మందిని బలి తీసుకోనుందని డబ్ల్యూహెచ్‌ఓ హెచ్చరిస్తోంది.

- వివరాలు 6లో



'రూ.2,000' మార్పిడికి 5 రోజులే

రూ.2000 నోట్ల మార్పిడికి గడువు సమీపిస్తోంది. 30లోగా వీటిని మార్చుకోవచ్చు లేదా బ్యాంకుల్లో డిపాజిట్ చేయొచ్చు.

- వివరాలు 6లో



ఎన్డీఏను వీడిన అన్నాడీఎంకే

ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వచ్చినట్లు ప్రధాన భాగస్వామ్య పక్షం అయిన అన్నాడీఎంకే ప్రకటించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

నీటమునిగి నలుగురి మృత్యువాత



దుస్తులు ఉతికేందుకు చెరువుకు వెళ్లగా.. అదే వారి పాలిట మృత్యుకుహరమైంది. బోనాల పండుగకు వచ్చిన తోటికోడళ్లు, కుటుంబసభ్యులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. మూడు కుటుంబాల్లో పెను విషాదం నింపిన ఈ ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది.

- వివరాలు 5లో

దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేయాలి



వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దమ్ముంటే హైదరాబాద్ స్థానం నుంచి పోటీచేయాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సవాల్ విసిరారు. రాహుల్‌గాంధీ పెద్దపెద్ద ప్రకటనలు చేయడం కాదని, బరిలోకి దిగి తనతో తలపడాలని ఒవైసీ సూచించారు.

- వివరాలు 2లో

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుపై సర్కార్ అప్పీల్




గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం హైకోర్టు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించింది. అప్పీల్‌పై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అయితే జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ఈ అప్పీల్‌పై వాదనలను మంగళవారానికి వాయిదా వేసింది.

- వివరాలు 3లో

ఆ పార్టీలు చేతులు కలిపేనా?

- ఇతర పార్టీలతో పొత్తుపై కాంగ్రెస్‌లో ఇప్పటికీ కొరవడిన స్పష్టత
- అసలు ఉంటుందా? ఉండదా? అనే అంశంపై కేడర్‌లో గందరగోళం

3లో



..ఢిల్లీలోనే కదా సార్!

ఆ ఎమ్మెల్సీలకు నో!



గవర్నర్ కోటా కింద ప్రతిపాదించిన ఇద్దరి పేర్లను తిరస్కరించిన తమిళిసై

దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలకు నిర్దేశిత అర్హతలు లేవు

వారు క్రియాశీల రాజకీయాలు, వ్యాపారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు

- సాహిత్యం, సైన్స్, కళలు, సహకార ఉద్యమం, సమాజసేవలో వారు చేసిందేమీ లేదు
- రాజకీయ నేతలను నామినేట్ చేస్తే ఆయా రంగాల వారి కృషికి గుర్తింపు నిరాకరించినట్లు అవుతుందని స్పష్టీకరణ
- ఇకపై గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా రాజకీయ నేతలను సిఫార్సు చేయవద్దని విజ్ఞప్తి
- ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసిన గవర్నర్
- రాజ్‌భవన్–ప్రగతిభవన్ విభేదాలు మరోసారి తెరపైకి!



దాసోజు శ్రవణ్



కుర్ర సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను నామినేట్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. రాజ్యాంగంలోని 171(3), 171(5) అధికరణాల్లో నిర్దేశించిన మేరకు సాహిత్యం, వైజ్ఞానిక శాస్త్రం, కళలు, సహకార ఉద్యమం, సమాజ సేవ రంగాల్లో ప్రత్యేక ప్రావీణ్యతగానీ, ఆచరణాత్మక అనుభవంగానీ వీరికి లేదని.. అందువల్ల వారి అభ్యర్థిత్వాలను తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. దాసోజు శ్రవణ్ రాజకీయాలు, వ్యాపారం, విద్యా రంగాల్లో.. కుర్ర సత్యనారాయణ రాజకీయాలు, పారిశ్రామిక కార్మిక సంఘం కార్యకలాపాల్లో క్రియాశీలకంగా ఉన్నట్టు ప్రతిపాదనల సారాంశం వెల్లడిస్తోందని గవర్నర్ వివరించారు. దీనిపై ఈ నెల 19న సీఎం కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి గవర్నర్ తమిళిసై రాసిన లేఖలు సోమవారం బయటికి వచ్చాయి.

రాజ్యాంగబద్ధంగానే తిరస్కరణ

రాజ్యాంగంలోని 171(1ఈ), 171(5) అధికరణాల ద్వారా చట్టసభలకు సభ్యులను నామినేట్ చేసే

మిగతా 2వ పేజీలో ▶



గవర్నర్ చేయాల్సింది ఇలాగే!

కేసీఆర్ తన కుటుంబానికి సేవచేసే వారిని ఎమ్మెల్సీలు చేయాలని చూస్తున్నారు

ఆ ప్రతిపాదనలను తమిళిసై సాహసోపేతంగా తిరస్కరించారు: కిషన్‌రెడ్డి

2లో

రాజ్‌భవన్ అడ్డాగా రాజకీయాలు

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల తిరస్కరణపై బీఆర్ఎస్ మండిపాటు

- నియామకాలకు రాజకీయ నేపథ్యాన్ని సాకుగా చూపడమేంటి?
- తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి నుంచి గవర్నర్ ఎలా అయ్యారు?
- తమిళిసైది కక్షపూరిత వైఖరి అని మంత్రులు, నేతల ఆరోపణ
- గవర్నర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

2లో

సామాజిక సేవ, రాజకీయాలు వేర్వేరు కాదు: దాసోజు

2లో



పర్యాటక'రంగ'సాగరం: సిద్దిపేట జిల్లా చంద్లాపూర్‌లోని రంగనాయకసాగర్ రిజర్వాయర్

తెలంగాణ పల్లెకు పట్టం

- పెంబర్తి, చంద్లాపూర్ గ్రామాలకు జాతీయ అవార్డులు
- ఉత్తమ పర్యాటక గ్రామాలుగా ఎంపిక చేసిన కేంద్రం
- రేపు ఢిల్లీలో పురస్కారాల అందజేత

5లో

త్వరలో పేదలకు ఎయిర్ అంబులెన్స్‌లు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

- పదేళ్ల ప్రగతి నివేదిక విడుదల చేసిన మంత్రి
- రాష్ట్రంలో ఏ మూలన అత్యవసర పరిస్థితి ఏర్పడినా హెలికాప్టర్ ద్వారా తరలింపు.. పదేళ్లలో వైద్యరంగంలో అద్భుతాలు
- నీతి ఆయోగ్ ఆరోగ్య సూచీలో 11 నుంచి 3వ ర్యాంకుకు చేరుకున్నాం.. రాష్ట్ర తలసరి ఆరోగ్య బడ్జెట్ రూ.925 నుంచి రూ.3,532కు పెరిగింది



సాక్షి, హైదరాబాద్/ గన్‌ఫౌండ్రి: రాష్ట్రంలో త్వరలో ఎయిర్ అంబులెన్సులు ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో ఏ మూలన అత్యవసర పరిస్థితి ఏర్పడినా రోగులను హెలికాప్టర్ ద్వారా దవాఖానాకు తరలిస్తామన్నారు. కోటీశ్వరులకే పరిమితమైన ఈ సేవలను పేదలకు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. సోమవారం రవీంద్రభారతిలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పదేళ్ల ప్రగతి నివేదికను ఆయన విడుదల చేశారు. అలాగే 310 మంది ఫార్మసిస్టులకు పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత తొమ్మిదేళ్లలో వైద్య ఆరోగ్యశాఖలో 22,600 పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. మరో 7,291 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, ఇందులో 5,204 స్టాఫ్ నర్సుల పోస్టులకు పరీక్ష పూర్తయిందని, వారం పది రోజుల్లో ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. మరో 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, 1,931 ఎంపీహెచ్ఏ (ఫీమేల్) (దరఖాస్తు దశ) పోస్టులు కూడా ఉన్నాయని వివరించారు. ఇవి కూడా పూర్తయితే పదేళ్లలోనే 30 వేల ఉద్యోగాలు వైద్య ఆరోగ్యశాఖలో ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.

దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ

పదేళ్ల ప్రయాణంలో ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. అరవై ఏళ్లలో సాధ్యం కాని అద్భుతాలను దశాబ్ద కాలంలోనే ఆవిష్కరించిందన్నారు. 2014లో నీతి ఆయోగ్ ఆరోగ్య సూచీలో 11వ స్థానంలో ఉంటే, ఇప్పుడు మూడో ర్యాంకుకు చేరుకున్నామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్య రంగానికి రూ.12,364 కోట్ల బడ్జెట్ పెట్టామని, ఒక్కొక్కరి వైద్యానికి చేస్తున్న తలసరి ఖర్చు రూ.3,532 అని తెలిపారు. తద్వారా దేశంలో మూడో స్థానంలో నిలిచామని చెప్పారు. తెలంగాణ వైద్య ఆరోగ్య రంగం మొత్తం 50 వేల పడకలతో కరోనా కాదు దాని తాత వచ్చినా ఎదుర్కొనేలా సిద్ధమైందని మంత్రి పేర్కొన్నారు. గాంధీ ఆసుపత్రిలో అవయవ మార్పిడి కేంద్రాన్ని ఏర్పాటు

మిగతా 3వ పేజీలో ▶

చంద్రబాబును మరో 5 రోజులు మా కస్టడీకి ఇవ్వండి

రెండు రోజుల కస్టడీలో విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించలేదు	ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేసి.. సమయం వృథా చేశారు	వీడియో చూస్తే బాబు కాలయాపన ఎత్తుగడలు అర్థమవుతాయి

- 2018–20 మధ్య పెద్దమొత్తంలో డబ్బు టీడీపీ ఖాతాల్లో జమైంది.. బాబు నుంచి కీలక సమాచారం సేకరించాలి
- అందువల్ల ఆయనను మా కస్టడీకి ఇవ్వండి
- ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానాన్ని అభ్యర్థించిన సీఐడీ
- పిటిషన్ దాఖలు.. మంగళవారం విచారిస్తామన్న న్యాయస్థానం.. ఈ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబుకు ఆదేశం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుని మరో 5 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ సోమవారం విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు ఇచ్చిన 2 రోజుల కస్టడీలో తమ విచారణకు చంద్రబాబు ఏ మాత్రం సహకరించలేదని

మిగతా 10వ పేజీలో ▶

అమరావతి.. ఓ ఆర్థిక అగాధమే

ఇప్పుడే కాదు.. భవిష్యత్తులోనూ గుదిబండే

చంద్రబాబు 'మాస్టర్' ప్లాన్‌ను ఎండగట్టిన కాగ్

- లోపభూయిష్ట భూ సమీకరణ విధానమే ప్రధాన కారణం
- విస్తారంగా దొరికే ప్రభుత్వ భూములను వదిలేసి ప్రైవేట్ భూములా?.. రాజధానిపై నిపుణుల కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదు



10లో

- తగిన విధానం లేకుండా నామినేషన్‌పై మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ ఎంపిక.. ఆర్థిక ప్రణాళిక లేకుండా సీఆర్‌డీఏ రూ.33,476 కోట్ల ప్యాకేజీ ఒప్పందాలు
- కాంట్రాక్టర్లకు 30 పనుల్లో రూ.1,282.83 కోట్లు అడ్డగోలుగా అడ్వాన్స్‌లు.. ఇంకా వసూలు చేయాల్సిన మొత్తం ఏకంగా రూ.944.36 కోట్లు
- టీడీపీ సర్కారు రాజధాని నిర్వాకాలను కడిగేసిన 'కాగ్'



'నైరుతి' నిష్క్రమణ షురూ

- రుతుపవనాల తిరోగమన ప్రభావంతో రాష్ట్రంలో మళ్లీ వర్షాలకు అవకాశం
- ప్రస్తుతం తెలంగాణపై కొనసాగుతున్న ఉపరితల ద్రోణి
- రానున్న రెండ్రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమవుతోంది. సాధారణంగా సెప్టెంబర్ మూడో వారం నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం మొదలై అక్టోబర్ రెండో వారం నాటికి పూర్తవుతుంది. కానీ ఈ ఏడాది నైరుతి రాక ఆలస్యమైంది. జూన్ నాలుగో వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించిన రుతుపవనాలు మందకొడిగానే కదలడం వల్ల సాదాసీదా వర్షాలే వచ్చాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల తిరోగమనం రాజస్తాన్‌లో ప్రారంభమవగా వచ్చే నెల 15 నాటికి ఈ ప్రక్రియ

మిగతా 3వ పేజీలో ▶

గోదావరి నీళ్లతో మూసీని నింపుతాం

ఎస్టీపీలను నిర్మించి మురుగు నీరు కలవకుండా చేస్తాం: కేటీఆర్

- మూసీపై రూ.545 కోట్లతో 14 బ్రిడ్జిలు నిర్మిస్తాం
- మూసీ నది మీదుగా ఓఆర్ఆర్ వరకు రోడ్డు
- వారం పది రోజుల్లో 40వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేస్తాం
- మూసారంబాగ్‌లో హైలెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు తలసాని, మహమూద్ అలీ, ఎంపీ అసదుద్దీన్ తదితరులు

నాగోలు/అంబర్‌పేట్/మన్సూరాబాద్ (హైదరాబాద్): మహా నగరంలో ఉన్న చారిత్రక మూసీ నదిని స్వచ్ఛమైన గోదావరి నీళ్లతో నింపుతామని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారకరామారావు చెప్పారు. నార్సింగి వద్ద గోదావరి జలాలను మూసీలో కలిపి మురుగు నీరు లేకుండా చర్యలు చేపడతామని, దీనికోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్టీపీ ప్లాంట్‌లను నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్‌కు గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిన మూసీని గత ప్రభుత్వాలు పట్టించుకోక మురికి కూపంగా మారిపోయిందన్నారు. సోమవారం రూ.52 కోట్ల అంచనా వ్యయంతో మూసారంబాగ్ వద్ద మూసీ నదిపై నిర్మించ తలపెట్టిన హైలెవెల్ బ్రిడ్జికి కేటీఆర్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. మూసీపై రూ.545 కోట్లతో 14 బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని, వీటికి అద్భుతమైన డిజైన్లను రూపొందించేందుకు మన ఇంజనీర్లతో విదేశాల్లో అధ్యయనం చేయిందామని తెలిపారు. సినిమాల్లో చూపిన మాదిరిగా బ్రిడ్జి డిజైన్లు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

తాంత్రిక పూజల్లో కేసీఆర్ సిద్ధహస్తుడు

కులాల మధ్య కుంపట్లతో కాంగ్రెస్ గెలవాలనుకుంటోంది: బండి సంజయ్



కరీంనగర్ టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ తాంత్రిక పూజల్లో సిద్ధహస్తుడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇతర పార్టీల నేతలనే కాకుండా తన మాట వినని సొంత పార్టీ నాయకులు కూడా నాశనం కావాలని కోరుకుంటూ ఇతర రాష్ట్రాలకు వెళ్లి క్షుద్ర పూజలు చేస్తున్నారని మండిపడ్డారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని సోమవారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద సంజయ్ మొక్కు నాటారు. అనంతరం బీజేపీ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఎన్ని వేషాలేసినా, ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కులాల మధ్య కుమ్ములాటలు పెట్టి గెలవాలని చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచే వాళ్లంతా కేసీఆర్‌కు ఏటీఎం మిషన్ లాంటివాళ్లేనని, ఎప్పుడంటే అప్పుడు వాళ్లను బీఆర్‌ఎస్‌లోకి తీసుకోవడం ఖాయమన్నారు.

30 లోపు కాంగ్రెస్‌లో విలీనంపై నిర్ణయం

- విలీనం లేకుంటే సొంతంగానే ఎన్నికల బరిలోకి: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసే అంశంపై ఈ నెల 30వ తేదీ లోపు నిర్ణయం తీసుకుంటామని ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. సోమవారం లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన వైఎస్సార్‌టీపీ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో విలీనం లేకుంటే సొంతంగానే ఎన్నికల బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో పార్టీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు యాదవ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ నియమితులయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి ఉండగా, నాలుగో ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కాసంను బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. ఇప్పటిదాకా ఆయన రాష్ట్రపార్టీ ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తుండగా, తాజాగా ప్రధానకార్యదర్శిగా నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

బీజేపీలో త్వరలో చేరికలు: ఈటల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో చేరేందుకు పలువురు ఇతర పార్టీల నేతలు సుముఖంగా ఉన్నట్లు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తెలిపారు. పార్టీలో చేరేందుకు సుముఖంగా ఉన్న వారిలో.. మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత భూంలింగంగౌడ్ (మెదక్) కాంగ్రెస్ సీనియర్ నేత బానోతు విజయలక్ష్మి (ఇల్లందు) ఉన్నట్లు ఒక ప్రకటనలో ఈటల వెల్లడించారు. అతిత్వరలో వీరు బీజేపీలో చేరతారని తెలియజేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా యోచనలో బోథ్ ఎమ్మెల్యే?



సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. సోమవారం ఆయన ఆదిలాబాద్‌లోని తన నివాసంలో కొంతమంది ముఖ్య అనుచరులతో సమావేశమయ్యారు. పార్టీ తన విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో బాపూరావుకు టికెట్ దక్కలేదు. దీంతో అప్పటినుంచే ఆయన మనస్తాపంతో ఉన్నారని తెలుస్తోంది. అప్పట్లో సీఎం కేసీఆర్‌ను కలవాలని ఎంతగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. అయినప్పటికీ పార్టీలోనే కొనసాగుతానని అప్పట్లో ఆయన స్పష్టం చేశారు. తాజాగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసేందుకు కూడా ఆయన ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమైనట్టు తెలుస్తోంది. టికెట్ దక్కకపోయినప్పటికీ పార్టీ పరంగా తనకు ఏదైన పదవి విషయంలో హామీ లభిస్తుందని బాపూరావు ఆశించారు. అయితే ఆ దిశగా ఎలాంటి హామీ లేకపోవడం ఆయనను ఆవేదనకు గురిచేసినట్టు తెలుస్తోంది. రెండు మూడు రోజుల్లో విలేకరుల సమావేశం నిర్వహించి రాజీనామా విషయాన్ని ప్రకటించనున్నట్లు ఆయన అనుచరుల వద్ద పేర్కొన్నట్లు సమాచారం. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తు

రాజ్‌భవన్ అడ్డాగా రాజకీయాలు

ఎమ్మెల్సీల అభ్యర్థిత్వాల తిరస్కరణపై బీఆర్‌ఎస్ మండిపాటు

- నియామకాలకు రాజకీయ నేపథ్యాన్ని సాకుగా చూపడమేంటి?
- తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి నుంచి గవర్నర్ ఎలా అయ్యారు?
- తమిళిసై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మంత్రులు, ఇతర నేతల ఆరోపణ
- గవర్నర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలంటూ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను గవర్నర్ తమిళిసై తిరస్కరించడంపై బీఆర్‌ఎస్ తీవ్రంగా మండిపడింది. రాష్ట్ర మంత్రి మండలి సిఫార్సు చేసిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలకు రాజకీయ నేపథ్యం ఉందంటూ తిరస్కరించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించింది. మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఇతర నేతలు గవర్నర్ చర్యను ఖండించారు.

మీరు తెలంగాణ గవర్నర్‌గా ఎలా ఉంటారు?: హరీశ్‌రావు

వెనుకబడిన వర్గాలకు చెందిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్నారని, వారిని ఎమ్మెల్సీలుగా నియమించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తే బీఆర్‌ఎస్ సభ్యులంటూ గవర్నర్ తిరస్కరించడం దారుణమని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటప్పుడు తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా ఉన్న తమిళిసై తెలంగాణ గవర్నర్‌గా ఎలా ఉంటారని ప్రశ్నించారు. సర్కారియా కమిషన్ సూచనల మేరకు గవర్నర్‌గా పనిచేసేందుకు తమిళిసై అనర్హులని పేర్కొన్నారు. బీజేపీకి చెందిన గులాం అలీ ఖతానా, మహేశ్ జెఠ్మలానీ, సోనాల్ మాన్‌సింగ్, రాంషకల్, రాకేశ్ సిన్హా తదితరులను రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ సభ్యులుగా ఎలా నియమించారని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో జితిన్ ప్రసాద్, గోపాల్ అర్జున్ బుర్జీ, చౌదరి వీరేంద్ర సింగ్, రజనీకాంత్ మహేశ్వరి, సాకేత్ మిశ్రా, హన్స్‌రాజ్ విశ్వకర్మ తదితర బీజేపీ నేతలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటికే అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఆపారని, ఇప్పుడేమో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను తిరస్కరించారని.. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాలను అవమానించడమే: ప్రశాంత్‌రెడ్డి

అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ)కు చెందిన దాసోజు శ్రవణ్, షెడ్యూల్డ్ తెగకు (ఎస్టీ) చెందిన కుర్రా సత్యనారాయణ అభ్యర్థిత్వాలను గవర్నర్ తిరస్కరించడం ఆయా వర్గాలను అవమానించడమేనని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. రాజ్‌భవన్‌ను అడ్డాగా చేసుకొని గవర్నర్ రాజకీయాలు చేస్తున్నారని, ఆ పదవిలో కొనసాగే నైతిక అర్హతను తమిళిసై కోల్పోయారని వ్యాఖ్యానించారు.

ఇది సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు: ఇంద్రకరణ్‌రెడ్డి

గవర్నర్ తమిళిసై చర్య సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు వంటిదని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డి కుట్ర వల్లే తిరస్కరణ: శ్రీనివాస్‌గౌడ్

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిన కుట్ర వల్లే గవర్నర్ ఎమ్మెల్సీల ఫైల్‌ను తిరస్కరించారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఇది బలహీన వర్గాలకు చెందిన వారిని అణచివేసే కుట్ర అని మండిపడ్డారు.

ఇది కక్ష సాధింపు కోసమే..

గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు గెల్లు శ్రీనివాస్ యాదవ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, రాజీవ్ సాగర్ వేర్వేరు ప్రకటనల్లో మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం మంత్రి వర్గ సమావేశంలో చర్చించి, ఆమోదించి పంపిన సిఫార్సు లను గవర్నర్ ఆమోదించకపోవటం సరికాదని, దీనికి రాజకీయ దురుద్దేశమే కారణమని విమర్శించారు.

గోదావరి నీళ్లతో మూసీని నింపుతాం

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటాయని, శంకుస్థాపన చేసిన వంతెనలు 18 నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మురుగునీటి శుద్ధిలో దేశంలోనే హైదారాబాద్ మొదటి స్థానంలో ఉందని వివరించారు. ఇప్పుడు రోజుకు 2వేల మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఎస్టీపీల నిర్మాణం చేస్తున్నామని, ఇవి పూర్తయితే మూసీలోకి పూర్తిస్థాయి శుద్ధి చేసిన నీటిని వదిలే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, అహ్మద్ బలాల, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్ గుప్తా, మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం కలను నెరవేరుస్తాం

మంచిరేవుల నుంచి ఘట్‌కేసర్ దాకా మూసీ నదిని అద్భుతంగా సుందరీకరించాలన్న సీఎం కేసీఆర్ కలను నెరవేరుస్తామని కేటీఆర్ చెప్పారు. 160 కి.మీ. ఓఆర్‌ఆర్ చుట్టూ తిరగకుండా మధ్యలో మూసీ నది మీదుగా వెళ్లేలా బ్రిడ్జిలు, రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. రూ. 5వేల కోట్లతో రెండో విడత ఎస్‌ఎన్‌డీపీ పనులు త్వరలోనే చేపడతామని తెలిపారు. వారం పది రోజుల్లో 40 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను పారదర్శకంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. జీవో 118లో చిన్న చిన్న సాంకేతిక సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కేసీఆర్ తెలిపారు. ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఫ్లైఓవర్ల కింద ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కు అద్భుతంగా ఉందని కేటీఆర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి కితాబునిచ్చారు. కేటీఆర్ పార్కు మొత్తం కలియతిరిగి అక్కడ ఏర్పాటుచేసిన ఆకృతులను ఆసక్తిగా తిలకించి.. జీహెచ్‌ఎంసీ కార్మికులతో ఫొటోలు దిగారు. హైదరాబాద్ మతసామరస్యానికి ప్రతీక అని, పార్లమెంటులో లేని మతసామరస్యం మన హైదరాబాద్‌లో ఉందని కేటీఆర్ అన్నారు. గణేశ్ నిమజ్జనం పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ ర్యాలీ వాయిదా వేసుకోవడం ఒకరిని ఒకరు గౌరవించుకుంటున్నారనే దానికి నిదర్శనమని తెలిపారు.

కవితను ఎందుకు అరెస్టు చేయరు?

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



చింతలమానెపల్లి(సిర్పూర్): మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితను ఎందుకు అరెస్టు చేయడం లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఆయన కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి ఛత్రపతి శివాజీ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత పీఏలు స్వయంగా రూ.45 కోట్లు ఢిల్లీకి తరలించి ముడుపులు చెల్లించినట్లు దర్యాప్తు సంస్థలు తేల్చినా ఈడీ ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు. చింతలమానెపల్లి మండలం దిందా వాగు కారణంగా టీచర్లు పాఠశాలకు వెళ్లలేక.. సమస్యను మీడియా దృష్టికి తీసుకెళ్తే స్థానిక ఎమ్మెల్యే వారిని సస్పెండ్ చేయించారని ఆరోపించారు. గ్రానైట్ క్వారీల అక్రమాల్లో ఎమ్మెల్యేకు హస్తం ఉందని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఆ ఎమ్మెల్సీలకు నో!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారం గవర్నర్‌కు ఉందని.. దానిని అనుసరించే తాను నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తమిళిసై తన లేఖల్లో స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 10లో పొందుపరిచిన షెడ్యూల్–3ను అనుసరించి శాసనమండలిలో సీట్ల కేటాయింపు జరపాల్సి ఉంటుందని వివరించారు. ఆ చట్టంలోని షెడ్యూల్–3కు ఏపీ పునర్విభజన చట్టం–2014లోని సెక్షన్ 17 ద్వారా సవరణ జరిపి తెలంగాణ రాష్ట్రానికి 40 ఎమ్మెల్సీ సీట్లను కేటాయించారని, అందులో గవర్నర్ కోటా కింద నామినేట్ చేసే 6 సీట్లు కూడా ఉన్నాయని తెలిపారు. ఎన్నిక కాబోయే అభ్యర్థి ఏదైనా ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కును లేదా రాష్ట్రంలో స్థిర నివాసాన్ని కలిగి ఉండాలని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 3, 6(2) సెక్షన్లు స్పష్టం చేస్తున్నాయన్నారు. సభ్యుల అనర్హతలపై సెక్షన్ 8 నుంచి 11 (ఏ) వరకు పొందుపరిచిన నిబంధనలు శాసనమండలికి నామినేట్ అయ్యే సభ్యులకు కూడా వర్తిస్తాయని వివరించారు.

కేబినెట్ నోట్ ఫైల్ పంపలేదు

ఇద్దరు ఎమ్మెల్సీల నియామక ప్రతిపాదనలతో ఇతర వివరాలు, ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం జత చేయలేదని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. మంత్రివర్గం, సీఎం సంబంధిత రికార్డులన్నింటినీ పరిశీలించినట్టు ధ్రువీకరించే కేబినెట్ నోట్ ఫైల్‌ను పంపలేదని.. ఎమ్మెల్సీలుగా వీరి అభ్యర్థిత్వాన్ని పరిశీలించడానికి ప్రభుత్వం అనుసరించిన పద్ధతిని కూడా తెలియజేయలేదని తప్పుపట్టారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్లు 8 నుంచి 11(ఏ) వరకు పేర్కొన్న అనర్హతలు వీరికి వర్తించవని ధ్రువీకరిస్తూ నిఘా విభాగం, ఇతర సంస్థల నుంచి ఎలాంటి నివేదికలూ అందలేదన్నారు. సిఫార్సుల కోసం పంపే ఫైలు సంబంధిత అన్ని రికార్డులతో రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇన్ని లోపాలకు తోడు అర్హతలను ధ్రువీకరించే ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయడం సముచితం కాదని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి తిప్పిపంపుతున్నట్టు ప్రకటించారు.

ఇకపై రాజకీయ నేతలను సిఫార్సు చేయొద్దు

రాజ్యాంగంలోని సెక్షన్ 171 (5)లో ప్రస్తావించిన రంగాల్లో ప్రత్యేక ప్రావీణ్యత, అనుభవం కలిగి, రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని చాలా మంది రాష్ట్రంలో ఉన్నారని, వారిని ఎమ్మెల్సీలుగా నియమించవచ్చని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. వారికి కేటాయించిన పదవుల్లో రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తులను నియమిస్తే.. ఆయా రంగాల్లోని వారు చేసిన కృషిని, సాధించిన నిపుణతను విస్మరించినట్టు అవుతుందని స్పష్టం చేశారు. అంతేగాకుండా రాజ్యాంగంలోని సెక్షన్ 171 (5) కింద వారికి కల్పించిన ప్రయోజనాలు సైతం నీరుగారిపోతాయన్నారు. అర్హుల అవకాశాలను లాక్కున్నట్టు అవుతుందని, ఇది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇకపై సెక్షన్ 171(5) కింద నామినేట్ చేసే పదవుల కోసం రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తులను పరిగణనలోకి తీసుకోవద్దని సీఎంకు, మంత్రి వర్గానికి విజ్ఞప్తి చేశారు.

నెలన్నరకుపైగా పెండింగ్ తర్వాత

సుమారు రెండేళ్ల క్రితం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పాడి కౌశిక్‌రెడ్డిని మంత్రిమండలి నామినేట్ చేయగా.. కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయంటూ గవర్నర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం ఆ స్థానంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పేరును ప్రతిపాదించగా గవర్నర్ ఆమోదించారు. తాజాగా ఎస్టీల్లోని ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణ, బీసీ సామాజికవర్గానికి చెందిన దాసోజు శ్రవణ్ కుమార్‌లను ఎమ్మెల్సీలుగా నామి నేట్ చేయాలని జూలై 31న మంత్రివర్గం తీర్మానించింది. ఈ మేరకు గవర్నర్‌కు ప్రతిపాదనలను పంపింది. అప్పటి నుంచి దాదాపు నెలన్నరకుపైగా ఆ సిఫార్సులు రాజ్‌భవన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా ఆ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ గవర్నర్ లేఖ రాశారు.

కొత్త వారికి అవకాశం ఇస్తారా?

మరికొన్ని రోజుల్లో శాసనసభ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే అంచనాల నేపథ్యంలో.. ఎమ్మెల్సీలను నామినేట్ చేయాలన్న ప్రతిపాదనను గవర్నర్ తిరస్కరించడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా కొత్తవారిని నామినేట్ చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం మరో తీర్మానం చేసి పంపిస్తుందా? వీరినే నియమించాలని మళ్లీ కోరుతుందా? అసలు ఈ అంశంపై బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్న కొందరు బీఆర్‌ఎస్ నేతల్లో మళ్లీ ఆశలు చిగురించడం గమనార్హం. మరోవైపు ఈ పరిణామంతో గవర్నర్ తమిళిసై, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలు మరోసారి రచ్చకెక్కినట్టేనని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

సామాజిక సేవ, రాజకీయాలు వేర్వేరు కావు: దాసోజు శ్రవణ్

సాక్షి, హైదరాబాద్: తన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించడంపై దాసోజు శ్రవణ్ స్పందించారు. "సామాజిక సేవ, రాజకీయాల పాత్రలు, ఉద్దేశాలు వేరైనా అవి రెండూ వేర్వేరు కాదు. విధానాల్లో మార్పులను ప్రభావితం చేసేందుకు అవసరమైన లాబీయింగ్‌ను సోషల్ వర్కర్స్ చేస్తారు. చట్టాల ద్వారా సామాజిక సమస్యల పరిష్కారానికి రాజకీయ నాయకులు పనిచేస్తారు. సంక్లిష్టమైన సామాజిక సమస్యల పరిష్కారం, తద్వారా సమాజాభివృద్ధి కోసం ఈ రెండు రంగాలు తరచూ ఏకరీతిలో పనిచేస్తూ ఉంటాయి.."అని శ్రవణ్ పేర్కొన్నారు.

గవర్నర్ చేయాల్సింది ఇలాగే!

- కేసీఆర్ తన కుటుంబానికి సేవచేసే వారిని ఎమ్మెల్సీలు చేయాలని చూస్తున్నారు: కిషన్‌రెడ్డి
- ఆ ప్రతిపాదనలను తమిళిసై సాహసోపేతంగా తిరస్కరించారు



సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ ఎమ్మెల్సీల నియామకం విషయంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చెప్పారు. గవర్నర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని.. ఆమెకు రాష్ట్ర ప్రజల తరఫున అభినందనలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. గవర్నర్ కోటా, రాష్ట్రపతి కోటా పదవులు అంటే మేధావులు, విద్యావంతులు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సినవని స్పష్టం చేశారు. కేసీఆర్‌కుటుంబానికి సేవ చేసే వ్యక్తులను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో కూడా క్రిమినల్‌కేసులున్న వ్యక్తులను ఎమ్మెల్సీలుగా నియమించాలని సీఎం కేసీఆర్ ప్రతిపాదనలు పంపితే గవర్నర్‌తిరస్కరించారని గుర్తుచేశారు. "బీఆర్‌ఎస్ ఎవరికి టికెట్లు ఇస్తుందంటే.. కేసీఆర్ కాళ్ల దగ్గరపడి ఉండేవాళ్లకు, వాళ్ల మోచేతి నీళ్లు తాగేవాళ్లకు, ఆత్మగౌరవం లేని వాళ్లకు ఇస్తుంది. గవర్నర్‌కోటా నామినేటెడ్‌పోస్టులు కూడా అలాంటి వారికే ఇవ్వాలంటారా? అనేక పార్టీలు ఫిరాయించిన వారు, కేసీఆర్‌కుటుంబానికి మాత్రమే సేవచేసే వారిని గవర్నర్‌తిరస్కరించారు. అలాగే చేయాలి కూడా. ఈ విషయంలో గవర్నర్‌నిర్ణయం స్వాగతించదగినది.."అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఉండాలి

ప్రధాని మోదీ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా బీజేపీకి ఏమాత్రం సంబంధం లేని సినీ కథా రచయిత విజయేంద్రప్రసాద్‌ను, పీటీ ఉష వంటి అంతర్జాతీయ క్రీడాకారిణిని ఎంపీలుగా ప్రతిపాదించగా రాష్ట్రపతి ఓకే చేశారని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో గవర్నర్ సరిగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలను ఓ విలేకరి ప్రస్తావించగా.. "కేసీఆర్‌కు అనుకూలంగా ఉంటేనే గవర్నర్ సరిగా వ్యవహరించినట్టా? కేసీఆర్ తప్పిదాలను ఎత్తి చూపుతూ ధైర్యంగా నిర్ణయం తీసుకుంటే సరికాదా? గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరిస్తారు. ఆ పదవికి ఏ పార్టీతో సంబంధం ఉండదు"అని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు.

27న కాంగ్రెస్‌లోకి మైనంపల్లి

హన్మంతరావు ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ నేతలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/అల్వాల్: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీలో చేరికకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఈ నెల 27న ఢిల్లీలో అగ్రనేతల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. సోమవారం సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనరసింహ, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్‌యాదవ్, మధుయాష్కీగౌడ్, మల్లురవితో పాటు మహేష్‌కుమార్‌గౌడ్, హరివర్ధన్‌రెడ్డిలు ఆయన నివాసానికి వెళ్లి చేరికపై చర్చించారు. అనంతరం మైనంపల్లి హన్మంతరావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ బృందం తనను పార్టీలోకి రావాలని ఆహ్వానించిందని, ఈ నెల 27వ తేదీన ముహూర్తం బాగుందని తన గురువు చెప్పారని, అదే రోజు ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరుతానని ప్రకటించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు అందరం కలిసి మైనంపల్లి ఇంటికి వెళ్లి చర్చ జరిపామని, పార్టీలోకి ఆహ్వానించగా, ఆయన అంగీకరించారని చెప్పారు. మైనంపల్లితోపాటు ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్, నక్క ప్రభాకర్‌గౌడ్‌లతోపాటు అనేక మంది కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. మైనంపల్లికి ఎన్ని టికెట్లు ఇస్తారని, మీడియా భట్టివిక్రమార్కను ప్రశ్నించగా, సీట్ల ఎంపిక విషయం పార్టీ అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు.

డీసీసీ అధ్యక్షుడితో ముందుగా చర్చలు

మైనంపల్లిని కలవడానికి ముందే కాంగ్రెస్ బృందం అల్వాల్‌లో ఉండే డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ నివాసానికి వెళ్లి చర్చలు జరిపింది. కాంగ్రెస్ బలోపేతంలో భాగంగా ఇతర పార్టీల నేతల చేరికలను ఆహ్వానిస్తున్నామని శ్రీధర్‌కు నచ్చజెప్పారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ కొత్తవారిని ఆహ్వానిస్తున్నా, పార్టీలో పాతవారికి అన్యాయం జరగనీయమన్నారు. కష్టకాలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన బీసీ నేత శ్రీధర్‌ను తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు.

మెదక్ కాంగ్రెస్‌లో మైనంపల్లి లొల్లి

మైనంపల్లి చేరికకు ముందే మెదక్ కాంగ్రెస్‌లో లొల్లి మొదలైంది. తనతోపాటు తన కుమారుడు మైనంపల్లి రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వాలని హన్మంతరావు కాంగ్రెస్ నేతలకు ప్రతిపాదించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మెదక్ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నేతల్లో కలవరం మొదలైంది. డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మ్యాడం బాలకృష్ణ, సుప్రభాతరావు, శశిధర్‌రెడ్డి టికెట్ కోసం దరఖాస్తు చేశారు. మైనంపల్లి చేరిక ప్రకటన నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారి మారాయి. మెదక్‌లో ఫ్లాష్ సర్వే చేపట్టినట్టు సమాచారం. రోహిత్, తిరుపతిరెడ్డిలో ఎవరికి గెలుపు అవకాశాలు ఉంటాయనే అంశంపై ఈ ఫ్లాష్ సర్వే జరిపినట్టు తెలుస్తోంది.

నేను పోటీలో ఉంటా



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నేను తప్పకుండా పోటీలో ఉంటా. ఐదేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నా. పార్టీ హైకమాండ్‌పై నాకు పూర్తి నమ్మకం ఉంది. మైనంపల్లి హన్మంతరావు చేరికను స్వాగతిస్తున్నా. కానీ పార్టీ కోసం కష్టపడిన నాకు ఈసారి ఎలాగైనా టికెట్ కేటాయించాలి. – తిరుపతిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు

కాంగ్రెస్‌కు 78 సీట్లు ఖాయం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీల అమలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పదితో పాటు రాష్ట్రంలో 74 నుంచి 78 సీట్లు గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సీఎల్పీనేత మల్లు భట్టివిక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన బీఆర్‌ఎస్ ఒక వైపు, ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న కాంగ్రెస్ ఒక వైపు ఎన్నికల బరిలో ఉన్నాయని ఆయన అన్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరాక తొలిసారిగా సోమవారం ఖమ్మం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగగా.. తుమ్మలకు భట్టితో పాటు మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు.

కల్వకుంట్ల కుటుంబం ఆగమాగం

న్యాయం, ధర్మంతో పాటు రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని చెప్పారు. విజయభేరి సభలో ప్రకటించినట్లుగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీ కార్డులో చెప్పినవన్నీ అమలు చేస్తామని అన్నారు. చేవెళ్ల, వరంగల్ డిక్లరేషన్లు, రుణమాఫీ వంటి హామీలు కూడా మేనిఫెస్టోలో చేర్చనున్నామని తెలిపారు. ప్రతి మండలంలో 15 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులతో కూడిన అంతర్జాతీయ పాఠశాలలు నిర్మిస్తామని చెప్పారు. కాంగ్రెస్ సభలు, సమావేశాలు, పార్టీ గాలి చూసి కల్వకుంట్ల కుటుంబం ఆగమాగం అవుతోందని ఎద్దేవా చేశారు. మళ్లీ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు. పొంగులేటి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా గ్రూప్ –1 పరీక్ష నిర్వహించిన కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల ఉసురు పోసుకుందని మండిపడ్డారు. సమావేశంలో తుమ్మలతో పాటు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పక్కన పొంగులేటి, తుమ్మల తదితరులు

మళ్లీ కాంగ్రెస్ గూటికి కుంభం

- రేవంత్ సమక్షంలో చేరిక.. రెండు నెలలకే యూటర్న్
- బీఆర్‌ఎస్‌లో గుర్తింపు లేదన్న భావన

సాక్షి, యాదాద్రి: రెండు నెలల క్రితం బీఆర్‌ఎస్‌లో చేరిన యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం రాత్రి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఇందుకు కుంభం సానుకూలంగా స్పందించడంతో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పారు. దీంతో అనిల్‌కుమార్‌రెడ్డి తిరిగి సొంత గూటికి చేరినట్లయింది. డీసీసీ అధ్యక్షుడి హోదాలో స్వయంగా సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరినా అక్కడ ఇమడలేకపోయారు. బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత తనకు సరైన గుర్తింపు, ప్రజల్లోకి వెళ్లడానికి ప్రొటోకాల్ లేదన్న అభిప్రాయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీతో పార్టీ కండువా కప్పుకున్నారు. కాగా కాంగ్రెస్‌లోకి తిరిగి వెళ్తున్నాడన్న సమాచారంతో మంత్రులు సోమవారం ఫోన్‌లో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని అంటున్నారు. కాగా, రెండు నెలల క్రితం జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకున్నానని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



కుంభం అనిల్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి తదితరులు

ఒవైసీకి దమ్ముంటే నాపై పోటీ చేయాలి: రాజాసింగ్



అబిడ్స్ (హైదరాబాద్): మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దమ్ముంటే గోషామహల్ నియోజకవర్గంలో తనపై పోటీ చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సవాలు విసిరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ.. మజ్లిస్ పార్టీని పాముకు పాలుపోసి పెంచినట్లు పోషించిందని ఆరోపించారు. కాంగ్రెస్ బంధుత్వాన్ని ఒవైసీ అప్పుడే మరిచిపోయారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీకి ఒవైసీ సవాల్ విసరడం విడ్డూరంగా ఉందన్నారు. అసదుద్దీన్ కానీ ఆయన సోదరుడు అక్బరుద్దీన్ కానీ తనపై పోటీచేస్తే ప్రజలు వారిని చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో గోషామహల్‌లో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తానని రాజాసింగ్ ధీమా వ్యక్తంచేశారు.

దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేయాలి

కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీకి అసదుద్దీన్ ఒవైసీ సవాల్



సాక్షి, హైదరాబాద్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దమ్ముంటే హైదరాబాద్ స్థానం నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సవాల్ విసిరారు. రాహుల్‌గాంధీ పెద్దపెద్ద ప్రకటనలు చేయడం కాదని, బరిలోకి దిగి తనతో తలపడాలని ఒవైసీ సూచించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ దారుసలాం మైదానంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బాబ్రీమసీదు కూల్చివేశారని, పునరుద్ధరణ జరగలేదని, అదే తెలంగాణ సచివాలయంలో మసీదు కూల్చివేసినా, తిరిగి పునరుద్ధరించారని గుర్తు చేశారు. లోక్‌సభలో బీఎస్పీకి చెందిన ఓ ముస్లిం ఎంపీని బీజేపీ ఎంపీ మతపరంగా అమానవీయవిధంగా దూషణలు చేశారని, పార్లమెంటులో ముస్లిం సభ్యుల హత్యలకు పాల్పడేరోజు ఎంతో దూరంలో లేనట్టు కనిపిస్తోందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ సబ్‌కాసాత్..సబ్‌కావికాస్ ఎక్కడ ఉందని, అయన ఒక్కమాట కూడా మాట్లాడరని విమర్శించారు. మజ్లిస్ మహిళాబిల్లుకు వ్యతిరేకం కాదని, అందులో వెనుకబడిన తరగతుల మహిళల రిజర్వేషన్ కోసమే వ్యతిరేకించినట్లు స్పష్టం చేశారు.

బరిలో లేని స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేయని స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు సహకరించాలని ఒవైసీ పిలుపునిచ్చారు. మజ్లిస్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే అభ్యర్థులకు ఏ మాత్రం సహకరించొద్దని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో అల్లర్లు జరిగాయని, అలాంటి ఘటనలు ప్రస్తుత బీఆర్‌ఎస్ పాలనలో లేవన్నారు. తెలంగాణలో శాంతిభద్రతలు దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ఆ పార్టీలు చేతులు కలిపేనా?

- ఇతర పార్టీలతో పొత్తుపై కాంగ్రెస్‌లో ఇప్పటికీ కొరవడిన స్పష్టత
- అసలు ఉంటుందా? ఉండదా? అనే అంశంపై కేడర్‌లో గందరగోళం
- కామ్రేడ్లతో పాటు టీజేఎస్, బీఎస్పీలతో కుదరవచ్చంటున్న పార్టీ వర్గాలు
- పొత్తుకు సిద్ధంగా కోదండరాం.. విలీనానికి మాత్రం నో!
- బీఎస్పీతో ప్రాథమిక చర్చలు కూడా ప్రారంభం కాని వైనం



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తుపై కాంగ్రెస్ పార్టీలో స్పష్టత రావడం లేదు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు తెలంగాణ జన సమితి (టీజేఎస్), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)లతో ఈసారి పొత్తు కుదిరే అవకాశముందనే చర్చ జరుగుతోంది. కానీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే సమయం సమీపిస్తున్నా రాష్ట్రస్థాయిలో ఇంతవరకూ ఎలాంటి స్పష్టమైన ప్రతిపాదనలు లేకపోవడం, ఈ దిశగా ఎలాంటి తాజా కదలిక లేకపోవడంతో పొత్తు ఉంటుందా? ఉండదా? అనే అంశంపై పార్టీ కేడర్ గందరగోళానికి గురవుతోంది. ముఖ్యంగా సీపీఐ, సీపీఎంలతో పొత్తు విషయంలో అయోమయం నెలకొంది. వాస్తవానికి ఆ పార్టీలతో గతంలో ఢిల్లీ స్థాయిలో చర్చలు జరిగాయి. ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌లో సీపీఐ నేత నారాయణతో మంతనాలు జరిపారు. కానీ ఇంతవరకు ఏమీ తేల్లేదు. కామ్రేడ్లు అడిగినట్టుగా భావిస్తున్న సీట్లపై ఎలాంటి స్పష్టత రాలేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తును వేగవంతం చేయడంతో వామపక్షాలతో పొత్తు ఉంటుందా? ఉండదా? అన్న దానిపై రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనిపై అధిష్టానం వీలున్నంత త్వరగా స్పష్టత ఇవ్వాలని, ఏదో ఒకటి త్వరగా తేల్చితేనే ఎన్నికలను సమర్థంగా ఎదుర్కోవడం సాధ్యమవుతుందని, లేదంటే గత ఎన్నికల్లో మహాకూటమి పొత్తు లాగానే విఫలమయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.

ఆరు స్థానాలపై టీజేఎస్ దృష్టి

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను కూడా ఇప్పటికే కాంగ్రెస్ వర్గాలు సంప్రదించాయి. ఢిల్లీ నుంచి ఆయనతో మంతనాలు జరిగాయని, ఈ సందర్భంగా పార్టీ విలీనం ప్రస్తావన వచ్చిందని, ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించిన ప్రొఫెసర్.. పొత్తుకు మాత్రం అభ్యంతరం లేదని చెప్పారని తెలిసింది. అయితే ఈసారి ఆరు స్థానాలపై టీజేఎస్ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. సూర్యాపేట, జహీరాబాద్, నర్సంపేట, ఎల్లారెడ్డి, గద్వాల, కోరుట్లపై ప్రధానంగా దృష్టి సారించామని, ఒంటరిగా పోటీ చేయాల్సి వస్తే మిగిలిన చోట్ల తమకు అభ్యర్థులు ఉన్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక జాతీయ స్థాయిలో బీఎస్పీతో సంబంధాలు ఎలా ఉన్నా రాష్ట్ర స్థాయిలో ఆ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రతిపాదన ఉందని కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు. అయితే ఇంతవరకూ ప్రాథమిక స్థాయిలో కూడా చర్చలు ప్రారంభం కాకపోవడం గమనార్హం.

కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు

ఈసారి పొత్తుల విషయమై కాంగ్రెస్ పార్టీలో రెండు అభిప్రాయాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలకు వీలున్నన్ని తక్కువ స్థానాలు ఇచ్చి పొత్తు కుదుర్చుకుంటే మంచి ఫలితం వస్తుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. మరికొందరు మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు అవసరం లేదని, ఒంటరిగా ఎన్నికలకు వెళితేనే కచ్చితంగా మేలు జరుగుతుందని అంటున్నారు. అయితే పార్టీ అధిష్టానం రాష్ట్ర నాయకులకు సమాచారం లేకుండానే ఇతర పార్టీలతో చర్చలు జరుపుతుండటంతో భవిష్యత్తులో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

రేపు టెట్ ఫలితాలు

తుది 'కీ' విడుదల కూడా...

సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్‌టెట్) ఫలితాలను ఈనెల 27న విడుదల చేయనున్నారు. ఇందుకు కోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఫలితాలు విడుదలవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రాథమిక 'కీ' విడుదలైంది. 27వ తేదీన తుది 'కీ' తో పాటు ఫలితాలు వెల్లడించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. టెట్ పరీక్ష పేపర్–1కు 2,69,557 మంది దరఖాస్తు చేశారు. ఇందులో 2,26,744 (84.1 శాతం) మంది పరీక్ష రాశారు. పేపర్–2కు 2,08,498 మంది దరఖాస్తు చేస్తే, 1,89,963 మంది (91.11 శాతం) పరీక్ష రాశారు. వచ్చే నెల జరిగే ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి టెట్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసే వీలుంది. ఈ కారణంగా టెట్ ఫలితాలను ఆలస్యం చేయకూడదని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

సీటెట్ ఫలితాల విడుదల

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) ఫలితాలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్ష ఆగస్టు 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగింది. మొత్తం 29 లక్షల మంది ఈ పరీక్షకు రిజిస్టర్ చేసుకున్నారు. పేపర్–1కు (1–5 తరగతి బోధకు అర్హత) 15 లక్షల మంది, పేపర్–2కు (6–8 తరగతులకు బోధనకు అర్హత) 14 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అర్హత సాధిస్తే దేశవ్యాప్తంగా ప్రముఖ స్కూళ్లలో ఉపాధ్యాయులుగా పనిచేసే వీలుంది.

రాష్ట్రానికి విదేశీ పర్యాటకుల వెల్లువ

- టెంపుల్ టూరిజం విశేషంగా ఆకట్టుకుంటోంది: మంత్రి శ్రీనివాస్ గౌడ్
- శిల్పకళావేదికలో వరల్డ్ టూరిజం డే వేడుకలు ప్రారంభం



వరల్డ్ టూరిజం డే వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

మాదాపూర్: రాష్ట్రంలో పర్యాటక రంగం బాగా అభివృద్ధి చెందుతోందని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచదేశాలతో పోటీ పడుతోందన్నారు. రాష్ట్రంలో సందర్శించాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయని, విదేశీ పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. విదేశీ పర్యాటకులు దేశంలో ఎక్కువ శాతం రాష్ట్రాన్ని సందర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా రిజర్వాయర్లు కడుతున్నారని వాటిని సందర్శకులు వీక్షించేలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం విశేషంగా ఆకట్టుకుంటోందని వివరించారు. శ్రీనివాస్‌గౌడ్ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం వరల్డ్ టూరిజం డే–2023 వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ జిల్లా కేంద్రంలో మూడు రోజులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఫుడ్ ఫెస్టివల్, చేనేత ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వేడుకలకు వచ్చిన ప్రతినిధుల కోసం తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా ప్రతి చెరువు వద్ద బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో చివరిరోజు అవార్డులను ప్రదానం చేస్తామని వెల్లడించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ పర్యాటక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక కమిషనర్ శైలజారామయ్యర్, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎండీ మనోహర్, డైరెక్టర్ నిఖిల పాల్గొన్నారు.

ఓయూ దూరవిద్య డిగ్రీ కోర్సుల్లో సెమిస్టర్ విధానం

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ దూరవిద్య కేంద్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2024–25) నుంచి పలు డిగ్రీ కోర్సులకు సెమిస్టర్ పరీక్ష విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు డైరెక్టర్ జీబీ రెడ్డి సోమవారం తెలిపారు. సెమిస్టర్ పరీక్షల వలన ఏటా రెండు చొప్పున మూడు సంవత్సరాల డిగ్రీకి ఆరు పరీక్షలుంటాయన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పీజీ, పీజీ డిప్లొమా కోర్సులకు సెమిస్టర్ పరీక్ష విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా 2023–24 విద్యా సంవత్సరానికి పలు పీజీ, డిగ్రీ, డిప్లొమా కోర్సుల మొదటి విడత ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 30తో ముగియనుంది. ఇంత వరకు 4 వేల మంది విద్యార్థులు పలు కోర్సుల్లో ప్రవేశం పొందినట్లు డైరెక్టర్ పేర్కొన్నారు.

యూజీ ఆయుష్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: యూజీ ఆయుష్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆయుష్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ ప్రకటన జారీ చేసింది. నీట్–2023 అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 26 నుంచి వచ్చే నెల 2 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొంది. అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. మరింత సమాచారం కోసం వర్సిటీ వెబ్‌సైట్ www.knruhs.telangana.gov.inను సందర్శించాలని పేర్కొంది.

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు వెబ్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు ఈనెల 25 సాయంత్రం 4 గంటల నుంచి 26 సాయంత్రం 4 గంటల వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు ఇప్పటికే మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. అయితే కన్వీనర్ కోటాలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ రౌండ్‌లో భర్తీ చేయనున్నారు. అర్హత, నిబంధనలు, ఇతర వివరాల కోసం www.knruhs.telangana.gov వెబ్‌సైట్ చూడాలని యూనివర్సిటీ వర్గాలు సూచించాయి.

కృషి బ్యాంకు డైరెక్టర్ శ్రీధర్ అరెస్టు

రూ.36 కోట్ల మోసం కేసులో అరెస్టు చేసిన సీఐడీ



శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: బ్యాంకు ఖాతాదారులను మోసగించిన కేసులో కృషి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కాగితాల శ్రీధర్‌ను సీఐడీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ–9గా ఉన్న శ్రీధర్‌పై నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు 2001లో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న శ్రీధర్‌ను సీఐడీలోని నాన్‌బెయిలబుల్ వారెంట్ స్పెషల్ ఎగ్జిక్యూషన్ బృందం ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని శ్రీరాంపేట్ ప్రాంతంలో అరెస్టు చేసింది. నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్టు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసు ట్రయల్ నడుస్తున్నట్లు తెలిపారు.

ఇదీ కేసు నేపథ్యం...: కృషి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ కొసరాజు వెంకటేశ్వర రావు, మిగిలిన డైరెక్టర్లు కలిసి బ్యాంకు ఖాతాదారులకు చెందిన రూ.36.37 కోట్లు కొల్లగొట్టి బ్యాంకు మూసివేసినట్టు డా.ఎంపీ కుమార్, ఇతర ఖాతాదారులు మహంకాళి పోలీస్ స్టేషన్‌లో 2001 ఆగస్టు 11న ఫిర్యాదు చేశారు. ఖాతాదారుల నుంచి సేకరించిన మొత్తాలను నకిలీ ధ్రువపత్రాలతో కొన్ని నకిలీ రుణ ఖాతాలు సృష్టించి కొల్లగొట్టినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై మహంకాళి పీఎస్‌లో నమోదైన కేసును 2001 ఆగస్టు 21న సీఐడీకి బదిలీ చేశారు.

త్వరలో పేదలకు ఎయిర్ అంబులెన్స్‌లు

▶ మొదటి పేజీ తరువాయి



ఫార్మసిస్ట్‌కు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను అందజేస్తున్న మంత్రి హరీశ్ రావు

చేస్తున్నామని, రాబోయే రోజుల్లో దేశ విదేశాల నుంచి వచ్చి అవయవ మార్పిడులు చేసుకునేలా ప్రభుత్వ ఆస్పత్రులు మారబోతున్నాయని చెప్పారు. ఎంఎన్ జే క్యాన్సర్ హాస్పిటల్‌లో ప్రతి నెల సగటున 8 మందికి బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. ఔషధాల అందుబాటు, పంపిణీ ప్రక్రియలో తెలంగాణ త్వరలో రెండో స్థానానికి చేరనున్నట్టు హరీశ్‌రావు వివరించారు. ఔషధాలను సమకూర్చడం, రోగులకు అందించడంలో ఫార్మసిస్టులది కీలక పాత్ర అంటూ కొత్త ఫార్మసిస్టులకు ఆయన స్వాగతం పలికారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పదేళ్ల ప్రగతి నివేదిక వివరాలు

సూచిక	2014	2023	పెరుగుదల
తలసరి ఆరోగ్య బడ్జెట్ (రూ.లలో)	925	3532	4 రెట్లు
ఆసుపత్రి పడకలు	17.000	34.000	2 రెట్లు
ఆక్సిజన్ పడకలు	1400	34.000	30 రెట్లు
మెడికల్ కాలేజీలు	20	56	3 రెట్లు
ప్రభుత్వ మెడికల్ కాలేజీలు	5	26	5 రెట్లు
ఎంబీబీఎస్ సీట్లు	2850	8515	3 రెట్లు
పోస్టుగ్రాడ్యుయేట్ సీట్లు	1183	2890	2.5 రెట్లు
సూపర్ స్పెషాలిటీ సీట్లు	79	206	3 రెట్లు
డయాలసిస్ కేంద్రాలు	3	82	27 రెట్లు
ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు(ఐసీయూ)	5	80	16 రెట్లు
ప్రత్యేక శిశు సంరక్షణ యూనిట్లు	2	35	17 రెట్లు
మాతా శిశు ఆరోగ్య కేంద్రాలు	6	28	1.5 రెట్లు
బ్లడ్ బ్యాంకులు	28	56	2 రెట్లు
108 అంబులెన్స్‌లు	316	455	-
నియోనాటల్ అంబులెన్స్‌లు	0	33	-
అమ్మఒడి వాహనాలు	0	300	-
పరమపద వాహనాలు	0	50	-
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు	30%	70%	2 రెట్లు
వ్యాక్సినేషన్	68%	100%	1.5 రెట్లు

(మాతా మరణాల రేటు 92 నుంచి 43 (50%)కు, శిశు మరణాల రేటు 39 నుంచి 21 (50%)కి తగ్గింది)

గ్రూప్‌–1 ప్రిలిమ్స్ రద్దుపై సర్కార్ అప్పీల్

- ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించిన ప్రభుత్వం
- విచారణ నేటికి వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేస్తూ సింగిల్‌జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం హైకోర్టు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించింది. అప్పీల్‌పై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అయితే జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ఈ అప్పీల్‌పై వాదనలను మంగళవారానికి వాయిదా వేసింది. ముగ్గురు అభ్యర్థులు తప్ప ఎవరూ ప్రిలిమ్స్ రద్దు కోరలేదని, వీరికోసం లక్షలమందిని ఇబ్బంది పెట్టడం సముచితం కాదని ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ హరిందర్ పరిషద్ పేర్కొన్నారు. జూన్ 11న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను సింగిల్‌జడ్జి రద్దు చేసిన విషయం తెలిసిందే. బయోమెట్రిక్ తీసుకోకపోవడం, ఫొటో లేకుండానే ఓఎంఆర్ షీట్లు ఇవ్వడం, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్యలో పరస్పర విరుద్ధ వివరాలు వెల్లడించడాన్ని తప్పుబట్టింది. టీఎస్‌పీఎస్సీ లోపాల కారణంగా ఒక్క మెరిట్ అభ్యర్థి అర్హత కోల్పోయినా, అది న్యాయసమ్మతం, సమర్థనీయం కాదంటూ గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. అన్ని జాగ్రత్తలు తీసుకొని మళ్లీ పరీక్ష నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీని ఆదేశించిన విషయం విదితమే.

అప్పీల్ పిటిషన్‌లో ఏముందంటే...

'ఈ కేసులో సింగిల్‌జడ్జి తీర్పు చట్టసమర్థనీయం కాదు. రిట్ పిటిషన్ అస్పష్టమైన ఆరోపణలతో దాఖలు చేశారు. వారు దాఖలు చేసిన మేరకు మెటీరియల్ కూడా రుజువు కాలేదు. పరీక్ష తదుపరి ప్రక్రియ నిలిపివేసే ఉద్దేశంతోనే పిటిషన్ వేసిన విషయాన్ని జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు. బయోమెట్రిక్ నిర్వహించలేదని పరీక్ష రద్దు చేయడం చట్టవిరుద్ధం. కేవలం ముగ్గురి ఆరోపణలతో 2,33,506 మంది రాసిన పరీక్షను రద్దు చేయడం వారి భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మారుస్తుంది. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా పరీక్ష నిర్వహించింది. టీఎస్‌పీఎస్సీకి పరీక్షల నిర్వహణ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ, అధికారం ఉంది. బయోమెట్రిక్ తీసుకోవడంలో ఇబ్బందులతో కమిషన్ దాన్ని తీసుకోలేదు. అందుకే ఇతర తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టింది. నోటిఫికేషన్‌లో బయోమెట్రిక్ అని చెప్పి పరీక్ష సమయంలో తీసుకోలేదు అన్న ఆరోపణల సరికాదు. కొందరికి బయోమెట్రిక్ తీసుకొని.. మరికొందరికి తీసుకోకపోతే దానిని తప్పుబట్టడంలో అర్థం ఉంది. కానీ, ఇక్కడ అభ్యర్థులందరికీ కమిషన్ ఒకేలా వ్యవహరించింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ల విషయంలో చిన్నచిన్న ఆరోపణల్లో జోక్యం చేసుకోవద్దని సుప్రీం కోర్టు గతంలోనే సూచించింది. నోటిఫికేషన్‌లో మార్పుచేర్పులకు అన్ని అధికారాలు ఉన్నాయని నోటిఫికేషన్ రోజునే కమిషన్ పేర్కొంది. ప్రిలిమ్స్ స్క్రీనింగ్ టెస్ట్ మాత్రమే. వీరంతా మెయిన్స్ పరీక్ష ఎదుర్కోవాల్సి ఉంటుంది. మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించకుండా ఎవరూ ఉద్యోగం చేపట్టలేరు. ముగ్గురి కోసం మిగతా 2,33,503 మంది గొంతు నొక్కడం చట్టవిరుద్ధం. ఈ అంశాలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు. ద్విసభ్య ధర్మాసనం వాటిని పరిశీలించి, అప్పీల్‌ను అనుమతించాలి. గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాల విడుదల, తదుపరి ప్రక్రియకు అనుమతించాలి'.

ఉన్నత విద్య పేదవాళ్లకి అందాలి

- వర్సిటీల్లో మౌలిక వసతులు ముఖ్యం
- పూర్వ విద్యార్థుల చేయూత అవసరం: గవర్నర్ తమిళి సై



సాక్షి, హైదరాబాద్: నాణ్యమైన ఉన్నత విద్య పేదవాళ్లందరికీ అందాలని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ ఆకాంక్షించారు. ఈ దిశగా విద్యా సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. జాతీయ విద్యావిధానం–2020 ఈ తరహా మార్పులకు శ్రీకారం చుడుతుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. ''విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు– పూర్వ విద్యార్థులతో సంబంధాలు'' అనే అంశంపై సోమ వారం రాజ్‌భవన్‌లో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని పలు విశ్వవి ద్యాలయాల వీసీలు, ఉన్నతాధికారులు, వివిధ రంగాల్లో స్థిరపడిన వర్సిటీల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళి సై మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతు లు పెంచి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బోధన విధానాలు తీసుకురావాలని సూచించారు.

అకడమిక్ యాక్టివిటీని వర్సిటీలు మర్చిపోయాయి

ప్రపంచంతో పోటీ పడగల సత్తా రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఉందని, అయితే అకడమిక్ యాక్టివిటీని విశ్వవిద్యాలయాలు మరిచిపోయా యని ఆమె వ్యాఖ్యానించారు. సరైన బోధన విధానాలు, మౌలిక వసతులు కల్పిస్తే ఇప్పుడు ప్రపంచ విశ్వవిద్యాలయాల గురించి చెప్పుకున్నట్టే, భవిష్యత్‌లో మన యూనివర్సిటీల గురించి చర్చించుకునే వీలుందన్నారు. విద్యావికాసానికి డిజిటల్ లైబ్రరీ మంచి అవకాశంగా పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సహకారం విశ్వవిద్యాలయాలకు అత్యంత ముఖ్యమని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.

'నైరుతి' నిష్క్రమణ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తవుతుందని భారత వాతావరణ విభాగం వర్గాలు చెబుతున్నాయి.

సాధారణ వర్షాలతోనే సగటును దాటి...

ఈసారి నైరుతి సీజన్‌లో రాష్ట్రంలో కేవలం నాలుగు అల్పపీడనాలే ఏర్పడ్డాయి. అవి కూడా స్వల్పంగానే ప్రభావం చూపడంతో భారీ వర్షాలు నమోదు కాలే దు. వాయుగుండాలు, తుపానులు ఏర్పడితే సమృద్ధిగా వానలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ బంగాళాఖాతంలో ఒక్క వాయుగుండం లేదా తుపాను కూడా ఏర్పడలేదు. దీంతో రాష్ట్రంలో ఈ సీజన్ సాధారణ వర్షాలతోనే ముగుస్తోంది. నైరుతి రుతు పవనాల సీజన్‌లో రాష్ట్రంలో 72.5 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాలి. ఇందులో భా గంగా ఈ నెల 25 నాటికి 71.73 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఏకంగా 84.01 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 17% అధికంగా వర్షాలు కురిసినప్పటికీ అతితక్కువ సమయంలో భారీ వర్షా లు కురవడంతో డ్రైస్పెల్స్ (వర్షాల మధ్య అంతరం) ఎక్కువగా ఉన్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఈ సమయంలోనూ వర్షాలు

నైరుతి రుతుపవనాల తిరోగమనంలోనూ వర్షాలు కురుస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలకు ఆస్కారం ఉంటుందని... రుతుపవనాలు చురుకుదనం సంతరించుకుంటే భారీ వర్షాలకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇలా తిరోగమనంలో కురిసే వర్షాలతో రాష్ట్రంలో మరింత సమృద్ధిగా వర్షపాతం గణాంకాలు నమోదు కావొచ్చని అంచనా వేస్తున్నారు. తిరోగమన ప్రభావం వచ్చే నెల 15 వరకు ఉంటుందని, అప్పటివరకు వర్షాలకు అవకాశం ఉంటుందని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారు. నైరుతి ఉత్తరప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

సముచిత సంఖ్యలో టికెట్లు ఇవ్వాలి

'ధర్మయుద్ధం' పేరుతో ముదిరాజ్‌ల ర్యాలీ



కామారెడ్డి టౌన్: అన్ని పార్టీలు తమకు సముచిత సంఖ్యలో టికెట్లు ఇవ్వాలన్న డిమాండ్‌తో ముదిరాజ్‌లు సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్మయుద్ధం పేరుతో ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ గ్రౌండ్ నుంచి కొత్త బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్‌రోడ్, సిరిసిల్ల రోడ్ మీదుగా సాగి కామారెడ్డి డిగ్రీ కళాశాల మైదానానికి ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నేత నిజ్జన రమేశ్ మాట్లాడుతూ ముదిరాజ్‌లకు ఒక్క టికెట్ ఇవ్వని బీఆర్ఎస్ తీరును ఎండగట్టారు. సీఎంకు వ్యతిరేకంగా కామారెడ్డిలో భారీగా నామినేషన్లు వేస్తామన్నారు. ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలని, రూ.10 వేల కోట్లతో ముదిరాజ్ ఆర్థిక సహకార సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



మీ పట్ల మీరు కఠినంగా ఉండండి.
కానీ ఇతరులతో సౌమ్యంగా వ్యవహరించండి.
- మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 26 సెప్టెంబర్ 2023

ఎట్టకేలకు కాసింత స్వేచ్ఛ!

ఒకటి కాదు... రెండు కాదు... 143 రోజుల తర్వాత మోక్షం లభించింది. కల్లోలిత మణిపూర్‌లోని బీరేన్‌సింగ్ సర్కార్ ఎట్టకేలకు శనివారం నుంచి మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించింది. అపరిమిత ఆలస్యం తరువాతైన అయితేనేం, పాలకులు ఇన్నాళ్ళకు ఒక అడుగు ముందుకు వేసినట్ట యింది. రాష్ట్రంలో సాధారణ స్థితి నెలకొల్పేందుకు తీసుకున్న చర్యగా ఇంటర్నెట్ సేవల పునరుద్ధరణ నిర్ణయం హర్షించదగ్గ విషయం. మే 3న రెండు ప్రధాన వర్గాల మధ్య ఘర్షణలు మొదలైనప్పుడే నెట్ సేవలపై రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. ఆ తరువాత జూన్ 25న బ్రాడ్‌బ్యాండ్ సేవలను అనేక షరతులతో పాక్షికంగా పునరుద్ధరించినా, మొబైల్‌లో నెట్‌పై ఇప్పటి దాకా నిషేధం కొనసాగింది. నూటికి 95 మంది మొబైల్‌తోనే నెట్ సేవలందుకొనే మన దేశంలో ఇప్పుడీ ఎత్తివేత నిర్ణయం మణిపూర్‌లో అందరికీ సాంత్వన. కుంటుపడ్డ ఆర్థిక వ్యవస్థకూ, జీవనోపాధికీ పెద్ద ఊపిరి.

''రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగైనందు వల్ల'' ఇప్పుడు మొబైల్ నెట్ సేవల పునరుద్ధరణ నిర్ణయం తీసుకున్నామన్నది సర్కారు వారి మాట. మణిపూర్‌లో పరిస్థితిపై ప్రభుత్వ కథనంలో నిజానిజాలు ఎంత అన్నది చర్చనీయాంశమే. అయితే, నిర్ణయం ఎందుకు తీసుకున్న ప్పటికీ... జనజీవితాన్ని ప్రభావితం చేస్తూ, అసత్యాల వ్యాప్తికి కారణమవుతున్న నిషేధాన్ని ఎత్తి వేయడం కచ్చితంగా సమంజసం. అందులో మరో మాట లేదు. మణిపూర్‌లో పర్యటించిన ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా బృందం సైతం ఇంటర్నెట్ సేవల నిషేధం చెడు చేసిందని పేర్కొన్న సంగతి మర్చిపోలేం. ఇంటర్నెట్ లేక, నిజనిర్ధారణకు వీలు లేక మీడియా చివరకు ప్రభుత్వపు గూటి చిలకగా మారి, ఆ గూటి పలుకులే పలికే దుఃస్థితి తలెత్తిందని విమర్శలు వచ్చాయి. సత్యనిష్ఠ గల మీడియా లేకపోవడంతో, అదే సందుగా పుకార్లు షికార్లు చేశాయి. విద్వేషవ్యాప్తితో అగ్నికి ఆజ్యం పోశాయి. అలాంటి ఓ పుకారే చివరకు ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన హేయమైన ఘటనకు దారి తీసిందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఇప్పటికే మణిపూర్ ఘర్షణల్లో 175 మందికి పైగా బలి కాగా, 60 వేల మంది నిరాశ్రయుల య్యారు. జీవితాలు చెల్లాచెదరయ్యాయి. పరిస్థితిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు కాల యాపన చేశాయి. ఫేక్ న్యూస్ అపుతామంటూ పెట్టిన నెట్ నిషేధం అసలు న్యూస్ ఏమిటో ప్రపం చానికి అందకుండా చేసింది. అసలు సమస్య ఎక్కడుందో ముందే కనిపెట్టి, బలగాలు త్వరితగతిన చర్యలు చేపట్టే అవకాశాన్ని చేజార్చుకుంది. ఇవాళ ప్రజలు పూర్తిగా రెండు శిబిరాలుగా చీలిపోయే పరిస్థితిని కొనితెచ్చింది. గతంలో కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత దాదాపు రెండేళ్ళ పాటు ఇంట ర్నెట్‌పై నిషేధం నడిచింది. ఆ తర్వాత మళ్ళీ ఇలా దాదాపు 5 నెలల దీర్ఘకాలం నెట్ సేవలపై కట్టడి కొనసాగింది మణిపూర్‌లోనే! గత అయిదేళ్ళలో ప్రపంచంలో మరే దేశమూ చేయనన్నిసార్లు భారత్ నెట్‌పై కట్టడి పెట్టింది. ఒక్క 2022లోనే 84 సార్లు నెట్ షట్‌డౌన్లు సాగాయి. ఏ కొద్ది నిరసన తలెత్తినా అణచివేసేందుకు నెట్ నిలిపివేత కొత్త రాజకీయ నియంత్రణ సాధనంగా మారడం విషాదం.

రష్యా, సూడాన్, ఇరాన్, మయన్మార్, ఇథియోపియా సహా నిరంకుశ పాలన సాగే అనేక దేశాల్లో కన్నా మన ప్రజాస్వామ్య భారతంలోనే ఇంటర్నెట్ సేవల్ని తరచూ ఆపేయడం విడ్డూరం. నిజానికి, ఇంటర్నెట్ సేవలను నిరవధికంగా సస్పెండ్ చేయడం చట్టవిరుద్ధమని 'అనురాధా భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' (2020) కేసులో సుప్రీమ్ కోర్ట్ స్పష్టం చేసింది. వాక్ స్వాతంత్య్రం, ఇంటర్నెట్‌ను ఉపయోగించి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే స్వేచ్ఛ అనేవి ప్రాథమిక హక్కు లనీ, నెట్‌పై నిషేధం వాటికి భంగం కలిగించడమేననీ కోర్ట్ అప్పుడే తేల్చింది. అత్యవసరమై నిషేధం పెట్టినా దాన్ని పొడిగిస్తూ పోరాదనీ చెప్పింది. ప్రభుత్వాలు ఆ స్ఫూర్తిని అర్థం చేసుకోవట్లేదు. శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం మానేసి, దానికి ప్రత్యామ్నాయం నెట్‌పై నిషేధమే అన్నట్టు ప్రవర్తిస్తున్నాయి. ఇది పరిష్కారం కాదని సుప్రీమ్ తప్పుబట్టింది. కానీ, ఇప్పటి దాకా మణిపూర్ సర్కార్ చేసింది అదే. తాజాగా ఈ మార్చిలో పంజాబ్‌లో వేర్పాటువాద నేత పరారీ, జూలైలో హర్యానాలో మతఘర్షణల సమయంలో ఇతర ప్రభుత్వాలూ ఆ పనే చేశాయి.

మణిపూర్‌లో మైతేయ్‌లకూ, కుకీలకూ మధ్య పేరుకున్న విద్వేషాన్ని పోగొట్టాలంటే పాలకులు చేయాల్సిన పని వేరు. ముందు సమన్యాయం పాటించాలి. అందరితోనూ సుహృద్భావ పూర్వక చర్చలు జరపాలి. తీవ్రవాద వర్గాన్ని ఏకాకిని చేయాలి. సమాజంలో సహనం, శాంతి, పరస్పర విశ్వాసం నెలకొనేలా ఒక్కొక్క అడుగూ వేయాలి. కానీ, ఒక వర్గానికే కొమ్ము కాస్తూ, సొంత సహచరుల నమ్మకమే కోల్పోయిన పాలకుడికి అది కష్టమే!

ఇప్పటికీ మణిపూర్ సాధారణ స్థితికి రాలేదని వార్త. కానీ, అందుకు నెట్‌పై విరుచుకుపడడం సరికాదు. ఆ వివేకం ఇన్నాళ్ళకు మన పాలకులలో మేలుకొన్నట్టుంది. 'డిజిటల్ ఇండియా' స్వప్నం తో, నెలకు వెయ్యి కోట్ల సంఖ్యలో డిజిటల్ చెల్లింపులతో రొమ్ము విరుచుకుంటున్న దేశం తరచూ నెట్ ఆపేస్తే, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అది చెల్లదు. నెట్ నిషేధంతో మణిపూర్ 60 లక్షల డాలర్లు, దేశవ్యాప్తంగా 400 కోట్ల డాలర్లు నష్టం వచ్చిందని అంచనా. బ్రిటీషు కాలపు టెలిగ్రాఫ్ చట్టం-1885ను అడ్డం పెట్టుకొని కోర్టులకు చిక్కకుండా యథేచ్ఛగా నెట్‌పై నిషేధం పెట్టడం పాలకులకు శోభనివ్వదు. మణిపూర్ ఉదంతంతోనైనా మన ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకొని, తీరు మార్చుకుంటే మనుషులకూ, మానవ హక్కులకూ మేలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి: శు.ద్వాదశి రా.11.14 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: శ్రవణం ఉ.7.44 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: ప.11.28 నుండి 12.04 వరకు, దుర్ముహూర్తం ఉ.8.17 నుండి 9.05 వరకు.తదుపరి రా.10.42 నుండి 11.31 వరకు, అమృతఘడియలు: రా.8.23 నుండి 9.54 వరకు

సూర్యోదయం: 5.53
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

వైద్యంలో వీరుడు

అఖిల భారత స్థాయి హోమియో వైద్యుడిగా పేరొందిన డాక్టర్ సోహన్ సింగ్ అచ్చమైన తెలుగువాడు. గదర్ వీరుడు సోహన్ సింగ్ జోషీ స్ఫూర్తితో ఆయనకు ఆ పేరు పెట్టారు. దానికి తగ్గట్టుగానే, రాష్ట్రంలోనూ, దేశ వ్యాప్తంగానూ ఉచిత హోమియో ప్రజా వైద్య శిబిరాలు నెలకొల్పుతూ, మందులు అందిస్తూ తాను చనిపోయేదాకా విశిష్ట సేవలు అందిం చారు సోహన్ సింగ్. వైద్యంలో వీరుడిగా నిలిచారు.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అఖిల భారత స్థాయి హోమియో వైద్యుడు, హోమియోలో కేంద్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సోహన్ సింగ్ వైద్య వృత్తిలోనూ 'గదర్' వీరుల వారసత్వాన్ని అందిపుచ్చుకొన్న సామాజిక కార్యకర్త. నరనరాన ప్రజా సేవలోనే తరించుతూ ఈ నెల 24న తన 76వ ఏట కన్నుమూశారు. అభ్యుదయ కవి పండితులు, పాత్రికేయ కురువృద్ధు తాపీ ధర్మారావు మనవరాలు విమలను సోహన్ సింగ్ పెళ్లాడారు. ఈమె 'విశాలాంధ్ర' దినపత్రిక సంపా దకునిగా పనిచేసిన తాపీ మోహనరావు కుమార్తె. మా తరం అంతా తాపీ మోహనరావు ఆధ్వర్యంలో పాత్రికేయ వృత్తి మెలకువలు దిద్దుకున్న వాళ్లమే.

ఒక తెలుగువాడికి 'సోహన్ సింగ్' అని పేరు పెట్టడానికి కారణం, 'గదర్ పార్టీ' వీరులలో ఒకరైన 'సోహన్ సింగ్ జోషీ'. దరిశి చెంచయ్య స్థాపించిన ఈ పార్టీ తెలుగునాట విప్లవోద్యమ బీజాలు నాటిందని మరచిపోరాదు. ఇంతటి పూర్వ చరిత్ర స్ఫూర్తితో ఎదుగుతూ, రాష్ట్రంలోనూ, దేశ వ్యాప్తంగానూ ఉచిత హోమియో ప్రజా వైద్య శిబిరాలు నెలకొల్పుతూ, మందులు అందిస్తూ తాను చనిపోయేదాకా విశిష్ట సేవలు అందించారు సోహన్ సింగ్.

ఈ ఆచరణలో భాగంగానే 'ధర్మకిరణ్ హోమియో రీసెర్చ్ ఫౌండేషన్'ను, అదే పేరిట హోమియో వైద్యశాలను, ఆదర్శ హోమియో ఫార్మసీ, కళాశాలలను నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి హోమియో రీసెర్చ్ కేంద్రం ఏర్పా టుకు తన చొరవతో పథకం రచించగా దాన్ని కేంద్రం గుర్తించింది. పెక్కు శారీరక రుగ్మతలకు శాశ్వత పరిష్కా రాలు చూపిన ఘనాపాఠి సోహన్ సింగ్. ఎన్నో కుటుం బాలకు, స్కూళ్లకు 1999 నుంచి 2022 దాకా హోమియో మందుల 'కిట్స్'ను అందించుతూ వచ్చారు. వైద్య సదుపాయాలు అందక పెక్కు రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ఆదివాసీ ప్రాంతాల ప్రజలకు సేవలు అందించారు. పెక్కు దేశీయ, రాష్ట్రీయ కేంద్రా లలోని వైద్య శాఖల సమన్వయ కర్తగా అమూల్యమైన సేవలందించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఆంధ్రప్రదేశ్ హోమియో మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు దాదాపు 28 సంవత్సరాలుగా సలహాదారుగా ఉన్నారు. హోమియో రీసెర్చ్ ఫౌండేషన్ ఫార్మా యూనిట్ ఆధ్వర్యంలో విదేశాల నుంచి దిగుమతి అయ్యే మందుల స్థానే దేశీయ నాణ్యమైన హోమియో మందుల ఉత్పత్తికి కృషి చేశారు. దేశీయ వృక్ష జాతుల నుంచి లభించే ముడి సరుకు ఆధారంగా హోమియో టించర్లను, టిష్యూ సాల్ట్స్‌ను ఉత్పత్తి చేయించారు.



డాక్టర్ సోహన్ సింగ్

''సోహన్ సింగ్ కర్మయోగి, పని.. పని.. పని... తప్ప మరో ధ్యేయం, యావ లేని వైద్యుడు. కొందరు రోజుకు 24 గంటలేనా అని బాధపడతారు, కొందరు జీవితాలకు లక్ష్యాలు ఏర్పరచుకుంటారు. అతి కొద్దిమంది మాత్రమే నెలలకు, సంవత్సరాలకూ కూడా లక్ష్యాలు పెట్టుకుంటారు. ఒకటి పూర్తవగానే ఇంకొకటి, అలా లక్ష్యాలను వెంటాడుతూనే ఉంటారు. పనే ప్రాణం, లేకపోతే వారికి ఊపిరాడదు! ఆ లక్ష్యాల నుండి ఎడబాటుండదు, తడబాటుండదు. వారికి వయస్సు విరోధి కాదు, రోగాలను గురించి తలచుకునే సమయం ఉండదు. వారెవరో కాదు, మన సోహన్ సింగ్. భారత హోమియోపతి వైద్యంలో సోహన్ సింగ్ చూడని లోతులూ లేవు, ఎక్కని ఎత్తులూ లేవు... తెల్లవారు జామున సుదూర ప్రయాణాలు చేసి ఆయన ఇచ్చే తెల్లపంచదార మాత్రల కోసం జనాలు చకోర పక్షుల్లా ఎదురుచూస్తుంటే ఎవరైనా ఆశ్చర్యపోవలసిందే. ఆయన ఇచ్చే మందులు తన వ్యవసాయ క్షేత్రంలో పెంచిన మూలికల నుంచే తీసుకుని తన సొంత ఫార్మసీలోనే తయారు చేసుకుంటారు. అత్యుత్తమమైన వైద్య సేవలు అందించిన సోహన్ సింగ్ వైద్యనారాయణుడు, వైద్యులందరికీ ఆదర్శనీయులు'' అని డాక్టర్ చెరుకూరి బాలచంద్రమోహన్, సతీమణి డాక్టర్ సత్యవతీ దేవిల అభిభాషణ. 'ధర్మకిరణ్ హోమియో పరిశోధనా సంస్థ' అధ్యక్షురాలు పి. నీలిమా సతీష్ మాటల్లో చెప్పాలంటే, ''చెట్లను, మొక్కల్ని కాపాడుకోగల్గితే, అవి తిరిగి మనల్ని రక్షించి, పక్షవాతు రోగాలు రాకుండా కాపాడతాయి.''

ఆరోగ్య ప్రదాయినిగా మన దేశంలో హోమియో వైద్య విధానాన్ని పెంచి పోషించి, ప్రజా బాహుళ్యం ఆరోగ్య భాగ్యానికి అనితర సాధ్యంగా దోహదకారి అయి, మనందరి ఆరోగ్య భావి భాగ్యోదయాల్ని కాంక్షిస్తూ శాశ్వతంగా సెలవు తీసుకున్న ప్రజా వైద్యుడు సోహన్ సింగ్‌కు ఇదే నివాళి!


abkprasad2006@yahoo.co.in

(సుప్రసిద్ధ హోమియో వైద్యుడు డాక్టర్ సోహన్ సింగ్ సెప్టెంబర్ 24న మరణించారు.)

రొమాంటిక్ హీరో

హిందీ సినిమా రంగంలో అయిదు దశాబ్దాలకు పైగా నటుడిగా కొన సాగారు దేవానంద్. ఆయన నటనే స్టైల్‌కు పర్యాయపదంగా నిలిచి పోయింది. నిర్మాతగా, రచయితగా, దర్శకుడిగా కూడా కొనసాగుతూ ఎంతోమంది ప్రతిభావంతుల్ని సినీతెరకు పరిచయం చేశారు. శతజయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆయన సినిమాలు ప్రదర్శితమయ్యాయి.

సందర్భం



వారాల ఆనంద్

హిందీ ప్రధాన స్రవంతి సినిమాల్లో దేవానంద్‌కు ముందు పేరొందిన నటులున్నారు. ఆయన తర్వాత కాలంలో కూడా ఎంతో మంది నటులు వచ్చారు. కానీ దేవానంద్ స్టైల్, స్టైల్ విలక్షణమయినవి. ఆయన కదలిక, ఆహార్యం మొత్తంగా ఆయన నటనే స్టైల్‌కు పర్యాయ పదంగా నిలిచిపోయింది. ఆయన సినిమాల్లోని పాటలు నేటికీ జనాన్ని మంత్రముగ్ధుల్ని చేస్తూనే ఉన్నాయి. 'మై జిందగీ కా సాత్ నిభాతా చలాగయా', 'కొయా కొయా చాంద్', 'గాతా రహే మేరా దిల్' లాంటి పాటల్ని ఎవరు మరిచిపోగలరు?

ఆ కాలంలో దిలీప్ కుమార్ విషాదాంత పాత్రలకు పర్యాయ పదంగా ఉండి, మధ్యతరగతి ప్రజల్ని, ఆనాటి మేధావుల్ని అలరిస్తున్నాడు. మరో వైపు చార్లీ చాప్లిన్ తరహా ట్రాంప్‌లా రాజ్ కపూర్ సామాన్య జన జీవితాల్లోకి చొచ్చుకు పోతున్నాడు. ఆ పరిస్థితుల్లో వారిద్దరికీ భిన్నంగా, తనదైన చేతనాత్మకమైన ధోరణితో నిలిచి గెలిచాడు దేవానంద్. సురయ్యా, మధుబాల, వైజయంతిమాల, హేమామాలిని, వహీదా రెహమాన్, నూతన్, గీతా దత్ లాంటి వాళ్ళతో ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించాడు.

1923లో పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో దేవానంద్ జన్మించాడు. పంజాబ్ విశ్వ విద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసుకుని బొంబాయి బయలుదేరాడు. అప్పటికే సినీ రంగంలో కృషి చేస్తున్న సోదరుడు చేతన్ ఆనంద్‌తో కలిసి తన భవిష్యత్తును నిర్మించుకుందామని ఆలోచన. 1946లో ప్రభాత్ వాళ్ళు నిర్మిం చిన 'హమ్ ఏక్ హై'తో దేవ్ తన నట జీవితాన్ని ఆరంభించాడు. అప్పుడే గురు దత్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ మిత్రులయ్యారు. తాను నిర్మాతగా మారి దర్శకుడిని చేస్తానని హామీ ఇచ్చాడు. రష్యన్ సినిమా 'ఇన్‌స్పెక్టర్ జనరల్' ప్రేరణతో చేతన్ ఆనంద్ తీసిన 'అఫ్సర్'తో ఎస్.డి.బర్మన్‌ను సంగీత దర్శకుడిగా పరి చయం చేశాడు. తర్వాత బాల్ రాజ్ సహానీ స్క్రిప్ట్ ఆధారంగా 'బాజీ' తీశాడు. గురుదత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉర్దూ కవి సాహిర్ లుధియాన్వీ మొదటిసారిగా గీతాలు రాశాడు. ఈ సినిమాతోనే కమెడియన్‌గా జానీ వాకర్ కూడా పరిచయం అయ్యాడు. గీతా రాయ్‌ను గురుదత్, కల్పనా కార్తీక్‌ను దేవా నంద్ ఈ చిత్ర సమయంలోనే కలుసుకున్నారు. ఆ తర్వాత వాళ్ళు జంటలయ్యారు.



దేవానంద్

వహీదా రహ్మాన్‌తో దేవానంద్ అనేక విజయవంతమయిన సినిమాలు చేశాడు. వారిద్దరిదీ అప్పుడు హిందీ సినిమాల్లో గొప్ప హిట్ జంట. 'సోల్వా సాల్', 'గైడ్', 'కాలా బాజార్', 'బాత్ ఏక్ రాత్ కీ' వంటి సినిమాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. 'గైడ్' మొట్ట మొదటి ఇండో అమె రికన్ సినిమాగా రూపొందింది. ఆర్.కె.నారాయణ్ నవల ఆధారంగా తీసిన ఈ సినిమా విమర్శ కుల ప్రశంసల్ని అందుకుంది.

నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు ముగ్గురు త్రిమూర్తుల్ని- అంటే దేవానంద్, రాజ్‌కపూర్, దిలీప్ కుమార్‌లను తీన్‌మూర్తి భవన్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించారు. అయిదు దశాబ్దాలకు పైగా హిందీ సినిమా రంగంలో తనదయిన శైలిలో నటిస్తూ, నిర్మిస్తూ... రచయితగా, దర్శకుడిగా కూడా కొనసాగుతూ... మొండితనంతో, తృష్ణతో తన నిర్మాణ సంస్థ 'నవకేతన్'ను 52 ఏళ్ళకు పైగా సజీవంగా ఉంచుకున్నాడు దేవానంద్. 2001లో పద్మభూషణ్, 2002లో దాదా సాహెబ్ ఫాల్కే వరించాయి. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమెకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. నేషనల్ పార్టీ ఆఫ్ ఇండియా పేర రాజకీయ పార్టీని స్థాపించి నప్పటికీ దాన్ని ఎక్కువ కాలం నడపలేదు. దేవానంద్ జన్మశతాబ్ది సందర్భంగా దేశ వ్యాప్తంగా 30 నగరాల్లో 55 టాకీసుల్లో ఆయన నటించిన సినిమాలతో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డి.సి. ఆర్కైవ్స్ ఆధ్వర్యంలో ఇది జరిగింది.

వ్యాసకర్త కవి, విమర్శకుడు. 94405 01281

(నేడు నటుడు దేవానంద్ శతజయంతి.)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాటలు తాజాగా ఇలా...!

దాంపత్యం లోకి...



బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ మీద మొదటి సంభాషణ జరిగిన క్షణం నుంచే మా హృదయాలకు తెలుసు... ఈ రోజు కోసం సుదీర్ఘకాలంగా నిరీక్షిస్తున్నాం... ఎట్టకేలకు శ్రీమతి, శ్రీ రాగలిగాం. మా శాశ్వతగాథ ఇప్పుడు మొదలైంది. ('ఆప్' నేత రాఘవ్ చద్దాను పెళ్లాడారు.)

- పరిణీతి చోప్రా, నటి

వివరించాం



జెనీవా (స్విట్జర్లాండ్)లోని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల వేదిక (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) 54వ సమావేశంలో ఇండియా తరఫున నా జమ్ము కశ్మీర్ ప్రజల ప్రతినిధిగా పాల్గొన్నాను. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే), గిల్గిత్ బాల్టిస్తాన్‌లలో పాక్ ఆక్రమణ వల్ల మన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మాట్లాడాను.

- జావేద్ బేగ్, యాక్టివిస్ట్


చిత్రం



ఖలిస్తానీ గ్రూపునకు చెందిన నేతను చంపడంలో ఇండియా ప్రమేయం ఉందని నిరూపించే సమాచారం కెనడా వద్ద ఉందట; కానీ తన దేశంలో దశాబ్దాలుగా నివసిస్తున్న ఒక మనిషిని పార్లమెంటుకు ఆహ్వానించి గౌరవించే దాకా ఆయన నాజీ అని దానికి తెలియదట! భలే విడ్డూరం.

- స్వాతి జానీ, జర్నలిస్ట్

బాలేదు



తన అత్యుత్తమ రోజుల్లో 'ఈ సైటు' (ట్విట్టర్/ఎక్స్) ఏం చేసిందో దానికి ట్విట్టర్ అనే పేరే పర్ఫెక్టుగా సరిపోతుంది. 'ఎక్స్' కాదు.

- స్టీఫెన్ కింగ్, రచయిత

ఇన్ బాక్స్

తెలంగాణ పోరాట స్ఫూర్తి!

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ). నిజాం నవాబుకూ, ఆయన తొత్తులైన భూస్వాములకూ వ్యతిరేకంగా జరిగిన తెలం గాణ సాయుధ పోరాటంలో తన ఇల్లునే కార్యాలయంగా మార్చిందామె. 1895 సెప్టెంబర్ 26న సద్దుల బతుకమ్మ నాడు వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో ఆమె జన్మించింది. చిన్న వయస్సులోనే పాలకుర్తికి చెందిన నర్సయ్యతో వివాహం అయింది.



చాకలి ఐలమ్మ

పాలకుర్తి పరిసరాల్లో మల్లంపల్లి దొరవద్ద కొంత భూమిని ఐలమ్మ కుటుంబం కౌలుకు తీసుకొని సాగు చేసింది. ఇది పాల కుర్తి పొరుగునే ఉన్న విస్నూర్ గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ రేపాక రామచంద్రారెడ్డికి కోపం తెప్పించింది. దొర గడీల్లో వంతుల వారీగా వెట్టి చేసే ఐలమ్మ కుటుంబం సొంతంగా భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసుకోవడం సహించలేక పోయాడు. ఐలమ్మ భూమిని కాజేయాలనీ, ఆమె పండించిన పంటను గూండాలతో కొల్లగొట్టించాలనీ చూశాడు. ఐలమ్మ 'ఆంధ్ర మహాసభ' నాయకత్వంలో ఎర్రజెండా పట్టింది. పోరాడింది.'గుత్పల సంఘం' సభ్యులు, గ్రామ స్థుల సహకారంతో పంటను తరలించుకు పోవడానికి వచ్చిన గూండాలను తరిమి కొట్టింది. ఐలమ్మ సాధించిన ఈ విజయం తెలంగాణలో భూపోరాటానికి నాంది అయింది. చివరకు రైతాంగ సాయుధ పోరాటం సాగి వేలాది ఎకరాలు సాగు చేసు కునే రైతుల పరం అయ్యాయి. ఐలమ్మ 1985 సెప్టెంబర్ 1న తుది శ్వాస విడిచింది.


ఉద్యమనాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రత్యేక చొరవతో వేసిన సబ్ కమిటీ తెలంగాణ పాఠశాల విద్యలో ఆమె జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చింది. వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజక వర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌కి 'చాకలి ఐలమ్మ' పేరు పెట్టి ప్రభుత్వం ఆమె పట్ల ఉన్న గౌరవాన్ని చాటుకొంది. అంతేకాదు చిట్యాల ఐలమ్మను 'తెలంగాణ తల్లి'గా గుర్తించి 2021 సెప్టెంబర్ 26 నుండి ఆమె జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోంది.

– కొండూరు సత్యనారాయణ, రజక సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన సలహాదారు

(నేడు చాకలి ఐలమ్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది)

ఆ ధర్మం సమస్త పీడితులకు వ్యతిరేకం

అభిప్రాయం



కంచ ఐలయ్య షెపర్డ్

బీజేపీ అగ్రశ్రేణి మంత్రులైన అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా తాము సనాతన ధర్మాన్ని పరి రక్షిస్తున్నామని ప్రకటించారు. సనాతన ధర్మం బ్రాహ్మణిజా నికి చెందిన పురాతన తత్వశాస్త్రం. దాని మూలాలు ఋగ్వేదంలో ఉన్నాయి. ఇది ఇతర సంస్కృత గ్రంథాల ద్వారా ఉద్భవించింది.

మనుధర్మాన్ని రచించిన బ్రాహ్మణ రచయితలు దాని రచనా సమయానికి... అభ్యాసం, ఆధ్యాత్మిక సిద్ధాంతాలనే సనాతన ధర్మంగా సంశ్లేషించారు. ఇది ఉత్పాదక శ్రమకు, ఉత్పత్తిలో పాల్గొనే సామాజిక ప్రజారాశు (శూద్ర, 'ఛండాల', వనవాసు)లకు వ్యతి రేకంగా నిలిచింది. ఆ తత్వాన్ని బీజేపీ అగ్రశ్రేణి మంత్రులు, నేతలు ఇప్పుడు తమ సొంతం చేసు కున్నారు.

ఇటీవలే ఈ అంశంపై విలేఖరుల సమావేశంలో ప్రసంగించిన బీజేపీ సీనియర్ అధికార ప్రతినిధి రవి శంకర్ ప్రసాద్, 'సనాతన ధర్మం ప్రతి ఒక్కరికీ శాశ్వ తమైన చట్టం' అని నిర్వచించారు. ఆయన అభి ప్రాయం ప్రకారం సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారు దాని పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే శూద్రులు, దళితులు, ఆదివాసీలందరూ ఈ సనాతన ధర్మాన్ని ఎలా అంగీకరించగలరు?

చివరగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'దీనికి సరైన సమాధానం కావాలి' అని చెప్పారు. ఇప్పుడు అసలు రహస్యం బయటపడింది. సనాతన ధర్మం పక్షాన వీరంతా నిలిచారు. సనాతన ధర్మంలోనే ఉత్పత్తి కాలుష్యం అనే సిద్ధాంతానికి మూలాలు ఉన్నాయి. తాజాగా, 45 ఏళ్ల యువకుడైన ఉదయనిధి స్టాలిన్‌పై కేంద్రప్రభుత్వం యుద్ధం ప్రకటించినట్లు కనిపించింది. నిజానికి ఇది శూద్ర దళితులకు, ఆది వాసీలందరికీ వ్యతిరేకంగా సాగిన సంప్రదాయ యుద్ధ పద్ధతి మాత్రమే.

కొత్తగా పునరుద్ధరించిన ఈ పురాతన సనాతన భావజాలం... ఉదయనిధి స్టాలిన్‌పై, 'ఇండియా' కూటమిపై దాడి చేయడానికి బీజేపీకి ఒక ఆయుధ మయ్యింది. కరుణానిధి మనవడూ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడూ అయిన ఉదయ నిధి స్టాలిన్ సనాతన ధర్మానికి వ్యతిరేకంగా అకస్మాత్తుగా అఖిల భారత ద్రవిడ సైద్ధాంతిక హీరో అయిపోయాడు. ఈ క్రమంలో ఉదయనిధి తలకి ఒక ఆలయ పూజారి వెల కట్టారు. దీనిపై బీజేపీ మౌనంగా ఉంది.

2023 సెప్టెంబరు 2న 'సనాతన నిర్మూలన' అనే అంశంపై 'తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' చెన్నైలో ఏర్పాటు చేసిన సదస్సులో ఉదయనిధి స్టాలిన్ ప్రసంగించారు. 'కొన్ని విష యాలను కేవలం వ్యతిరేకించలేము, వాటిని రద్దు చేయాల్సి ఉంటుంది. మనం డెంగ్యూ, దోమలు, మలేరియా లేదా కరోనా వైరస్‌ని వ్యతిరేకించి ఊరు కోలేం. వాటిని మనం నిర్మూలించాలి. సనాతనాన్ని వ్యతిరేకించే బదులు దానిని నిర్మూలించాల్సి ఉంది.' సనాతన ధర్మాన్ని కుల అసమానతతో కూడిన, సామా జిక వ్యతిరేక భావజాలంగా ఉదయనిధి నిర్వచించారు. బీజేపీ మంత్రులు సనాతన ధర్మాన్ని ఒక శాశ్వత చట్టంగా నిర్వచిస్తున్నారు.

స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ హయాంలో గానీ, ఇప్పుడు బీజేపీ హయాంలో గానీ సనాతన ధర్మం అనే భావన భారత దేశంలోని శూద్ర, దళిత, ఆదివాసీలకు వ్యతిరేకమనే అర్థం చేసుకోవాలి. సనాతన ధర్మంలో అంటరానితనం, శ్రమ వ్యతిరేకత, స్త్రీల అసమానత వంటి వాటికి లోతైన మూలాలు ఉన్నాయి. వేద గ్రంథాల తరువాత, మనుధర్మం సనాతన ధర్మ భావ జాలాన్ని సంశ్లేషించింది. డా॥ అంబేడ్కర్, పెరియార్ రామసామి నాయకర్ ఆ మొత్తం ప్రక్రియపై లోతైన విశ్లేషణ చేశారు. దాంట్లో భాగంగానే పెరియార్ మను ధర్మంపై దాడి చేశారు. సనాతన ధర్మానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున అంబేడ్కర్ మనుస్మృతిని దహనం చేశారు.



వ్యవసాయ చట్టాల ద్వారా శూద్ర వ్యవ సాయ దారుల చేతులు కట్టేయాలని బీజేపీ భావించింది, కాని వారు పోరాడారు. ఇప్పుడు బీజేపీ శక్తులు సనాతన ధర్మ వ్యతిరేకమైన, శక్తిమంతమైన ద్రావిడ స్థావరంపై దాడి చేయాలనుకుంటున్నాయి. అందుకే సనాతన ధర్మంపై ఓ యువకుడి విమర్శను ఢిల్లీలో ద్విజ శక్తులు నరహంతకంగా వక్రీకరించి, దానిపై తీవ్రంగా దాడి చేశాయి. కేంద్రప్రభుత్వం మొత్తం దీనిపై దృష్టి సారిం చింది.

అధికార బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ ఉద్దేశపూర్వకంగానే ఉదయనిధి ప్రసంగాన్ని, 80 శాతం మంది ప్రజలపై మారణహోమంగా వక్రీకరించారనేది సుస్పష్టం. శూద్ర, దళిత, ఆదివాసీలు కూడా వీరిలో భాగమనే అర్థంలో ఆయన వక్రీకరించారు.

ధర్మం అనే భావనను న్యాయం అనే అర్థంలో మలుచుకుంటున్నారు. ఇది ప్రాచీన గ్రీకు లేదా యూరోపియన్ కోణంలో చెప్పిన న్యాయానికి సమానం కాదు. అంటే వేదాలు పేర్కొన్న ఈ ధర్మం ప్రకారం బ్రాహ్మణులు రూపొందించిన కుల నియమాలను శూద్రులు తప్పక పాటించి బానిసలుగా, వ్యవసాయ పనివాళ్లుగా బతకాలి. ద్విజులు కలుషితమైనదిగా భావించే వ్యవసాయం చేయకూడదు. శూద్ర, దళిత, ఆదివాసీలను వదిలేయండి... సనాతన ధర్మంలో అన్ని కులాల మహిళలకు స్థానం లేదు. పైగా వారు సనాతన ధర్మం విధించిన అనాగరిక దోపిడీ, మూఢనమ్మకాల బంధితులు. జాతీయ పాలకులు బహిరంగంగా ఇలాంటి భావజాలాన్ని కలిగి ఉండి, ఆదిమ భావ జాలంపై విమర్శ చేసేవారిపై దాడి చేస్తే దేశం అంధ కారంలోకి జారిపోతుంది.

బీజేపీ/ఆరెస్సెస్‌లో పనిచేస్తున్న శూద్ర, ఓబీసీ, దళిత ఆదివాసీలు ఈ కొత్త పరిణామాన్ని చాలా నిశితం గా పరిశీలించవలసి ఉంటుంది. సనాతన ధర్మాన్ని అం గీకరించడం ద్వారా వ్యవస్థపై ఎలాంటి సైద్ధాంతిక నియంత్రణ లేకుండానే అధికార స్థానాలను కొద్దిమంది అనుభవించవచ్చుగాక. కానీ ఉత్పాదక అత్యధిక ఉత్పా దక శక్తులతోపాటూ దేశం మొత్తం చీకటి యుగాల్లోకి నెట్టివేయబడుతుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

తెలంగాణ పల్లెకు పట్టం

- ఉత్తమ పర్యాటక గ్రామాలుగా పెంబర్తి, చంద్లాపూర్‌కు జాతీయ అవార్డులు
- ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం
- రేపు ఢిల్లీలో పురస్కారాల అందజేత

సాక్షి, న్యూఢిల్లీ/చిన్నకోడూరు(సిద్దిపేట): రెండు తెలంగాణ గ్రామాలను ఉత్తమ పర్యాటక గ్రామాలుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కాకతీయుల కాలం నుంచీ హస్తకళలకు ప్రసిద్ధి చెందిన జనగామ జిల్లా పెంబర్తితోపాటు సిద్దిపేట జిల్లా చంద్లాపూర్ గ్రామం ఈ అవార్డులను దక్కించుకున్నాయి. ఈ నెల 27న ఢిల్లీలో జరగనున్న అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాలను అందించనున్నారు. చంద్లాపూర్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల మంత్రి హరీశ్‌రావు గ్రామ ప్రజలకు అభినందనలు తెలిపారు. హరీశ్‌రావు అందించిన తోడ్పాటుకు ఈ గుర్తింపు అని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు.

పెంబర్తి... చేతివృత్తుల నైపుణ్యానికి ప్రతీక

ఇత్తడి, కంచు లోహాలతో పెంబర్తి గ్రామంలో చేసే కళాకృతులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా వీటిని పెద్దమొత్తంలో అమెరికా, జర్మనీ, బెల్జియం, జపాన్ తదితర దేశాలు దిగుమతి చేసుకుంటున్నాయి. సంస్కృతీ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే కళాకృతులు, దేవతల విగ్రహాలు, కళాఖండాలు, గృహాలంకరణ వస్తువులెన్నో ఇక్కడి కళాకారుల చేతివృత్తుల నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తాయి. దీనికితోడు ఏటా 25 వేల మంది పర్యాటకులు ఈ గ్రామాన్ని సందర్శిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ సంస్కృతిని ప్రోత్సహించే విషయంలో ఇక్కడి కార్మికులు చేస్తున్న కృషి ద్వారా జరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని.. పెంబర్తిని ఉత్తమ పర్యాటక గ్రామంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పెంబర్తి ఉత్పత్తులకు జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ గుర్తింపు విషయంలోనూ కేంద్రం చొరవ తీసుకుంది.


పెంబర్తిలో పనిలో నిమగ్నమైన కళాకారులు

చంద్లాపూర్.. కళాత్మకత, చేనేతల కలబోత

రంగనాయక స్వామి ఆలయం, రంగనాయక కొండలు, ఇక్కడి ప్రకృతి.. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తే.. ఈ ప్రాంతంలో నేసే 'గొల్లభామ' చీరలు తెలంగాణ కళాసంస్కృతికి ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి. గొల్లభామ చీర.. తెలంగాణ నేతన్నల కళా నైపుణ్యానికి నిలువుటద్దం. కళాత్మకత, చేనేతల కలబోతకు నిదర్శనం. నెత్తిన చల్లకుండ, చేతిలో పెరుగు గురిగి, కాళ్లకు గజ్జెలు, నెత్తిన కొప్పుతో కళకళలాడే యాదవ మహిళల వైభవం ఈ చీరల్లో ఇమిడిపోయి కనిపిస్తుంది. రంగనాయక స్వామి ఆలయం, పరిసర ప్రాంతాలు గ్రామీణ పర్యాటకానికి ప్రసిద్ధి చెందిన నేపథ్యంతో పాటు గొల్లభామల చీరలకున్న ప్రత్యేకత కారణంగా ఈ ప్రాంతాన్ని ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల చొరవతో చంద్లాపూర్‌లోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ గొప్ప పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది.

అక్టోబరు 28న 'సింగరేణి' ఎన్నికలు

- యాజమాన్యం పిటిషన్ డిస్మిస్
- ఎన్నికలు నిర్వహించాల్సిందే: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్/భద్రాద్రి కొత్తగూడెం: ఎట్టకేలకు సింగరేణిలో గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలకు ముహూర్తం కుదిరింది. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించలేమని, గడువు కావాలంటూ యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికలు నిర్వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు సింగరేణి ఎన్నికలను ఇప్పుడు నిర్వహించలేమని ప్రభుత్వానికి లేఖలు రాశారని, వాయిదా వేయాలని కోరుతూ యాజమాన్యం గత వారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టి.. సోమవారం తీర్పు చెప్పారు. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు వెల్లడించారు.

రేపు షెడ్యూల్ వచ్చే అవకాశం

న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో సింగరేణి ఎన్నికలకు సంబంధించి బుధవారం కేంద్ర కార్మిక శాఖ సమావేశం నిర్వహించనుంది. కార్మిక సంఘాలు, యాజమాన్యంతో చర్చించి అదేరోజు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం అక్టోబర్ 7న నామినేషన్లు, 9న ఉపసంహరణ, 10న గుర్తులు కేటాయింపు, అక్టోబర్ 28న సింగరేణివ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో పోలింగ్ నిర్వహించే అవకాశముంది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు 2023 అక్టోబరు 30లోగా పూర్తి చేయాలని గత జూన్‌లో హైకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ నెలలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.

వట్టె జానయ్యకు సుప్రీంకోర్టులో ఊరట

- తదుపరి విచారణ వరకు అరెస్టు చేయొద్దని పోలీసులకు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: సూర్యాపేట డీసీఎంఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు వట్టె జానయ్యకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీ కేసుల్లో తదుపరి విచారణ వరకు జానయ్యను అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులను ఆదేశించింది. జానయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. సోమవారం ఆ ఉత్తర్వులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 'పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదనలు విన్నాం. రాజకీయ శత్రుత్వం కారణంగానే కేసులు నమోదు చేశారని తెలిపారు. చెరువు నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఐదు టన్నుల చేపలు దొంగలించారని, ఇతరత్రా పది కేసుల గురించి వివరించారు. ఆయా కేసుల్లో సహ నిందితులను విడుదల చేశారన్నారు. ఐదు రోజుల వ్యవధిలో 11 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. పిటిషన్ర్‌కు రక్షణ కల్పించాలని కోరారు. నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసు లు జారీ చేస్తున్నాం. తదుపరి విచారణ వరకు ఎఫ్‌ఐఆర్ 224/2023లో జానయ్యను అరెస్టు చేయొద్దని ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం ఉత్తర్వులు వెలువరించింది.

నీటమునిగి నలుగురి మృత్యువాత

- బాలుడిని కాపాడబోయి ముగ్గురు మహిళలు మృతి
- బాలుడి మృతదేహం కోసం గాలింపు
- మెదక్ జిల్లా రంగాయపల్లి ఊరచెరువులో ఘటన

మనోహరాబాద్(తూప్రాన్): దుస్తులు ఉతికేందుకు చెరువుకు వెళ్లగా..అదే వారి పాలిట మృత్యుకుహరమైంది. బోనాల పండుగకు వచ్చిన తోటికోడళ్లు, కుటుంబసభ్యులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందారు. మూడు కుటుంబాల్లో పెను విషాదం నింపిన ఈ ఘటన మెదక్ జిల్లాలో చోటు చేసుకుంది. మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలో ఆదివారం బోనాలు జరిగాయి. గ్రామానికి చెందిన ఫిరంగిలక్ష్మి ఇంట్లో జరిగిన ఈ వేడుకలకు ఆమె అన్నదమ్ములు సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంబర్‌పేట్‌కు చెందిన దుద్దు యాదగిరి, శ్రీకాంత్‌లు భార్యాపిల్లలతో హాజరయ్యారు. సోమవారం మధ్యాహ్నం దుస్తులు ఉతికేందుకు ఫిరంగిలక్ష్మి తన పెద్దకూతురు లావణ్య (23), సోదరుల భార్యలు దుద్దు బాలమణి (30), దుద్దులక్ష్మి(25), బాలమణి కుమారుడు చరణ్(10)తో కలిసి ఊర చెరువు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో చెరువులో ఆడుకుంటున్న చరణ్ ఒక్కసారిగా నీటి మునిగిపోయాడు. గమనించిన లావణ్య, బాలమణి, లక్ష్మిలు కాపాడేందుకు లోతుగా ఉన్న నీటిలోకి వెళ్లి వారు కూడా మునిగిపోయారు. గట్టుపై ఉన్న ఫిరంగి లక్ష్మి కేకలు వేస్తూ వారిని కాపాడేందుకు నీటిలోకి దిగింది. పట్టుతప్పి ఆమె కూడా నీటిలో మునిగింది. అటుగా వెళుతున్న ఓ యువకుడు గమనించి ఆమెను జుట్టు పట్టి బయటకు లాగడంతో ప్రాణాలతో బయటపడింది. బాలుడితోసహా నీటిలో మునిగిన లావణ్య, బాలమణి, లక్ష్మిని బయటకు తీయగా, అప్పటికే వారు విగతజీవులుగా మారారు. చరణ్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలిసిన తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణం, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మత్స్యకారుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం కావాలి

- ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మత్స్యకారులకు అన్నివిధాలుగా రక్షణ, భద్రత కల్పించేందుకు ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య(ఫిషరీస్ ఫెడరేషన్) చైర్మన్ పిట్టల రవీందర్ స్పష్టం చేశారు. గీత, చేనేత కార్మికులకు 50 ఏళ్లకే ఇస్తున్న పెన్షన్ పథకాన్ని మత్స్యకారులకూ వర్తింపచేయాలని, కొత్తగా మత్స్య సహకార సొసైటీలను ఏర్పాటు చేయడాన్ని ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని ఆయన కోరారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్యభవన్‌లో రవీందర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఫిషరీష్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య ఎన్‌సీడీసీ రీజినల్ డైరెక్టర్ దుబాసి కృష్ణవంశీ, కమిషనర్ లచ్చిరాం భూక్యా, జనరల్ మేనేజర్ ఉప్పల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మత్స్యకారులకు సంబంధించిన 60కిపైగా కీలకమైన ఎజెండాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు.

'రేషన్' ఈ-కేవైసీపై పునః సమీక్షించాలి

- కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు మంత్రి గంగుల లేఖ



సాక్షి, హైదరాబాద్: రేషన్‌కార్డులో పేరున్న ప్రతిఒక్కరు ఈ-కేవైసీ ద్వారా వేలిముద్రలు వేసి, వివరాలు అందజేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలను పునఃసమీక్షించాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు సోమవారం మంత్రి లేఖ రాశారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలనావైఫల్యాల వల్ల సరైన ఉపాధి లేక ఇక్కడి ప్రజలు గల్ఫ్, ఇతర దేశాలతోపాటు ముంబై, భీవండి తదితర ప్రాంతాలకు పెద్దఎత్తున వలసపోయారన్నారు. కార్డుదారులందరూ రేషన్ దుకాణానికి వచ్చి వేలిముద్రలు వేస్తేనే కార్డులో వారిపేరు ఉండేలా కేంద్రం ఇచ్చిన ఆదేశాల వల్ల తెలంగాణ ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నా రు. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయా ప్రాంతాల్లో బతుకు వెళ్లదీస్తున్నారన్నారు. ప్రజల ప్రయోజనాలు కాపాడడానికి మానవీయ దృక్పథంతో కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలన్నారు.

రాష్ట్ర వేడుకగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

సాక్షి, హైదరాబాద్: ఫ్రీడం ఫాదర్‌గా పేరొందిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖను ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ జయంతి వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌ను ఆమె ఆదేశించారు. ఇందుకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించినట్లు ఆమె తెలిపారు.

ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

సాక్షి, హైదరాబాద్: ఆర్య వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు, ఉప్పల్ భగాయత్‌లో ఐదెకరాల భూమి కేటాయింపుపై సీఎం కేసీఆర్‌తో చర్చించి న్యాయం చేస్తానని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని శ్రీనివాస్‌గుప్తా తెలిపారు.


వైశ్య ఫెడరేషన్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

2న జర్నలిస్టుల సమస్యలపై ఢిల్లీలో నిరసన

- ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్: గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న దేశంలోని జర్నలిస్టుల సమస్యలపై ఢిల్లీలో నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం సూర్యాపేట జిలా హుజూర్‌నగర్‌కు వచ్చిన ఆయన స్థానిక ఐజేయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఎస్సీ వర్గీకరణపై 'మాదిగల విశ్వరూప పాదయాత్ర'

- 4న అలంపూర్ నుంచి మందకృష్ణ పాదయాత్ర



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ చేయాలన్న డిమాండ్‌తో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ 'మాదిగల విశ్వరూప పాదయాత్ర'ను చేపట్టనున్నారు. అక్టోబర్ 4న అలంపూర్ నుంచి పాదయాత్ర మొదలు పెడతారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాదయాత్రకు సంబంధించిన వివరాలను మందకృష్ణ వివరించారు. అలంపూర్‌లో మొదలయ్యే పాదయాత్ర హైదరాబాద్ శివారులో నిర్వహించే భారీ బహిరంగసభతో ముగుస్తుంద న్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని, స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్గీకరణకు హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. ప్రధాని హామీ ఇచ్చినపుడు కిషన్‌రెడ్డి సాక్ష్యంగా ఉన్నారని, కానీ పార్లమెంట్‌లో మాత్రం బిల్లు పెట్టడం లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మాదిగల ఓట్లు అడిగే హక్కు లేదని హెచ్చరించారు.

నేటి బీసీ సంఘాల సమావేశం వాయిదా

- అక్టోబర్ మొదటివారంలో సమావేశం


ఆర్. కృష్ణయ్య

ముషీరాబాద్ (హైదరాబాద్): మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జలవిహార్‌లో బీసీ సంఘాలు తలపెట్టిన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ ప్రకటించారు. ఈ సమావేశాన్ని అక్టోబర్ మొదటి వారంలో జలవిహార్‌లోనే భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో సమావేశంలో వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఉన్నందున ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా కల్పించాలని బీఆర్‌ఎస్ మద్దతు ప్రకటించడం చాలా కీలక పరిణామం అని కృష్ణయ్య తెలిపారు. పార్టీలు, ప్రజా సంఘాలు రాజకీయాలకతీతంగా ఈ సమావేశాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాజ్‌కుమార్ పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

10న షాద్‌నగర్‌లో 'బీసీ గర్జన': వీహెచ్

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 10వ తేదీన షాద్‌నగర్‌లో బీసీ గర్జన బహిరంగ సభను నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీ వి.హనుమంతరావు చెప్పారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. బీసీలకు సబ్‌ప్లాన్ అమలు, కులగణన, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలు, రాజకీయ ప్రాధాన్యం తదితర అంశాలపై సభ వేదికగా చర్చ జరుగుతుందని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ పక్షాన బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని, బీసీలు అండగా ఉంటేనే పార్టీ విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ హైదరాబాద్‌లో పోటీ చేయాలని అసదుద్దీన్ ఓవైసీ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని, అసదుద్దీన్ కేరళలో పోటీ చేయగలరా? అని వీహెచ్ ప్రశ్నించారు.

అక్టోబర్ మొదటి వారంలో 'జంగ్ సైరన్'

- 10 వేల మంది మహిళలతో బహిరంగసభ: జాజుల


అఖిల పక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న మధుయాష్కీ, హన్మంతరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఖైరతాబాద్ (హైదరాబాద్): మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. అసమానతలు రూపుమాపేందుకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఉండాల్సిందే అని ఆయన అన్నారు. సబ్ కోటా సాధించేందుకు అఖిల పక్ష సమావేశంలో కార్యాచరణ రూపొందించామని అందులో భాగంగా అక్టోబర్ మొదటి వారంలో 10వేల మంది మహిళలతో హైదరాబాద్‌లో బీసీ జంగ్ సైరన్ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న మహిళా పార్లమెంట్ సభ్యులను ఆహ్వానిస్తామన్నారు. మాజీ ఎంపీ మధుయాష్కీ మాట్లాడుతూ, సమాజంలో అత్యధిక జనాభాకు నిర్ణయాధికార అవకాశం ఉండాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని ఇప్పటికే రాహుల్ గాంధీ ప్రకటించారన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఓయూ జేఏసీ నేత బాల లక్ష్మి, ఇందిరా శోభన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు ప్రసంగించారు.



క్లుప్తంగా...

రూ.2,000 నోట్ల మార్పిడికి మరో 5 రోజులే

న్యూఢిల్లీ: రూ. 2000 నోట్ల మార్పిడికి గడువు సమీపిస్తోంది. మరో ఐదు రోజులే మిగిలి ఉంది. సెప్టెంబర్ 30లోగా రూ.2,000 కరెన్సీ నోట్లను మార్చుకోవచ్చు లేదా బ్యాంకుల్లో డిపాజిట్ చేయొచ్చు. ఈ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) మే 19న ప్రకటించిన సంగతి తెలిసిందే. నోట్ల మార్పిడికి ఆర్బీఐ విధించిన డెడ్‌లైన్ మరో ఐదు రోజుల్లో ముగియనుంది. ఈ నెల 28న దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు దినం. అంటే మరో నాలుగు రోజులే మిగిలి ఉంది. మరోవైపు, రూ.2,000 నోట్ల మార్పిడికి డెడ్‌లైన్‌ను ఆర్బీఐ పొడిగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కానీ, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఎన్డీఏను వీడిన అన్నాడీఎంకే

పళని స్వామి నేతృత్వంలో నిర్ణయం

సాక్షి, చెన్నై: ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వచ్చినట్లు ప్రధాన భాగస్వామ్య పక్షం అయిన అన్నాడీఎంకే ప్రకటించింది. తమిళనాడులో బీజేపీతో తమ స్నేహ బంధం ఇంతటితో ముగిసిందని ఆ పార్టీ తెలిపింది. సోమవారం చెన్నైలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో నేతలతో పార్టీ ప్రధాన కార్యదర్శి పళని స్వామి సమావేశమయ్యారు. కొంతకాలంగా తమిళనాడు బీజేపీ నేతలు దివంగత నేతలు అన్నాదురై, జయలలితకు వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు, ఇటీవల పళని స్వామి ఢిల్లీ పర్యటనలో ఎదురైన అనుభవం, పార్టీ నేతలకు హోం మంత్రి అమిత్ షా అపాయింట్‌మెంట్ లభించకపోవడం వంటి వాటిపై చర్చించారు. బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదని, బయటకు వచ్చేయాలని తీర్మానించారు. పార్టీ నేతలు మును స్వామి, జయ కుమార్, ఎస్పీ వేలు మణి, నత్తం విశ్వనాథన్, దిండుగల్ శ్రీనివాసన్ మీడియా తో మాట్లాడారు. ఏడాది కాలంగా పథకం ప్రకారం రాష్ట్ర బీజేపీ నేతలు అన్నాడీఎంకే నేతలే లక్ష్యంగా చేస్తున్న తీవ్ర వ్యాఖ్యలతో కోట్లాది కార్యకర్తల మనో భావాలు దెబ్బ తిన్నాయని, అందుకే ఆ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించామ న్నారు.

వాట్సాప్ ఛానల్‌లో మోదీకి 50 లక్షల మంది ఫాలోవర్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాట్సాప్ చానల్ సరికొత్త రికార్డు సృష్టించింది. వాట్సాప్ చానల్‌లో మోదీని అనుసరిస్తున్న వారి సంఖ్య కేవలం వారం రోజుల వ్యవధిలోనే 50 లక్షలకు చేరడం విశేషం. తన ఫాలోవర్లకు ప్రధాని మోదీ సోషల్ మీడియాలో కృతజ్ఞతలు తెలిపారు.

కరోనా. ఈ పేరు వింటే చాలు ఇంకా ఉలిక్కిపడుతూనే ఉంది ప్రపంచం. ఆధునిక ప్రపంచ చరిత్ర ఒక రకంగా కరోనాకు ముందు, తర్వాత అన్నట్టుగా తయారైంది. మరి కోవిడ్‌ను మించిన వైరస్ మరోసారి ప్రపంచం మీదికి వచ్చిపడితే?

ఆ ఊహే భయానకంగా ఉంది కదా!

కానీ అది అతి త్వరలో నిజమయ్యే ఆస్కారం చాలా ఉందని స్వయానా ప్రపంచ ఆరోగ్య సంస్థే అంటోంది! ప్రస్తుతానికి ఎక్స్‌గా పిలుస్తున్న సదరు ప్రాణాంతక వైరస్ మన ఉసురు తీయడం ఖాయమట. తీవ్రతలో కోవిడ్ కంటే ఇది ఏడు రెట్లు ఎక్కువని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొనడం ఆందోళనలను మరింతగా పెంచుతోంది. ప్రస్తుతానికి ఎక్స్‌గా పిలుస్తున్న ఈ పేరు పెట్టని వైరస్ ప్రపంచవ్యాప్తంగా హీనపక్షం 5 కోట్ల మందిని బలి తీసుకోవడం ఖాయమని సైంటిస్టులను ఉటంకిస్తూ హెచ్చరిస్తోంది. అంత డేంజరస్ కరోనా కూడా నిజానికి ముప్ముందు మానవాళిని కబళించబోయే మహా మహమ్మారులకు ట్రెయిలర్ మాత్రమేనని జోస్యం చెబుతోంది...!



- సాక్షి, నేషనల్ డెస్క్

కరోనాను మించిన వైరస్



కనీసం 5 కోట్ల మందిని బలి తీసుకుంటుంది: డబ్ల్యూహెచ్‌ఓ
కరోనా ట్రెయిలరే.. ముమ్ముందు మరిన్ని 'మహా'మ్మారులు!
కలకలం రేపుతున్న సైంటిస్టుల హెచ్చరికలు

కరోనా తాలూకు కల్లోలం నుంచి మనమింకా పూర్తిగా తేరుకోనే లేదు. డిసీజ్ ఎక్స్‌గా పేర్కొంటున్న మరో ప్రాణాంతక వైరస్ అతి త్వరలో ప్రపంచాన్ని మరోసారి అతలాకుతలం చేయనుందట. సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థే చేస్తున్న హెచ్చరిక ఇది! 2019లో వెలుగు చూసినా కరోనా డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటిదాకా కనీసం 70 లక్షల ప్రాణాలు తీసింది. కానీ కొత్త రోగం హీనపక్షం 5 కోట్ల మందిని కబళించవచ్చన్న అంచనాలు ఆందోళనలను మరింత పెంచుతున్నాయి. పైగా డిసీజ్ ఎక్స్ ఇప్పటికే తన ప్రభావం మొదలుపెట్టి ఉండొచ్చని కూడా డబ్ల్యూహెచ్‌ఓ సైంటిస్టులను ఉటంకిస్తూ డైలీ మెయిల్ పేర్కొంది.

> డిసీజ్ ఎక్స్‌తో పోలిస్తే కరోనా ప్రమాదకరమైనది కానే కాదని చెప్పాలి. ఎందుకంటే కరోనాకు ఇప్పుడు దాదాపుగా అంతా ఇమ్యూన్‌గా మారాం. కానీ కొత్త వైరస్ తట్టు అంత శరవేగంగా వ్యాపించే అంటురోగానికి కారణమైతే? సోకిన ప్రతి 100లో ఏకంగా 67 మందిని బలి తీసుకున్న ఎబోలా అంతటి ప్రాణాంతకంగా మారితే? ఇదే ఇప్పుడు సైంటిస్టులను తీవ్రంగా కలవర పెడుతున్న అంశం! ప్రపంచంలో ఏదో ఇక మారుమూలలో అదిప్పటికే సడీచప్పుడూ లేకుండా ప్రాణం పోసుకునే ఉంటుంది. అతి త్వరలో ఉనికిని చాటుకుంటుంది. ఇక అప్పటి నుంచీ నిత్య కల్లోలమే!
>
> - డేమ్ కేట్ బిన్ హామ్, బ్రిటన్ వ్యాక్సిన్ టాస్క్‌ఫోర్స్ చీఫ్

డిసీజ్ ఎక్స్ మనకిప్పటికే తెలిసిన వైరస్ నుంచే పుట్టుకొచ్చి ఉంటుందని బ్రిటన్ వాక్సిన్ టాస్క్ ఫోర్స్ చీఫ్ డేమ్ కేట్ బిన్ హామ్ చెబుతున్నారు. వినడానికి కఠోరంగా ఉన్నా, మనకు ముందున్నది కష్ట కాలమేనన్నది అంగీకరించాల్సిన నిజమని ఆమె అన్నారు! '1918–19 మధ్య ఫ్లూ కేవలం ఒక్క ఏడాదిలోనే ఏకంగా 5 కోట్ల మందికి పైగా బలి తీసుకుంది.

తెలిసిన వైరస్ నుంచే..?

ఇప్పుడు కూడా మనకు ఆల్రెడీ తెలిసిన వైరస్‌లలోనే ఒకటి కనీవినీ ఎరగని రీతిలో భయానకంగా మారి అలాంటి మహోత్పాతానికే దారి తీయవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం అసంఖ్యాకమైన వైరస్‌లు పరస్పరం పరివర్తనాలు చెందుతూ రూపు మార్చుకుంటున్నాయి. ఊహాతీత వేగంతో విస్తరిస్తున్నాయి. పైగా వీటి సంఖ్య ప్రస్తుతం భూమి మీద ఉన్న ఇతర అన్ని జీవరాశుల మొత్తం సంఖ్య కంటే కూడా చాలా ఎక్కువ' అని చెప్పుకొచ్చారు! 'వాటిలో అన్నీ మనకు అంతగా చేటు చేసేవి కాకున్నా కొన్ని మాత్రం చాలా డేంజరస్' అని వివరించారు.

లోతుగా పర్యవేక్షణ

జీవ రసాయన సైంటిస్టులు ప్రస్తుతం కనీసం 25 వైరస్ కుటుంబాలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. వీటిలో ఒక్కోదాంట్లో వేలాది విడి వైరస్‌లు ఉన్నాయి. వాటిల్లో ఏదో ఒకటి విపరీతమైన పరివర్తనాలకు లోనై మహా మహమ్మారిగా రూపుదాల్చే ప్రమాదం పొంచి ఉందట! పైగా జంతువుల నుంచి మనుషులకు సోకగల వైరస్ లను అధ్యయనంలో భాగంగా చేయలేదు. వాటినీ కలిపి చూస్తే మానవాళికి ముప్పు మరింత పెరుగుతుందని డేమ్ హెచ్చరిస్తున్నారు.

అప్పుడే వ్యాక్సిన్ తయారీ!

ఇంకా కొత్త రోగం పేరైనా తెలియదు. ఒక్కరిలో కూడా దాన్ని గుర్తించలేదు. అప్పుడే దానికి వ్యాక్సిన్ కనిపెట్టే ప్రయత్నాల్లో బ్రిటన్ సైంటిస్టులు తలమునకలుగా ఉన్నారు. ఏకంగా 200 మందితో కూడిన బృందం ఈ పనిలో తలమునకలుగా ఉందట! జంతువుల నుంచి ఎలుకల ద్వారా మనుషులకు సోకే, శరవేగంగా వ్యాపించే స్వభావమున్న బర్డ్ ఫ్లూ, మంకీ పాక్స్, హంట్ వైరస్‌లనే ప్రస్తుతానికి లక్ష్యంగా పెట్టుకున్నట్టు బ్రిటన్ హెల్త్ సెక్యూరిటీ ఏజెన్సీ చీఫ్ ప్రొఫెసర్ డేమ్ జెన్నీ హారిస్ తెలిపారు. అయితే, పర్యావరణ మార్పుల వంటి మానవకృత విపత్తులకు ఇప్పటికైనా అడ్డుకట్ట వేస్తే ఎన్నో వైరస్‌లను కూడా అరికట్టినవాళ్లం అవుతామంటూ ఆయన ముక్తాయించారు! ముమ్ముందు మన పాలిట ప్రాణాంతకంగా మారే భయంకరమైన మహమ్మారులకు కరోనా కేవలం ఒక దారుణమైన ఆరంభం మాత్రమేనని సైంటిస్టులు ముక్త కంఠంతో చెబుతున్నారు!

అవును.. మరిన్ని మహమ్మారులు!

- ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- చైనా 'బ్యాట్ ఉమన్' షీ జెంగ్ లీ జోస్యం

కోవిడ్ తరహా మరో మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని చైనా 'బ్యాట్ ఉమన్' షీ జెంగ్ లీ జోస్యం చెప్పారు. చైనాలో బెస్ట్ వైరాలజిస్ట్‌గా చెప్పే ఆమె జంతువుల నుంచి, ముఖ్యంగా గబ్బిలాల నుంచి మనుషులకు సోకే వైరస్‌లపై అపారమైన రీసెర్చ్ చేసినందుకు బ్యాట్ ఉమన్‌గా పేరుబడ్డారు. కరోనాకు పుట్టిల్లుగా నేటికీ ప్రపంచమంతా నమ్ముతున్న చైనాలోని వుహాన్ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో లీ బృందం 40 కరోనా జాతులపై లోతుగా అధ్యయనం చేసింది. వాటిలో సగానికి సగం మానవాళికి చాలా ప్రమాదకరమైనవని తేల్చింది. వీటిలో ఆరు ఇప్పటికే మనకు సోకాయని లీ చెప్పారు! గత జూలైలో ఇంగ్లిష్ జర్నల్ ఎమర్జింగ్ మైక్రోబ్స్ అండ్ ఇన్ఫెక్షన్స్ లో పబ్లిష్ అయిన ఈ అధ్యయనం ఇటీవలే ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అన్ని దేశాలూ మరింత అప్రమత్తంగా ఉండాలని చైనాకు చెందిన మరికొందరు ప్రముఖ వైరాలజిస్టులు కూడా సూచిస్తున్నారు. గబ్బిలాలు, ఎలుకల నుంచి ఒంటెలు, పంగోలిన్లు, పందుల వంటి జంతువుల ద్వారా సమీప భవిష్యత్తులో ఇవి మనకు మరింతగా సోకే ప్రమాదం చాలావరకు ఉందని వారు హెచ్చరిస్తున్నారు!

ఉర్దూస్తాన్, ఖలిస్తాన్..

- మతాల ప్రాతిపదికన భారత్‌ను విచ్ఛిన్నం చేసే కుట్ర
- ఖలిస్తాన్ ఉగ్రసంస్థ చీఫ్ పన్నాగం
- భారత నిఘా నివేదికలో విస్మయకర విషయాలు



న్యూఢిల్లీ: భారత్‌లో ప్రత్యేక ఖలిస్తాన్ కోసం వేర్పాటువాదం, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) ఉగ్రసంస్థ చీఫ్ గురుపత్వంత్ సింగ్ పన్నూ పెద్ద ప్రణాళికలే రచించాడు. సంబంధిత వివరాలు ఉన్న భారత నిఘా వర్గాల నివేదిక ఈ విషయాలను వెల్లడిస్తోంది. ఆ నివేదికలోని వివరాలను ఓసారి గమనిస్తే

- మతాల ప్రాతిపదికన భారత్‌ను విడగొట్టాలి అనేది పన్నూ ప్రధాన ఎజెండా.
- ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్‌సహా పలు రాష్ట్రాల్లో పన్నూపై పలు కేసులు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికాలో తల దాచుకుంటున్న పన్నూపై భారత్‌లో చాలా రాష్ట్రాల్లో పదహారుకు పైగా కేసులు నమోదవడాన్ని బట్టి ఎస్ఎఫ్‌జే కార్యకలాపాలు ఇండియాలో ఎంతగా విస్తరించాయో అర్థమవుతుంది.
- భారత భూభాగంలో ముస్లింల కోసం ప్రత్యేక దేశాన్ని ఏర్పాటుచేయాలనేది పన్నూ ఆలోచన. దీనికి 'డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ఉర్దూస్తాన్' అని పేరు కూడా ఖాయం చేసుకున్నాడు.
- దేశం నుంచి కశ్మీర్‌ను వేరుచేసేందుకు కశ్మీర్‌లోని ప్రజలను విప్లవకారులుగా తయారుచేయాలని కంకణం కట్టుకున్నాడు. అందుకోసం భారత్ పట్ల వ్యతిరేకభావన ఉన్న ప్రాంతాల్లో విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. కశ్మీర్‌లో అసంతృప్తితో రగిలిపోతున్న వారికి మరింత ఉద్రేకపరిచేందుకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఖలిస్తాన్ జెండా ఎగరేస్తానని పన్నూ గతంలో ప్రకటించాడు కూడా.

అసలు ఎవరీ పన్నూ ?

దేశ విభజన కాలంలో 1947లో పన్నూ కుటుంబం పాకిస్తాన్ నుంచి అమృత్‌సర్ దగ్గర్లోని ఖాన్‌కోట్ గ్రామానికి వలసవచ్చింది. అమృతసర్‌లో పుట్టిన పన్నూ.. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా పుచ్చుకున్నాడు. అమెరికాలో ఉంటున్న పన్నూ అక్కడే అటార్నీగా పనిచేస్తున్నాడు. భారత్‌లో ఖలిస్తాన్‌ను ఏర్పాటుకు కృషిచేస్తున్న ఎస్ఎఫ్‌జే సంస్థకు న్యాయ సలహాదారుగా ఉంటున్నట్లు పన్నూ చెప్పుకుంటున్నాడు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సాక్ష్యాధారాలతో గుర్తించిన కేంద్ర హోం శాఖ పన్నూను ఉగ్రవాదిగా ప్రకటించింది.

పన్నూ ప్రేలాపణలు..

భారత్‌లో ఖలిస్తాన్ వేర్పాటువాదంలో నిమగ్నమైన వారికి నగదు ప్రోత్సాహకాలు ఇస్తుంటాడని పన్నూపై ఆరోపణలు ఉన్నాయి. తాను చెప్పిన పనులు చేసినా భారీ బహుమతులు ఇస్తానని గతంలో బహిరంగ ప్రకటనలుచేశాడు. ఢిల్లీలోని ప్రఖ్యాత ఇండియాగేట్ వద్ద ఖలిస్తాన్ జెండా ఎగరేస్తే 25 లక్షల డాలర్లు ఇస్తానని పిలుపునిచ్చాడు. 2021లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ ఢిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ మువ్వన్నెల జెండా ఎగరేయకుండా ఎవరైనా పోలీసు అడ్డుకుంటే అతనికి 10 లక్షల డాలర్లు ఇస్తానని ప్రకటించాడు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో మునిగిన పన్నూపై ఎన్ఐఏ కోర్టు 2021 ఫిబ్రవరిలో నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీచేసింది.

'ఖలిస్తాన్' సంబంధ 48 ప్రాంతాల్లో పంజాబ్ పోలీసుల దాడులు

జలంధర్: ఖలిస్తాన్ వేర్పాటువాద ఉగ్రవాది లఖ్బీర్ సింగ్ లాండా, అతని అనుచరులకు చెందిన 48 ప్రాంతాల్లో సోమవారం పంజాబ్ రాష్ట్ర పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఫిరోజ్‌పూర్, సమీప ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఫిరోజ్‌పూర్ పట్టణంలోని జీరా ప్రాంతంలో లఖ్బీర్‌సింగ్ ముఠా సభ్యులు బెదిరింపులు, నగదు వసూళ్లకు పాల్పడిన విషయం తెల్సిందే. ఇదే ప్రాంతంలో గతంలో ఒక వర్తకుడిపైకి ఇద్దరు ముసుగు మనుషులు కాల్పులు జరిపారు. నిషేధిత ఖలిస్తాన్ వేర్పాటువాద సంస్థ అయిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌లో సభ్యులైన పర్మిందర్ సింగ్ ఖైరా అలియాస్ పట్టూ, సత్నామ్ సింగ్ అలియాస్ సత్బీర్ సింగ్ అలియాస్ సట్టా, యద్వీందర్ సింగ్ అలియాస్ యద్దాల ఆచూకీ తెలియజేస్తే తలో రూ. 5 లక్షల నగదు బహుమతి ఇస్తామని పోలీసులు పేర్కొన్నారు. లఖ్బీర్, హర్వీందర్ సింగ్ సంధూ అలియాస్ రిందాల ఆచూకీ తెలపాలని పోలీసులు కోరడం తెల్సిందే. లఖ్బీర్, రిందాల సమాచారం అందిస్తే తలో రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని పోలీసులు గతంలోనే ప్రకటించారు. పంజాబ్‌లో శాంతి, సామరస్యాలకు ఆటంకం కల్గిస్తూ దేశవ్యతిరేక, ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వీరిపై కేసు నమోదుచేసింది. లఖ్బీర్, రిందాల కోసం గాలిస్తోంది. 'ఉగ్రవాదుల ఉపకరణాలు, మత్తుపదార్థాలను పంజాబ్‌కు తరలిస్తూ వీరిద్దరూ భారీగా నగదు కూడబెడుతున్నారు. ఈ నగదును ఖలిస్తాన్ ఉగ్రవాదం కోసం వినియోగిస్తున్నారు. పంజాబ్‌లో ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను బెదిరించి అక్రమ నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. పంజాబ్‌లో కొందరిని లక్ష్యంగా చేసుకుని హత్యలకు పాల్పడిన కేసుల్లోనూ వీరు నిందితులుగా ఉన్నారు' అని గత వారమే ఎన్ఐఏ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.



బిలాస్‌పూర్‌లో రైలులో ప్రయాణిస్తూ రాహుల్ గాంధీ

అధికారంలోకి వస్తే కులగణన

- దళితులు, ఓబీసీల భాగస్వామ్యం పెంచుతాం: రాహుల్

బిలాస్‌పూర్: దళితులు, గిరిజనులు, మహిళలు, ఓబీసీల భాగస్వామ్యం పెరగాలంటే కులగణన ద్వారా మాత్రమే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేపడుతుందని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా చేపట్టిన కులగణన గణాంకాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. కులగణన అంటే భయపడుతున్నారా అని ప్రధానిని నిలదీశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆవాస్ న్యాయ్ సమ్మేళన్‌లో రాహుల్ ప్రసంగించారు. రిమోట్ కంట్రోల్‌ను చూపుతూ ఆయన..'కాంగ్రెస్ పార్టీ ప్రజలందరి ముందు బహిరంగంగా ఈ రిమోట్‌ను నొక్కుతుంది. ఫలితంగా పేదలకు, అవసరమైన వారికి లబ్ధి అందుతుంది. ఇదే మీటను బీజేపీ చీకటిమాటున నొక్కుతుంది. దాంతో అదానీ(పారిశ్రామికవేత్త)కి పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వే కాంట్రాక్టులు దక్కుతాయి' అని ఎద్దేవా చేశారు. సభ అనంతరం రాహుల్ గాంధీ తిరుగు ప్రయాణంలో బిలాస్‌పూర్ నుంచి రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు బిలాస్‌పూర్-ఇట్వారీ ఇంటర్ సిటీ రైలులో ప్రయాణించారు. ప్రయాణికులతో ముచ్చటించారు.

అదనపు వడ్డీ కట్టలేదని వివస్త్రను చేసి..

బిహార్‌లో దళిత మహిళకు దారుణ అవమానం

పట్నా: సభ్య సమాజం తలదించుకోవాల్సిన దారుణ ఘటన బిహార్‌లో జరిగింది. అపదలో అక్కరకొస్తాయని రూ.1,500 అప్పు తీసుకున్న పాపానికి దళిత మహిళ ఒకరు దారుణ అవమానానికి గురికావాల్సి వచ్చింది. విషయం తెల్సి నిందితులకు కఠిన శిక్ష పడేలాచూడాలని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పోలీసులను ఆదేశించారు. బిహార్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్నా జిల్లాలోని ఖుస్రూపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామంలో ఈనెల 23వ తేదీ రాత్రి జరిగింది. కొన్ని నెలల క్రితం దళిత మహిళ భర్త.. ప్రమోద్ సింగ్ అనే వ్యక్తి వద్ద రూ.1,500 అప్పుగా తీసుకున్నారు. తర్వాత కొంతకాలానికి వడ్డీతోసహా అసలు మొత్తాన్ని ప్రమోద్‌కు చెల్లించేశారు. ఇది సరిపోదని, ఇంకా అదనంగా వడ్డీ కట్టాలని ప్రమోద్ వేధింపులు మొదలుపెట్టారు. అదనంగా ఇచ్చేదేమీలేదని దళిత వ్యక్తి భార్య కరాఖండీగా చెప్పేసింది. దీంతో ఆమెకు ఫోన్ చేసి ' అదనపు వడ్డీ కట్టకపోతే నిన్ను నగ్నంగా ఊరిలో ఊరేగిస్తా' అంటూ ప్రమోద్ చేసిన బెదిరింపులను ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఆ గ్రామానికొచ్చి విచారించి వెళ్లారు. పోలీసులు వచ్చిన విషయం తెల్సి ప్రమోద్ కోపంతో ఊగిపోయాడు. ఈనెల 23వ తేదీన రాత్రి పదింటికి కొంత మందితో కలిసి దళితుడి ఇంటికొచ్చి అతని భార్యను బలవంతంగా తన ఇంటికి లాక్కెళ్లాడు. వివస్త్రను చేసి పిడిగుద్దులు కురిపిస్తూ కర్రలతో దాడిచేశాడు. ప్రమోద్ కుమారుడు అన్షుతో ఆమె నోట్లో మూత్రం పోయించాడు. ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకున్న మహిళ మళ్లీ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ప్రమోద్, కుమారుడు అన్షు పరారీలో ఉన్నారని పట్నా సీనియర్ ఎస్పీ రాజీవ్ మిశ్రా చెప్పారు.

ఒడెసా పోర్టుపై రష్యా భీకర దాడులు

కీవ్: ఉక్రెయిన్‌లోని ఒడెసా పోర్టుపై డ్రోన్లు, క్షిపణులతో సోమవారం రష్యా భారీ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో పోర్టు మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. రష్యా ప్రయోగించిన 12 కాలిబర్ మిస్సైళ్లలో పదకొండింటిని, రెండు పీ-800 ఓనిక్స్ క్రూయిజ్ మిస్సైళ్లను కూల్చేసినట్లు ఉక్రెయిన్ రక్షణ శాఖ తెలిపింది. ఉక్రెయిన్ ధాన్యాన్ని నల్ల సముద్రం మీదుగా ఓడల ద్వారా తరలించే ఒప్పందం నుంచి రష్యా వైదొలిగింది. అప్పటి నుంచి ఒడెసా ఓడరేవు లక్ష్యంగా పదేపదే దాడులకు దిగుతోంది. ఫలితంగా ధాన్యం గోదాములు, ఆయిల్ డిపోలు, షిప్పింగ్, నిల్వ సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.



సీ-295 రవాణా విమానానికి పూజలు చేస్తున్న రాజ్‌నాథ్ సింగ్

ఐఏఎఫ్‌లోకి సీ-295 విమానం

ఘజియాబాద్: భారత వైమానిక దళం(ఐఏఎఫ్)లోకి మొదటి సీ-295 రకం రవాణా విమానం చేరింది. ఈ విమానాలు ఐఏఎఫ్ వ్యూహాత్మక రవాణా సామర్థ్యం పెంపులో కీలకంగా మారనున్నాయి. ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీ-295 విమానాన్ని ఐఏఎఫ్‌లోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజ్‌నాథ్ సర్వ ధర్మపూజ నిర్వహించారు. వైమానిక దళ చీఫ్ వీఆర్ చౌదరితోపాటు సీనియర్ అధికారులు, విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ ప్రతినిధులు పాల్గొన్నారు. వడోదర ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి పనిచేసే స్క్వాడ్రన్ నంబర్ 11కు సీ-295ను అందజేయనున్నారు. కేంద్రం 56 సీ-295 రవాణా విమానాల్ని కొనుగోలు చేసేందుకు ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్ సంస్థతో రూ.21,935 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా మొదటి సీ-295 విమానాన్ని ఈ నెల 13న ఐఏఎఫ్ చీఫ్ అందుకున్నారు. ఈ విమానాలను ప్రస్తుతమున్న పాతకాలం అవ్రో-748ల బదులు వినియోగించుకుంటారు. ఒప్పందంలో భాగంగా 16 విమానాల్ని ఎయిర్‌బస్ సంస్థ అందజేస్తుంది. మిగతా 40 విమానాల్ని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో కలిసి భారత్‌లోనే ఉత్పత్తి చేస్తుంది. విడిభాగాల తయారీ పనులు హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

చంద్రయాన్-3 ప్రస్థానం ముగిసినట్లేనా!

- ల్యాండర్, రోవర్ నుంచి అందని సంకేతాలు
- అనుసంధానం కోసం ఇస్రో సైంటిస్టుల యత్నాలు

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. చందమామ దక్షిణ ధ్రువంపై క్షేమంగా అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా రికార్డుకెక్కింది. చంద్రయాన్-3 మిషన్‌లో అంతర్భాగమైన ల్యాండర్ విక్రమ్ ఆగస్టు 23న జాబిల్లి దక్షిణ ధ్రువంపై సురక్షితంగా దిగింది. అందులో నుంచి రోవర్ ప్రజ్ఞాన్ బయటకు వచ్చి, చంద్రుడి ఉపరితలంపైకి చేరుకుంది. అవి రెండూ 14 రోజుల పాటు నిర్విరామంగా పనిచేశాయి. జాబిల్లిపై పరిశోధనలు జరిపి, విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేశాయి. అనంతరం సెప్టెంబర్ 2న దక్షిణ ధ్రువంపై సూర్యాస్తమయం కావడంతో స్లీప్ మోడ్‌లోకి వెళ్లిపోయాయి. మళ్లీ సూర్యోదయం కావడంతో ఈ నెల 22న తిరిగి మేల్కొవాల్సి ఉంది. ల్యాండర్, రోవర్‌ను మళ్లీ మేల్కొలిపేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ల్యాండర్, రోవర్ నుంచి సంకేతాలు అందడం లేదని సైంటిస్టులు చెబుతున్నారు. దీంతో చందమామపై వాటి ప్రస్థానం ముగిసిపోయినట్లేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ల్యాండర్, రోవర్‌తో అనుసంధానం కోసం ఇస్రో సైంటిస్టులు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

గాల్లో తలకిందులుగా 30 నిమిషాలు..

కెనడా పార్కులో లాంబర్‌జాక్ రైడ్‌లో అవస్థలు

టొరంటో: సరదాగా పార్కులో గడుపుదామనుకుని అక్కడికి విచ్చేసిన సందర్శకులకు చేదు అనుభవం ఎదురైంది. వారు ఎక్కిన లాంబర్‌జాక్ రైడ్ పైకి వెళ్లాక హఠాత్తుగా మధ్యలోనే ఆగిపోయింది. దీంతో అందులో చిక్కుకుపోయిన సందర్శకులు 30 నిమిషాలపాటు తలకిందులుగా వేలాడుతూ సాయంకోసం అర్థించారు. కెనడాలోని ఒంటారియా నగరంలోని వండర్‌ల్యాండ్ అమ్యూజ్‌మెంట్ పార్కులో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. రైడ్‌లో భాగంగా అందులో కూర్చున్న వారంతా అలా గాల్లో తలకిందులుగా వేలాడుతూ హాహాకారాలు చేస్తున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. ఎట్టకేలకు 30 నిమిషాలకు అందరినీ ఎలాగోలా కిందకు సురక్షితంగా తీసుకొచ్చారు. అంతసేపు తలకిందులుగా వేలాడటంతో కొందరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు.

జవానును కట్టేసి వీపుపై నిషేధిత సంస్థ రాతలు

కొల్లాం(కేరళ): కేరళలో నిషేధిత ఇస్లామిక్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) సానుభూతిపరులు ఆర్మీ జవానును లక్ష్యంగా చేసుకున్నారు. ఆయనను కట్టేసి వీపుపై పీఎఫ్ఐ అని పెయింట్‌తో రాశారు. కేరళలోని కొల్లాం జిల్లాలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం రాత్రి కడక్కల్‌లో జవాను షైన్ కుమార్ తన ఇంటి దగ్గర్లోని రబ్బరు తోటకు వెళ్లగా హఠాత్తుగా గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు ఆయనను బంధించారు. టాడుతో చేతులు కట్టేసి కొట్టారు. ఆయన వీపుపై ఆకుపచ్చ రంగుతో పీఎఫ్ఐ అని రాశారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ఐను నిషేధించిన విషయం తెల్సిందే. జవాను ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన కేరళ పోలీసులు దర్యాప్తును మొదలుపెట్టారు. జవాను ప్రస్తుతం రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లోని భారత ఆర్మీకి చెందిన ఎలక్ట్రానిక్స్, ఇంజనీర్స్ కోర్‌లో పనిచేస్తున్నారు.

ఎన్డీయే కూటమిలో చేరే ప్రసక్తే లేదు: నితీశ్

పట్నా: విపక్ష 'ఇండియా' కూటమిలో కీలకంగా మారి మరిన్ని భావసారూప్య పార్టీలను కూటమిలోకి తెచ్చేందుకు కృషిచేస్తున్న బిహార్ సీఎం నితీశ్ కుమార్ మళ్లీ ఎన్డీయే కూటమిలో చేరనున్నారన్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. పాత ఎన్డీయేతో జట్టుకట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పా రు. దీనిపై బీజేపీ స్పందించింది. 'మాతో మళ్లీ చేతులు కలిపేందుకు ఆయన ఎంతగా ప్రాధేయపడినా సరే కలుపుకునేది లేదు' అని బీజేపీ తన వైఖరిని తేటతెల్లంచేసింది. సోమవారం పట్నాలో భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్తల్లో ఒకరైన దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి వేడుకల్లో నితీశ్ పాల్గొనడమే ఈ ఊహాగానాలకు అసలు కారణం. విపక్ష 'ఇండియా' కూటమితో నితీశ్‌కు అంతగా పొసగట్లేదని, ఆయనను కూటమికి కన్వీనర్‌గా ఇంతవరకూ ప్రకటించకపోవడంతో ఆయన అలిగారని మీడియాలో వార్తలొచ్చిన సంగతి తెలిసిందే.



జనసంఘ్ నేత దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతి పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా

బిల్లుకు అయిష్టంగానే విపక్షాల ఆమోదం

- గత్యంతరం లేకే మద్దతిచ్చాయి
- మా పట్టుదల వల్లే పార్లమెంట్‌లో బిల్లు నెగ్గింది
- అహంకార కూటమికి అధికారం అప్పగిస్తే బిల్లు పరిస్థితి వెనక్కే
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- మధ్యప్రదేశ్, రాజస్తాన్ ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగం

భోపాల్/జైపూర్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా బిల్లుకు పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు మరో గత్యంతరం లేక తప్పనిసరి పరిస్థితుల్లో అయిష్టంగానే మద్దతు ఇచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నారీశక్తిని అర్థం చేసుకొని, సంకోచిస్తూనే బిల్లుకు ఆమోదం తెలిపాయని అన్నారు. తమ పట్టుదల వల్లే బిల్లు పార్లమెంట్‌లో నెగ్గిందని వివరించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ బిల్లు పరిస్థితి ఏమిటో మనకు తెలిసిందేనని అన్నారు. ఒకవేళ కాంగ్రెస్, దాని మిత్రపక్షాల అహంకార కూటమికి అధికారం అప్పగిస్తే ఈ బిల్లు విషయంలో వెనక్కి మళ్లుతాయంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. బిల్లు పరిస్థితి వెనక్కి వెళ్లిపోతుందని పరోక్షంగా స్పష్టం చేశారు. జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మధ్యప్రదేశ్‌లో సోమవారం నిర్వహించిన 'కార్యకర్త మహాకుంభ్'లో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. ఆ పార్టీని తుప్పు పట్టిన ఇనుముతో పోల్చారు. బుజ్జగింపు రాజకీయాలు కాంగ్రెస్‌కు అలవాటేనని ఆక్షేపించారు. కాంగ్రెస్‌ను రాజకీయ నాయకులు నడిపించడం లేదని, పార్టీని అర్బన్ నక్సలైట్లకు ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ విధానాలను, నినాదాలను ఈ లీజుదారులే నిర్ణయిస్తున్నారని మోదీ ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గనుక గెలిపిస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తారని విమర్శించారు.



కాంగ్రెస్ దివాలా తీసింది

కాంగ్రెస్ దేశంలో ప్రతికూలతను వ్యాప్తి చేస్తోందని, దేశం సాధించిన ఘనతలను ఆ పార్టీ ఇష్టపడడం లేదని ప్రధానమంత్రి మోదీ ధ్వజమెత్తారు. దేశాన్ని 20వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలని కోరుకుంటోందని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. డిజిటల్ పేమెంట్ వ్యవస్థను కాంగ్రెస్ వ్యతిరేకించిందని, కానీ, ప్రపంచ దేశాలు ఈ వ్యవస్థను ప్రశంసించాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ మనోబలం కోల్పోయిందని, దివాలా తీసిందని చెప్పారు. అందుకే అర్బన్ నక్సలైట్లకు పార్టీని లీజుకు ఇచ్చారని తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌కు ప్రజాబలం లేదన్నారు. మహిళలను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందుకే వారంతా అప్రమత్తంగా ఉండాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పేదలు ఎప్పటికీ పేదలుగా ఉండాలన్నదే కాంగ్రెస్ విధానమని మండిపడ్డారు. మధ్యప్రదేశ్ అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజస్తాన్‌లో కాంగ్రెస్‌ను గద్దె దించాలి

రాజస్తాన్‌లో సీఎం అశోక్ గహ్లోత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువత జీవితాల్లో ఐదేళ్ల విలువైన సమయాన్ని వృథా చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని అన్నారు. రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'పరివర్తన్ సంకల్ప్ మహాసభ'లో మాట్లాడారు. పరిపాలన పరంగా కాంగ్రెస్ సర్కారుకు సున్నా మార్కులే వస్తాయన్నారు. కాంగ్రెస్ పాలనలో మాఫియాలు చెలరేగిపోతున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. మహిళల నుంచి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక కాంగ్రెస్ పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చిందని చెప్పారు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023


దుర్గం చెరువులో మ్యూజికల్ ఫౌంటెన్ వెలుగులు

న్యూస్‌రీల్

నిమజ్జనానికి ఎంఎంటీఎస్ స్పెషల్స్

సాక్షి, సిటీబ్యూరో: వినాయక నిమజ్జనం సందర్భంగా 8 ఎంఎంటీఎస్ సర్వీసులను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ రాత్రి 11 గంటల నుంచి 29వ తేదీ ఉదయం 4 గంటల వరకు ఈ రైళ్లు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తాయి. సికింద్రాబాద్–నాంపల్లి, ఫలక్‌నుమా–లింగంపల్లి, నాంపల్లి–సికింద్రాబాద్, లింగంపల్లి–నాంపల్లి, లింగంపల్లి–సికింద్రాబాద్ మధ్య ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి.

విద్యార్థి దశ నుంచే రక్తదానం అభినందనీయం

- గవర్నర్ తమిళిసై


రక్తదానం చేస్తున్న విద్యార్థినులను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

వెంకటేశ్వరకాలనీ: విద్యార్థి దశ నుంచే రక్తదానంపై అవగాహన ఉండటంతో పాటు రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించి రక్తదానం చేసిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది ఫార్మసిస్ట్ వేడుకల సందర్భంగా అవయవదానాన్ని ప్రోత్సహించాలని ఇంటర్నేషనల్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ నిర్ణయించిందన్నారు. అవయవదానం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించేందుకు నిర్ణయించిన నిర్వాహకులను ఆమె అభినందించారు. రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన వారిలో చాలా మంది అమ్మాయిలు ఉండటం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్, వైస్ చైర్మన్ అబ్దుల్ వాహబ్, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం

- బల్దియా కమిషనర్ రొనాల్డ్ రాస్


గుడిమల్కాపూర్‌లో పర్యటించిన రొనాల్డ్ రాస్

గోల్కొండ: కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా గుడిమల్కాపూర్‌లోని మెట్లబావిని పునరుద్ధరిస్తామని బల్దియా కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని నక్కర్‌ఖానా, కళ్యాణ మండపం, జామ్‌సింగ్ దేవాలయం ప్రాంతంలోని మెట్లబావి తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మెట్లబావి పునరుద్ధరణ పనులను తనిఖీ చేసి మాట్లాడుతూ మెట్లబావులకు పూర్వ వైభవం కల్పిస్తున్నామని చెప్పారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ వారి మార్గదర్శకత్వంలో గుడిమల్కాపూర్‌లోని మెట్లబావిని రూ.46 లక్షలతో పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. జామ్‌సింగ్ దేవాలయ పరిరక్షణ, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనుల కోసం దేవాదాయ శాఖ అనుమతి పొందాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే, ఎస్‌ఈ రత్నాకర్, ఈఈ లాల్‌సింగ్, డిప్యూటీ కమిషనర్ అంజనేయులు, డిప్యూటీ ఈఈ జమీల్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వనగరమే ధ్యేయంగా ముందుకు..

మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ వాణీదేవి

- దుర్గం చెరువు వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం


ఎస్టీపీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వాణీదేవి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మాదాపూర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని దుర్గం చెరువు వద్ద 7.0 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రూ.15 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మురుగు నీటి శుద్ధికేంద్రం(ఎస్టీపీ)ను సోమవారం మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీపీతో దుర్గంచెరువు ప్రాంత ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుందన్నారు. అలాగే మురుగు నీటి నుంచి చెరువులకు విముక్తి లభిస్తుందన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. మురుగునీటి శుద్ధిలో హైదరాబాద్ నగరం దేశంలోనే ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 772 ఎల్‌ఎండీ సీవరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ అనుమతి ఇచ్చిందన్నారు. దీనికోసం రూ. 3866.21 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, హెచ్ఎండీఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్, జలమండలి ఎండీ దానకిషోర్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు హమీద్ పటేల్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మంజుల రఘునాథ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, మాధవరం రంగారావు పాల్గొన్నారు.

దుర్గం చెరువులో వాటర్ ఫౌంటెన్లు ప్రారంభం

సందర్శకులను ఆకట్టుకునేందుకు దుర్గం చెరువులో ఏర్పాటు చేసిన మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్లను స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. దాదాపు 60 మీటర్ల పొడవులో..మ్యూజిక్‌కి అనుగుణంగా రంగులు వెదజల్లుతున్న ఫౌంటెన్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

సిటీపై కమాండ్..

నేరగాళ్లపై కంట్రోల్!



ఐసీసీసీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

- ట్రాఫిక్ నిర్వహణతో పాటు నేరగాళ్లకూ చెక్
- దేశంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ వ్యవస్థగా రికార్డు

సాక్షి, సిటీబ్యూరో: ఉల్లంఘనుల్లో క్రమశిక్షణ పెంచడం...‘స్వైర విహారం’ చేసే నేరగాళ్లకు చెక్ చెప్పడం ...వాహనచోదకులు గమ్యం చేరుకునే సమయాన్ని గణనీయంగా తగ్గించడం... విపత్కర పరిస్థితుల్లో సత్వర స్పందన... ఈ లక్ష్యాలతో ఏర్పాటైన అత్యాధునిక వ్యవస్థే ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐటీఎంఎస్). బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఇదీ ఓ అంతర్భాగమే. రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ సోమవారం ఆవిష్కరించిన ‘2306 సేఫ్ సిటీ ప్రాజెక్టు సీసీ కెమెరాలు’ ఈ కోణాల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. వీటిలో కొన్ని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేస్తాయి.

‘ప్లేటు’ మారితే పట్టేస్తుంది...

నేరగాళ్లు, ఉల్లంఘనులు పోలీసుల్ని తప్పించుకోవడానికి అనేక ఎత్తులు వేస్తుంటారు. ఇందులో భాగంగా ఇతర వాహనాల నెంబర్లకు తమ వాహనాల నెంబర్ ప్లేట్లపై వేసుకుని సంచరిస్తుంటారు. ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రీడింగ్ సిస్టం (ఏఎన్‌పీఆర్) సాఫ్ట్‌వేర్ ఈ తరహా కేటుగాళ్లకు చెక్ చెబుతుంది. ఈ వ్యవస్థ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) ద్వారా ఆర్టీఏ సర్వర్‌తో అనుసంధానించి ఉంటుంది. నగర వ్యాప్తంగా ఉండే కెమెరాల ద్వారా ఒకే నెంబర్‌తో రెండు వాహనాలు, కార్ల నెంబర్లతో ద్విచక్ర వాహనాలు, వేరే నెంబర్లతో తిరిగే ఆటోలను తక్షణం గుర్తిస్తుంది. ఆ విషయాన్ని ఆ వాహనం ప్రయాణించే ముందు జంక్షన్‌లో ఉన్న క్షేత్రస్థాయి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేస్తుంది.

వాహన ‘మార్గాలను’ చెప్పేస్తుంది...

నగర వ్యాప్తంగా సంచరించే వాహనాల ట్రాకింగ్ విధానం సైతం ఐటీఎంఎస్ ద్వారా అందుబాటులోకి రానుంది. 250 జంక్షన్లలో ఉండే సీసీ కెమెరాలు ఆయా ప్రాంతాల్లో సంచరించే ప్రతి వాహనాన్నీ నెంబర్‌తో సహా చిత్రీకరించి సర్వర్‌లో నిక్షిప్తం చేస్తాయి. ఏదైనా నేరానికి పాల్పడిన వాహనమో, అనుమానిత వాహనమో ఏ ప్రాంతం నుంచి ఏ సమయంలో ఎక్కడికి ప్రయాణించిందో క్షణాల్లో తెలుసుకునే అవకాశం ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా కలుగుతుంది. సీసీసీలోని సిబ్బంది తేదీ, వాహనం నెంబర్‌ను ఎంటర్ చేసి సెర్చ్ చేస్తే చాలు.. ఆయా రోజుల్లో సదరు వాహనం ఎక్కడ నుంచి నగరంలోకి ప్రవేశించింది? ఏ సమయంలో ఎక్కడ ఉంది? ఏఏ మార్గాల్లో ప్రయాణించింది? ఎక్కడెక్కడ ఆగింది? తదితర అంశాలను తెలియజేస్తుంది. కిడ్నాప్, స్నాచింగ్ వంటి నేరాలు జరిగినప్పుడు ఈ వ్యవస్థ అందించే ఆధారాలు కేసుల్ని కొలిక్కి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించనున్నాయి.

జంక్షన్ల వారీగా వాహన కౌంటింగ్...

ప్రతి చౌరస్తా నుంచి నిమిషనిమిషానికీ ముందుకు సాగే వాహనాలను లెక్కించే ప్రక్రియ సైతం ఐటీఎంఎస్‌లోని సాఫ్ట్‌వేర్స్‌లో ఉన్నాయి. ఓ నిమిషం కాలంలో సదరు జంక్షన్‌ను ఎన్ని వాహనాలను దాటాయి? వాటిలో ద్విచక్ర, త్రిచక్ర, తేలికపాటి వాహనాలతో పాటు భారీ వాహనాలు, బస్సులు ఎన్ని? అనే అంశాన్ని ప్రత్యేక పరికరాల ద్వారా సాఫ్ట్‌వేర్ లెక్కిస్తుంది. ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సీసీసీలో ఉండే సిబ్బందికి తెలియజేస్తుంది. ఫలితంగా ఆయా సమయాల్లో ఏఏ రూట్లు బిజీగా ఉన్నాయో తెలుసుకునే సిబ్బంది ఆ విషయాన్ని జంక్షన్లలో ఉండే ప్రత్యేక బోర్డుల ద్వారా వాహనచోదకులకు అందిస్తారు.

వీఎంఎస్‌లతో నిరంతరం సందేశాలు...

ఐటీఎంఎస్ ద్వారా ప్రతి జంక్షన్‌లోనూ ఏర్పాటయ్యే వీఎంఎస్‌లు(వేరియబుల్ మెసేజ్ సైన్ బోర్డులు) ట్రాఫిక్ స్థితిగతులపై నిరంతర సందేశాలు ఇవ్వనున్నారు. ఓ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనచోదకుడికి ముందు రానున్న చౌరస్తా, రహదారిలో ట్రాఫిక్ స్థితిగతుల్ని ఎప్పటికప్పుడు వీఎంఎస్‌ల్లో ప్రదర్శితమవుతాయి.

ఉల్లంఘనులకు ‘ఈ’ చెక్...

జంక్షన్లలో ఉన్న ఫ్రీ–లెఫ్ట్‌ను ఉల్లంఘిస్తూ ఆయా చోట్ల వాహనాలు ఆపినా... వన్‌వే నిబంధనను ఉల్లంఘించినా, వాహనాలు రాంగ్ రూట్లలో దూసుకువస్తున్నా... ప్రస్తుతం ఆయా చోట్ల ఉండే క్షేత్రస్థాయి పోలీసులే చర్యలు తీసుకోవాలి. ఐటీఎంఎస్ వ్యవస్థలో అన్ని జంక్షన్లతో పాటు రాంగ్‌రూట్, వన్‌వే ఉల్లంఘన అవకాశం ఉన్న ప్రాంతాల్లోనూ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. సర్వర్‌తో అనుసంధానించి ఉండే ఈ కెమెరాలు వాటంతట అవే ఆయా ఉల్లంఘనుల వాహనాలను ఫొటో తీస్తారు. సర్వర్ ఆధారంగా ఈ–చలాన్ సైతం ఆటోమేటిక్‌గా సంబంధింత వాహనచోదకుడి చిరునామాకు చేరిపోతుంది. దీంతో పాటు నో–పార్కింగ్, కమ్యూనిటీ పార్కింగ్, పెయిడ్ పార్కింగ్ ప్రాంతాలనూ జియో ట్యాకింగ్, ఫెన్సింగ్ ద్వారా గుర్తించేందుకు అవకాశం ఉంటుంది.

ఐసీసీసీ ఆధీనంలో ఏ కెమెరాలు ఎన్నంటే..?

- ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాక్స్, పీటీజెడ్, ఏఎన్‌పీఆర్ కెమెరాలు 10 వేలు
- నగర వ్యాప్తంగా వివిధ కీలక ప్రాంతాల్లోనివి 126
- మూడు కమిషనరేట్లలోని 2828 జంక్షన్లలోనివి
- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసి 38 ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరాలు
- నేను సైతం, కమ్యూనిటీ ప్రాజెక్టుల కింద ఏర్పాటైన 4,99,869 (అవసరమైనప్పుడు యాక్సస్ చేయవచ్చు)
- జీపీఎస్ పరిజ్ఞానం ఉన్న గస్తీ వాహనాలకు ఏర్పాటు చేసినవి 1322

బిల్లుకు ముందే మహిళా రిజర్వేషన్లు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహమూద్ అలీ, వేదికపై డీజీపీ అంజనీకుమార్, సీపీ ఆనంద్

తెలంగాణ పోలీసు విభాగంలో అమలు చేశాం

- 33 శాతం పోస్టులను అతివలకే కేటాయించాం
- రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ వ్యాఖ్య
- ఐసీసీసీలో వార్ రూమ్‌ను ప్రారంభించిన మంత్రి

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్‌లో మహిళ రిజర్వేషన్ బిల్లు పెట్టడానికి చాలా కాలం ముందు నుంచే తెలంగాణలో ఇవి అమలు చేస్తున్నామని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మేరకు పోలీసు విభాగంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) ఏర్పాటు చేసిన మల్టీ ఏజెన్సీ ఆపరేషనల్ సెంటర్, వార్ రూమ్‌లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ..‘తెలంగాణలోని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. ఐసీసీసీని నిర్మిస్తున్నప్పుడు అనేక మంది దీన్ని ఎందుకు నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పుడు అదే దేశంలో నెంబర్ వన్‌గా మారింది. అడ్వాన్స్ టెక్నాలజీతో కూడిన కెమెరాలను సైతం ఏర్పాటు చేసుకున్నాం. ఇతర విభాగాల కంటే పోలీసుల విధులు అత్యంత కీలకమైనవి. కొన్నిసార్లు కుటుంబం, పిల్లలనే కాదు ప్రాణాలనూ పట్టించుకోకుండా పని చేయాల్సి వస్తుంది. టెక్నాలజీ వినియోగం ఎంత బాగుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు అంత బాగుంటాయి’ అని అన్నారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ... ‘2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాతి నుంచి 2023 వరకు పరిస్థితులను చూస్తుంటే ఓ సక్సెస్ స్టోరీ కనిపిస్తుంది. తెలంగాణ ఏర్పడితే ఎన్నో ఇబ్బందులు వస్తాయని అప్పట్లో భావించిన వాళ్లలో మేధావులూ ఉన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పటిష్టమైన రోడ్ మ్యాప్ ఇచ్చి ముందుకు వెళ్లేలా చేశారు. అందులో ఈ ఐసీసీసీ కూడా ఒక భాగం. ఇందులో అన్ని విభాగాలకూ ప్రాతినిధ్యం ఉంటుంది. 2014–15ల్లో ఈ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు కోసం ఎన్నో సమావేశాలు నిర్వహించాం. కొన్ని బృందాలు విదేశాలకూ వెళ్లి అధ్యయనం చేసి వచ్చాయి. ఆయా దేశాల్లో ఉన్న ఉత్తమమైన వాటిని సమ్మిళితం చేసి ఇది ఏర్పాటు చేశాం. నగరంలో ప్రతి నెలా శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి బందోబస్తులు కీలకంగా ఉంటాయి. ఆ సందర్భాలతో పాటు సామూహిక నిమజ్జనం రోజు 15 వేల విగ్రహాల కదలికను పర్యవేక్షించడానికి ఐసీసీసీ కీలకంగా మారనుంది’ అని తెలిపారు.

ఇక్కడి నుంచే నిమజ్జనం పర్యవేక్షణ...

గణేష్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక నిమజ్జనాన్ని పర్యవేక్షించడానికి ప్రతి ఏడాదీ అన్ని విభాగాలతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పని చేస్తుంది. ఇది ఇప్పటి వరకు బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కేంద్రంగా నడిచింది. ఈ ఏడాది నుంచి ఐసీసీసీ నుంచి ఇది పని చేస్తుంది. దీన్ని త్వరలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెంటర్‌గానూ మారుస్తాం. సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన 2306 అత్యాధునిక కెమెరాలు సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి.

– సీపీ ఆనంద్, హైదరాబాద్ కమిషనర్


ఖైరతాబాద్‌లో..


చింతల్ బస్తీలో..


నీటమునిగిన అమీర్‌పేట్ చర్మాస్ చౌరస్తా

ఒక్కసారిగా దంచికొట్టిన వానతో జనజీవనం స్తంభించిపోయింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత గంటపాటు కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు, బస్తీలు, కాలనీలు నీటమునిగాయి. ముఖ్యంగా ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే గేట్ వద్ద పెద్ద ఎత్తున వరద నీరు నిలిచింది. ఖైరతాబాద్, రాజ్‌భవన్ రోడు, పంజగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్ జంక్షన్లలో వరద నీరు భారీగా చేరడంతో ట్రాఫిక్ నెమ్మదిగా ముందుకు కదిలింది.

– బంజారాహిల్స్

వాన... హైరానా


ఖైరతాబాద్‌లో..

వడివడిగా..

- ఎన్నికల నేపథ్యంలో దూకుడుగా బీఆర్ఎస్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- బిజీబిజీగా మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: అక్టోబర్–నవంబర్ మధ్య ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూలు వెలువడ నుందనే సంకేతాలు వెలువడుతుండటంతో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. నోటిఫికేషన్ రాక ముందే నగరంలో పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలు, టెండర్లు పూర్తయిన పనుల శంకుస్థాపనలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొంటూ మునిసిపల్ మంత్రి కేటీఆర్ బిజీ బిజీగా మారారు. తుదిదశలో ఉన్న పనులను సత్వరం పూర్తిచేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలందుతున్నాయి. నోటిఫికేషన్ వచ్చేలోగా వీలైనన్ని ఎక్కువ కార్యక్రమాల్తో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్న అధికార బీఆర్ఎస్...అందుకనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

- ఇప్పటికే రెండు విడతల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీతో పార్టీకి మంచి మైలేజీ వచ్చిందని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. మరో రెండు విడతల పంపిణీకి చకచకా ఏర్పాట్లు చేస్తోంది.
- ఇప్పటి వరకు నగరవ్యాప్తంగా 30 వేల ఇళ్ల పంపిణీ కాగా, మరో 40 వేల ఇళ్లు కూడా త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హెచ్ఆర్‌డీసీఎల్‌ల ఆధ్వర్యంలో రూ.545 కోట్లతో మూసీపై నిర్మించనున్న 14 బ్రిడ్జిల పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. దుర్గం చెరువు వద్ద ఎస్టీపీ, మ్యూజికల్ ఫౌంటెన్లను సైతం ప్రారంభించారు. మంగళవారం ఆధునీకరించిన పంజగుట్ట శ్మశానవాటిక, నెక్లెస్‌రోడ్‌లో లేక్‌ఫ్రంట్ వాటర్‌పార్కు, బేగంపేట పాటిగడ్డలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లను ప్రారంభించనున్నారు.
- తద్వారా ఇప్పటికే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పనుల గురించి ప్రజలకు వివరించడంతో పాటు, ఇంకా ఎన్నో పనులు చేయబోయేదీ తామేనని సందర్భానుసారం చెబుతున్నారు.
- ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీల వల్ల ప్రజల ఇబ్బందులు తగ్గాయని చెబుతూ వాటి రెండో దశ పనుల్ని కూడా త్వరలో చేపడతామని పేర్కొన్నారు. నిధులకు వెనుకాడబోమని, మూసీపై నిర్మించే బ్రిడ్జిలు ప్రత్యేకంగా ఉండేందుకు అవసరమైతే అదనపు నిధులు కూడా కేటాయిస్తున్నామన్నారు.
- పారిస్, గ్రీస్ దేశాల్లోని బ్రిడ్జిలను చూసి రావాల్సిందిగా తానే అధికారులను అక్కడకు పంపానని కేటీఆర్ చెప్పారు.


ఉప్పల్ భగాయత్‌లో మూసీ వంతెనలకు శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్

కేబీఆర్ పార్కులో యాచకుల బెడదపై ‘ఎక్స్’లో ఫిర్యాదు

- స్పందించిన జీహెచ్ఎంసీ కమిషనర్



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్ వేలో యాచకుల బెడద వాకర్లకు ఇబ్బందిగా మారుతున్నదని, ఇక్కడ యాచించేందుకు ఎవరు అనుమతులు ఇచ్చారని భానుమూర్తి అనే వాకర్ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ప్రముఖ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ (ట్విట్టర్) ద్వారా ఆదివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ తక్షణమే తనిఖీలు చేపట్టి వాక్‌వేలో యాచిస్తున్న వారిని కుటుంబ సభ్యులకు అప్పగించాలని జీహెచ్ఎంసీ సర్కిల్–18 యూసీడీ విభాగం అధికారులను ఆదేశించారు. దీంతో సర్కిల్–18 యూసీడీ విభాగం అధికారులు ఆదివారం రాత్రి వాక్‌వేలో తనిఖీలు నిర్వహించారు. ఓ మహిళ ఇక్కడకు వస్తున్న వాకర్లతో పాటు పక్కనే ఉన్న హోటల్‌వద్ద టీ తాగేందుకు వచ్చిన కస్టమర్ల వద్ద యాచిస్తున్నట్లు గుర్తించారు. స్థానిక పోలీసుల సహకారంతో ఆమెను బంజారాహిల్స్‌రోడ్ నెం.2లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వెనుక నివాసం ఉంటున్న కుమారుడి వద్దకు చేర్చారు. అయితే ఆమె బెగ్గర్ కాదని, సరుకులు కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లిందని కుమారుడు అధికారులకు చెప్పారు. మరోసారి బయటకు రాకుండా చూసుకోవాలని, ఇది మంచి పద్ధతి కాదని తల్లీకొడుకులకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు.

వల వేసి..దోచేసి..

- రెండో పెళ్లంటూ గాలం
- కస్టమ్స్ పేరుతో లూటీ
- రూ.5.55 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: నగరానికి చెందిన మహిళ రెండో పెళ్లి కోసం ప్రయత్నాలు చేస్తోంది. మ్యాట్రిమోనియల్‌కు సంబంధించిన సోషల్ మీడియా సైట్లను ఫాలో అవుతుండేది. ఇందులో భాగంగా యూఎస్‌లో సైంటిస్ట్‌గా చేస్తున్నానంటూ ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతను ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ పంపిన మహిళను ప్రేమలోకి దించాడు. ఈ క్రమంలో గిఫ్ట్‌గా డాలర్స్ పంపుతున్నానని చెప్పాడు. ఆ తర్వాత రెండు రోజులకు ఢిల్లీ కస్టమ్స్ అధికారి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ పేరుపై డాలర్స్, ఖరీదైన గిఫ్ట్‌లు వచ్చాయని, రూ. 25 వేలు చెల్లిస్తే వాటిని మీకు అందజేస్తామన్నారు. ఇలా పలు దఫాలుగా బాధితురాలి నుంచి రూ. 5.55 లక్షలు దోచుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు
ప్రపంచ స్థాయి గుర్తింపు

గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్



అమీర్‌పేట: భారత దేశం స్టార్టప్స్, మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. క్వాలిటీ ఫోరం ఆఫ్ ఇండియా (సీసీక్యూసీ–2023) హైదరాబాద్ చాప్టర్ 37వ వార్షిక చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ సోమవారం అమీర్‌పేట మ్యారి గోల్డ్ హోటల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ స్టార్టప్‌ల పేరుతో సృజనాత్మకతకు పెద్దపీట వేస్తూ దేశంలో యువ పారిశ్రామిక వేత్తలు ఎదుగుతున్న తీరు అభినందనీయమన్నారు.యువ తరం ఉద్యోగాలు కోరుకోవడం కాకుండా ఉద్యోగాలు కల్పించే దిశగా దృష్టి సారించాలన్నారు. కోవిడ్ సమయం తొలి రోజుల్లో పీపీఈ కిట్ గురించి తెలియని పరిస్థితి నుంచి నేడు నాణ్యమైన, పూర్తి స్థాయిలో సురక్షితమైన పీపీఈ కిట్లను తయారు చేసే స్థాయికి ఎదిగామన్నారు. అనతి కాలంలో దేశంలో తయారైన ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతవుతుండటం గర్వించదగ్గ విషయమన్నారు. అనేక ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌లో అత్యుత్తమ నాణ్యతతో సత్తా చాటుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇప్పటి వరకు దాదాపు 98వేలకు పైగా స్టార్టప్‌లు దేశ వ్యాప్తంగా పరుగులు పెడుతున్నాయన్నారు. వివిధ విభాగాల్లో నాణ్యతకు పెద్ద పీట వేస్తూ సంస్థలను ప్రగతి బాట పట్టించిన పలువురికి గవర్నర్ అవార్డులు అందజేశారు. ఎస్ఎమ్‌టీసీ, బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, థర్మో కేబుల్స్, థర్మోప్యాడ్స్, ఉషా ఇంటర్నేషనల్, రాంకో సిమెంట్స్, టీఎస్ఆర్టీసీ, తోషిబా, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, రేణుకా ప్లాస్టిక్స్ సంస్థల ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి, క్యూసీఎఫ్ఐ చైర్మన్ బాలకృష్ణారావు, కార్యదర్శి దయానందరెడ్డి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను వాడుకుని వదిలేశారు

- వచ్చే ఎన్నికల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- 10 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లు కేటాయించాలి
- విద్యార్థి నేతల రాజకీయ డిక్లరేషన్



రాజకీయ డిక్లరేషన్ విడుదల చేస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారులను, ఆత్మబలిదానాలు చేసుకున్న కుటుంబాలను వాడుకుని వదిలేస్తే చరిత్ర క్షమించదని పలువురు విద్యార్థి నేతలు అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో టీఎస్ జాక్, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ విద్యార్థి నేతల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టీఎస్ జాక్ చైర్మన్ రుద్రవరం లింగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థి నేతలు ప్రసంగించారు. నాడు చదువులను వదులుకొని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాధనలో భాగస్వాములైన విద్యార్థులు నేడు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకోగా పలువురు లాఠీదెబ్బలు, పోలీసు కేసులతో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. నేడు వారి జీవితాలు అగమ్యగోచరమయ్యాయన్నారు. విద్యార్థులను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న అన్ని పార్టీలు వారిని విస్మరించడం దారుణమన్నారు. ఉద్యమ నేతలకు ఉద్యోగాలు రాక, రాజకీయ అవకాశాలు దక్కక ఆర్థికంగా, ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నేతలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలని డిక్లరేషన్‌లో కోరారు.

రాజకీయ డిక్లరేషన్ అంశాలివీ..

ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థినేతలకు ప్రతి రాజకీయ పార్టీ 10 ఎమ్మెల్యే టిక్కెట్లు, 2 ఎంపీ టిక్కెట్లు 2 మంత్రి పదవులు ఇవ్వాలి.

నామినేటెడ్ పదవులతో పాటు పార్టీలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక పదవులు ఇవ్వాలి

అలాంటి పార్టీలకే తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల మద్దతు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు రుద్రవరం లింగస్వామి, దుర్గం భాస్కర్, శరత్, వట్టికూటి రామారావుగౌడ్, మేడి రమణ, నెహ్రూనాయక్, బుల్లెట్ కృష్ణ, గాదె వెంకట్, పాల్వాయి నగేష్, విజయ్, పుసల రమేష్, దర్శన్, నాగేశ్వర్‌రావు, కంచర్ల బద్రీ, నర్సింహా, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో చిన్నారుల గుండె ఆపరేషన్లు విజయవంతం

తొలి రోజు నలుగురికి శస్త్ర చికిత్స



ఆపరేషన్ చేయించుకున్న లింగాల అవని

లక్డీకాపూల్ : నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) చార్లెస్ హార్ట్ హీరోస్ పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో తొలి రోజు నలుగురు చిన్నారులకు ఉచితంగా గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు చేశారు. సోమవారం లండన్‌కు చెందిన గుండె వైద్యనిపుణులు డాక్టర్ రమణ ధన్నపునేని ఆధ్వర్యంలో నిమ్స్ కార్డియా థొరాసిక్ సర్జరీ విభాగం వైద్యులు సీలోఫర్ వైద్యులతో కలిసి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాకు చెందిన లింగాల అవని(04), ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన నిత్య(03), భువనగిరికి చెందిన యోగేష్(07), సిరిసిల్లకు చెందిన లక్ష్మీ ప్రసన్న(07)లకు ఆపరేషన్లు చేశారు. అనంతరం వారిని వార్డుకు తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. నిరుపేద చిన్నారుల ప్రాధాన్యత క్రమంలో శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిమ్స్ కార్డియా థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఎం. అమరేష్‌రావు అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మరో ముగ్గురికి గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

నేడు నిమ్స్‌కు బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ రాక

నిమ్స్ వైద్యులతో గారెత్ విన్ ఓవెన్ సమావేశం



గారెత్ విన్ ఓవెన్ (ఫైల్)

లక్డీకాపూల్ : నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)ను మంగళవారం బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ సందర్శించనున్నారు. నిరుపేదలకు అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్య సేవలను అందిస్తున్న నిమ్స్ సేవలను ఆయన పర్యవేక్షించనున్నారు. కార్డియాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరో సర్జన్ తదితర విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా నిమ్స్ బోర్డు రూమ్‌లో ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులతో డిప్యూటీ హై కమిషనర్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆయన రాకను పురస్కరించుకుని నిమ్స్ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

నిమజ్జనానికి నిరంతరాయ విద్యుత్

సీఎండీ రఘుమారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 28న నగరంలో నిర్వహించే గణేష్ శోభాయాత్రకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సర్వం సిద్ధం చేసిందని ఆ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ కంట్రోల్ రూమ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. నిమజ్జన సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ముప్పై 500 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 30, 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 32, 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, 100 కిలో మీటర్ల 11 కేవీ ఎల్‌టీ కేబుళ్లను, పోల్స్‌ను, అదనపు కండక్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా తీరు తెన్నులను ఆపరేషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్‌మార్గ్‌లో ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.శ్రీనివాస్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిల్స్‌కు పీ అండ్‌ఎం డైరెక్టర్ సీహెచ్ మదన్‌మోహన్, ఐడీపీఎల్ చెరువు సమీపంలోని ఏర్పాట్లను కమర్షియల్ డైరెక్టర్ కె.రాములు, సరూర్ నగర్ చెరువు పరిసరాల్లో హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జి.పర్వతం, చార్మినార్ జోన్‌కు ఐపీసీ డైరెక్టర్ స్వామిరెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. చీఫ్ జనరల్ మేనేజర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు తమ తమ జోనల్, సర్కిల్ పరిధులలో నిర్వహించే నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూంలతో పాటు, పోలీస్ శాఖ వారు ఏర్పాటు చేసిన జాయింట్ కంట్రోల్ రూంలలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రధానంగా విద్యుత్ భద్రతపై దృష్టి సారించాలని, శోభాయాత్రలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు చేపట్టాలని సీఎండీ ఆదేశించారు. ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడినప్పుడు సమీపంలో నున్న విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ వారికి గాని, 100 / 1912 మరియు ట్యాంక్ బండ్ విద్యుత్ కంట్రోల్ నెంబర్ 7901530966 / ఎన్టీఆర్ మార్గ్ 7901530868 ద్వారా గాని, దీనికి తోడు సంస్థ మొబైల్ యాప్, ట్విట్టర్, ఫేస్ బుక్ వంటి ద్వారా కూడా తమ శాఖ వారికి తెలియజేయాలని సీఎండీ ప్రజలకు సూచించారు.

థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేయాలి

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

నాంపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ ఎదుట ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం అందజేయాలని, థర్డ్‌పార్టీ ఏజెన్సీ ద్వారా కాకుండా విద్యా శాఖ నుంచి అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నేరుగా విధుల్లోకి తీసుకుని ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ట్రైబ్స్ అడ్వాన్స్‌డ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కమిషనరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంఘం నాయకుడు బానోతు సురేందర్ నాయక్ మాట్లాడుతూ... విద్యా వాలంటీర్లుగా ప్రభుత్వం 2008లో 339 మందిని రూ.3 వేల వేతనంపై గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నియమించిందన్నారు. ప్రస్తుతం వీరంతా మైదాన ప్రాంతాల్లోని 54 పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. మూడవ తరగతి నుంచి 10వ తరగతి వరకు నాణ్యమైన విద్యా బోధనను అందిస్తూ రెగ్యులర్, సీఆర్‌టీలతో సమానంగా పనిచేస్తున్నామన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం విద్యా వలంటీర్ వ్యవస్థను రద్దు చేసిందని, ప్రస్తుతం రూ. 12వేల వేతనం చెల్లిస్తూ థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా నియామకాలు చేపట్టారన్నారు. థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా విద్యా శాఖ విధుల్లోకి తీసుకుని కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికి పీఎఫ్, ఈహెచ్‌ఎస్ సదుపాయం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లకావత్ తిరుపతి నాయక్, గుగులోతు కృష్ణవేణి, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్

గాంధీఆస్పత్రి : ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మెడికల్, డెంటల్ కాలేజీల్లో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ప్రత్యేక చట్టాలను రూపొందించిందన్నారు. జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడితే బాధ్యులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడుతుందన్నారు. దీంతో వారి భవిష్యత్ నాశనం కావడమేగాక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతారన్నారు. డ్రగ్స్, మత్తు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా డ్రగ్స్, మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులు, కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించాలని సూచించారు. ఢిల్లీలోని ఎంఎన్‌సీ ఆదేశాల మేరకు గాంధీ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని, కంప్లెయింట్ బాక్స్‌లను నూతనంగా ఏర్పాటు చేశామని, ర్యాగింగ్‌కు గురైనవారు తమ వివరాలు వెల్లడించకుండా ఫిర్యాదు చేయవచ్చని కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీలో అన్నిరకాల వసతులు, సౌకర్యాలు ఉన్నాయని, లైబ్రరీ, రీడింగ్‌రూమ్‌లను వినియోగించుకుని ఉత్తమ వైద్యులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. ఎంతోకష్టపడి చదివి ర్యాంకు సాధించి ఇక్కడకు వచ్చే గ్రామీణ ప్రాంత విద్యార్థులను సీనియర్లు మరింత ప్రోత్సహించాలని, విద్యార్థులకు మానసిక సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే కౌన్సెలింగ్ ఇస్తామని గాంధీ సైక్రియాట్రిక్ హెచ్‌ఓడీ, ఎర్రగడ్డ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఉమాశంకర్ అన్నారు. పలువురు వైద్యులు, వైద్యవిద్యార్థులు, యాంటీ ర్యాగింగ్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కత్తితో హల్‌చల్ చేసిన యువకుల అరెస్ట్

చిలకలగూడ : కత్తితో హల్‌చల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మట్టంరాజు, ఎస్ఐ బాలరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిలకలగూడ నామాలగుండు, కిందిబస్తీ, భవానీనగర్‌లకు చెందిన మధు, మనీష్, దిలీప్ తదితరులు స్నేహితులు. కొంతకాలంగా దిలీప్ మిగిలిన వారికి దూరంగా ఉంటున్నాడు. పలుమార్లు తమతో రమ్మని పిలిచిన రాకపోవడంతో వారు దిలీప్‌పై కోపం పెంచుకున్నారు. ఈనెల 23న ఉదయం నామాలగుండు చౌరస్తాలో ఆటోతో ఉన్న దిలీప్ తండ్రి మక్కల్‌బాబుతో వారు పథకం ప్రకారం వాగ్వాదానికి దిగి, ఆటోను ధ్వంసం చేశారు. వెంట తెచ్చుకున్న కత్తితో హల్‌చల్ చేస్తూ ప్రయాణికులు, స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. దిలీప్ ఇంటికి వెళ్లి హంగామా సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేలోగా వారు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు బీరం మధు, రౌతుల మనీష్‌కుమార్‌లను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

27 నుంచి తెలంగాణ గోల్కొండ మాస్టర్స్–2023



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న హెచ్‌జీఏ అధ్యక్షుడు జయంత్ ఠాగూర్ తదితరులు

గోల్కొండ: తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ 9వ ఎడిషన్ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నట్లు హైదరాబాద్ గోల్ఫ్ అధ్యక్షుడు జయంత్ ఠాగూర్ అన్నారు. సోమవారం గోల్కొండ నయాఖిలాలోని హెచ్‌జీఏ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ సంవత్సరం ప్రైజ్ మనీ రూ.కోటి అందజేయనున్నట్లు తెలిపారు. 120 మంది ప్రొఫెషనల్ గోల్ఫర్స్‌తో పాటు ముగ్గురు ఔత్సాహికులు ఈ టోర్నమెంట్‌లో ట్రోఫీ కోసం పోటీ పడతారన్నారు. ట్రోఫీకి ప్రజెంటింగ్ పార్టనర్‌గా బోలినేని పలాచే, కోప్రజెంటింగ్ పార్టనర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తున్నారని, క్రీడాకారులకు తాము ఆతిథ్యం ఇస్తున్నట్లు తెలిపారు. 2015లో ప్రారంభమైన గోల్కొండ మాస్టర్స్‌కు ఏటా ఆదరణ పెరుగుతోందన్నారు. 2018, 2020 విజేత ఒలంపియన్ ఉదయన్‌మానే ఈసారి కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా ఆర్డర్ ఆఫ్ మెరిట్ లీడర్ ఓంప్రకాష్ చౌహాన్, అమన్ రాజ్, కె.పి.సింగ్, ఎస్.బిష్ణోయ్, హెచ్‌ఎస్ సేతి, గౌరవ్ ప్రతాప్‌సింగ్ కూడా పోటీలో ఉన్నారన్నారు. వీరితో పాటు బంగ్లాదేశ్, జపాన్, అండోరా, కెనడాకు చెందిన గోల్ఫర్స్ కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. స్థానిక చాలెంజ్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెషనల్స్ హైదర్ హుస్సేన్, మహ్మద్ అజార్, హార్దిక్ ఎస్ బావ్జా పోటీలో ఉన్నారన్నారు.

నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు



మాట్లాడుతున్న సీపీ చౌహాన్, హాజరైన పోలీసు అధికారులు

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

లాలాపేట: రాచకొండ పరిధిలో గణేష్ నిమజ్జనం సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. సోమవారం ఆయన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలతో సోమవారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ప్రణాళికా ప్రకారం జరగాలని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విగ్రహాల నిమజ్జన విషయంలో నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. ఎక్కడా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకూడదని ఈ విషయంలో సమష్టిగా కృషి చేయాలన్నారు. నిమజ్జనం సాగే మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాచకొండ పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ, నీటి పారుదల శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా ముగిసేలా చూడాలన్నారు. సీసీటీవీలపై నిరంతరం నిఘా ఉంచాలని.. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎలాంటి సమస్యలు, ఘర్షణలు లేకుండా చర్యలు చేపట్టాలనీ, సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పెంచాలని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో ప్రత్యేక పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. తప్పుడు వదంతులు వ్యాప్తి చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. సమావేశంలో యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ 1 అభిషేక్ మహంతి, ఎస్ఓటీ మల్కాజిగిరి, ఇన్‌చార్జి డీసీపీ గిరిధర్, ఎస్బీ డీసీపీ బాలస్వామి, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఎల్బీనగర్ డీసీపీ సాయి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, అనురాధ, డీసీపీ సైబర్ క్రైమ్ అరవింద్, డీసీపీ రోడ్ సేఫ్టీ శ్రీబాల, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

లారీని ఓవర్ టేక్ చేస్తూ..

- అదుపుతప్పిన బైక్
- ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



పవన్ (ఫైల్)



గాయపడిన మణిదీప్.

సుభాష్‌నగర్: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు డీసీఎంను ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కింద పడిపోవడంతో వెనక నుంచి వచ్చిన టిప్పర్ వారి మీదుగా వెళ్లడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కైసర్ నగర్‌లో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్వర్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ ఐఏఆర్ఈ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న పవన్ (21), మణిదీప్ (20) మల్లంపేటలో నివాసం ఉంటున్నారు. సోమవారం కాలేజీకి వెళ్లి తిరిగి వస్తున్న వీరు కైసర్ నగర్ సమీపంలో ముందు వెళుతున్న డీసీఎంను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డారు. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన టిప్పర్ వీరిపై నుండి వెళ్లడంతో తీవ్ర గాయాలైన పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మణిదీప్‌ను ఆసుపత్రికి తరలించారు. మృతుడు పవన్ జగిత్యాల జిల్లా, ధర్మపురి మండలం, బూరుగుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

28న ట్రాఫిక్ ఆంక్షలు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భారీగా జనం వాహనాలపై తరలి రావడంతో ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నిమజ్జనానికి తరలివచ్చే భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం సాఫీగా సాగేందుకు ఖైరతాబాద్ చౌరస్తా, షాదాన్ కళాశాల, నిరంకారి, ఓల్డ్ సైఫాబాద్ పీఎస్ జంక్షన్, అయోధ్య, ఇక్బాల్ మినార్, తెలుగుతల్లి ఫ్లైఓవర్ చౌరస్తాలతో పాటు ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు రోటరీ ప్రాంతాల్లో ఈ నెల 28న మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదని ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జి.సుధీర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వారివారి గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రహమత్‌నగర్: శాసన సభ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదికలు అందించనున్నట్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల అధికారి (జీహెచ్ఎంసీ డీఎంసీ-19) చంద్రశేఖర్ తెలిపారు. బోరబండ డివిజన్‌లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. వసతులు, రక్షణ తదితర అంశాలపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని 329 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటిలోని వసతులపై నివేదికలను రూపొందించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

నవనీత భూషితుడైన విజయగణపతి


వెన్నతో అలంకృతుడైన విజయగణపతి

వెంకటేశ్వరకాలనీ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన శ్రీ విజయగణపతి సోమవారం వెన్న పూస అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అష్టగణపతుల మూల మంత్ర సంపుటీకరణాలతో అభిషేకం, చతురావృత్తి క్షీరతర్పణం, మూల మంత్ర హవనములు, త్రిశాలార్చన, గణపతి ఉపనిషత్ పారాయణాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు.

కబ్జా చెర నుంచి రోడ్డుకు మోక్షం!

- జూబ్లీహిల్స్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు


జూబ్లీహిల్స్ రోడ్ నెం.51లోని సొసైటీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ విజిలెన్స్ విభాగం అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌రోడ్ నెం 51లో జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీకి చెందిన కమ్యూనిటీ హాల్ ఆవరణలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ ఈవీడీఎం అధికారులు నేలమట్టం చేశారు. సోమవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈవీడీఎం ఏసీపీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్ అమృత్‌రెడ్డిలతో పాటు ఇతర అధికారుల నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు.

- జూబ్లీహిల్స్ రోడ్ నెం.48లోని చిరెక్ పబ్లిక్ స్కూల్ వైపు నుంచి రోడ్ నెం 51కి సొసైటీ కమ్యూనిటీ హాల్‌కు చెందిన రెండు బిల్డింగ్స్ మధ్య నుంచి సుమారు 50 ఫీట్ల రోడ్డు ఉంది.
- 200 మీటర్లకు పైగా ఉన్న ఈ రోడ్డును ఆక్రమించేందుకు సొసైటీ ఆధ్వర్యంలో రోడ్ నెం.48వైపున ప్రహరీ నిర్మించారని, దీన్ని తొలగించాలని గతంలోనే హైకోర్టు తీర్పు ఇచ్చినా ఇప్పటిదాకా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని సొసైటీ మాజీ కార్యదర్శి మురళీముకుంద్ ఇటీవల ఈవీడీఎం డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- దీంతోపాటు రోడ్ నెం 51ని ఆనుకుని హైటెన్షన్ లైన్ కింద ఉన్న జీహెచ్ఎంసీ గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని కూడా ఆక్రమించి ప్రహరీ నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- విచారణ చేపట్టిన ఈవీడీఎం అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని నిర్ణయించారు.
- ఈ మేరకు పటిష్ట బందోబస్తు నడుమ సోమవారం కూల్చివేతలు చేపట్టారు.
- జూబ్లీహిల్స్ సొసైటీ లే అవుట్ ప్లాన్‌లో స్పష్టంగా రోడ్డు అని ఉందని, జీహెచ్ఎంసీ నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తీసుకున్న అనుమతులలోనూ ఇది రోడ్డు స్థలంగానే చూపించడంతో కూల్చివేతలు చేపట్టినట్లు ఈవీడీఎం అధికారి అమృత్‌రెడ్డి వెల్లడించారు.
- ఆక్రమణలను తొలగించడంతో ఇక నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెం.48 నుంచి నేరుగా.. సులువుగా రోడ్ నెం. 51 వైపునకు వెళ్లేందుకు వీలు ఏర్పడిదంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాఖ్య అధ్యక్షులకు గౌరవవేతనం ఇప్పించాలి


సమాఖ్య అధ్యక్షురాళ్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌నివాసంలో జీహెచ్ఎంసీ సర్కిల్-18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లకు చెందిన మహిళా సమాఖ్యల అధ్యక్షురాళ్లు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తూ కేంద్రానికి గతంలోనే తీర్మానం చేసి పంపిందని దానం గుర్తుచేశారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తమకు కూడా రిసోర్స్ పర్సన్ల తరహాలో గౌరవ వేతనం ఇప్పించాలని 33 మంది సమాఖ్య అధ్యక్షురాళ్లు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్టీకి ప్రభుత్వానికి వారధిగా పనిచేయడంతో పాటు మహిళా పొదుపు సంఘాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. వీరి సమస్యలను త్వరలోనే తాను మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే దానం హామీ ఇచ్చారు.

స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లోకి...

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్


బీఆర్ఎస్‌లో చేరిన ఎంఐఎం నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గోపీనాథ్

రహమత్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్ ఎంఐఎం నాయకుడు షేక్ మునీర్ తమ పార్టీకి చెందిన 200 మంది కార్యకర్తలతో కలిసి సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... బోరబండ డివిజన్ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. పార్టీలో చేరిన మునీర్‌తోపాటు ఆయన అనుచరులకు పార్టీలో సముచిత స్థానం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం పార్టీ బోరబండ డివిజన్ కో ఆర్డినేటర్ విజయసింహ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి


నివాళులర్పిస్తున్న ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి

బంజారాహిల్స్: హిందూధర్మ పరిరక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన గొప్ప వ్యక్తి, బీజేపీ సిద్ధాంత కర్త, గ్రామీణాభివృద్ధి స్వావలంబన, దేశ ఆర్థిక వ్యవస్థకు మూలం అని చాటిచెప్పిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని సోమవారం నిర్వహించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని సుఖ్‌దేవ్‌నగర్ బస్తీలో ఆయన జయంతిని నిర్వహించారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలు గుర్తుచేసుకున్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లామన్నారు.

ఓబీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న కాటం నర్సింహయాదవ్

పంజగుట్ట: నారీ శక్తి వందన్ అభియాన్ పేరుతో కేంద్రం మహిళలకు 33 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించడం ఎంతో సంతోషమని, అందులో 50 శాతం ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం తీసుకురావాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ రిజర్వేషన్లు కూడా 2024 ఎన్నికల్లో అమలయ్యేలా చూడాలని, ఇది అమలు కావాలంటే వెంటనే దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని కోరారు. సోమవారం తుమ్మలబస్తీలోని వేదిక రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహయాదవ్, నగర అధ్యక్షుడు బిజ్జి జనేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్ల ఆంజనేయులు గౌడ్, మహిళా నాయకులు కె.మాలతి, శ్రీదేవి మాట్లాడుతూ... మహిళలకు చట్టసభల్లో స్థానం కల్పిస్తే వారు ఎంతో సమర్థవంతంగా పనిచెయ్యగలుగుతారన్నారు.

- చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినందుకు బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ, విద్యార్థి విభాగం కమిటీ, నగర కమిటీ అన్ని కమిటీల్లో మహిళలకు 33 శాతం కేటాయిస్తూ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. సమావేశంలో డి.శ్రీనివాస్, ఆంజయ్య, మామిడాల కవిత, వేద, విజయ, బ్రహ్మచారి, మహేష్, బాలరాజు గౌడ్, అనిత పాల్గొన్నారు.

30 నుంచి శౌర్య జాగరణ యాత్ర


శౌర్య జాగరణ యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: యువతను మేల్కొలిపి సనాతన ధర్మ పరిరక్షణకు పోరాడేలా చేసేందుకు విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'శౌర్య జాగరణ యాత్ర' నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాత్ర పోస్టర్, కరపత్రం, స్టిక్కర్‌ను బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, వీహెచ్‌పీ కార్యదర్శి పండరీనాథ్, ప్రచార ప్రముఖ్ పి.బాలస్వామి, ఉపాధ్యక్షులు జగదీశ్వర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో భారతీయత, హిందుత్వం, సనాతన ధర్మంపై కొంతమంది అరాచకవాదులు దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నుపూర్ శర్మ, రాజాసింగ్ లాంటి వారు చిన్నచిన్న మాటలు మాట్లాడితేనే గగ్గోలు పెట్టే వారు ఇప్పుడు సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడితే వారంతా ఏమయ్యారని ప్రశ్నించారు. దేశ సమగ్రతకు పెను ముప్పుగా సంక్రమిస్తున్న పలు ప్రమాదకర విషయాలపై యువతను మేల్కొలుపుతామని, ముఖ్యంగా దేశ ప్రజలందరికీ ఒకే చట్టం తెచ్చే కామన్ సివిల్ కోడ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి మద్దతుగా ఉండేలా చేస్తామన్నారు. యాత్ర ఎక్కడ ప్రారంభం అవుతుంది, ఎటు వెళ్తుందనే విషయాలపై అతి త్వరలో రూట్‌మ్యాప్ ప్రకటిస్తామన్నారు.

గణనాథుడికి అరవై వంటకాలతో నైవేద్యం



రహమత్‌నగర్: తాము కొలిచే గణనాథుడికి ఓ భక్తుడు అరవై రకాల వంటకాలను తయారు చేసి నైవేద్యంగా సమర్పించి తమ భక్తి చాటుకున్నారు. వివరాలివీ... రహమత్‌నగర్‌కు చెందిన రవీందర్ రెడ్డి తమ నివాసమైన భాను టవర్స్‌లో సోమవారం అరవై రకాల వంటకాలతో స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలను తయారు చేయించారు. పూజారి విద్యాధర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయా వంటకాలను గణేశుడికి నైవేద్యంగా సమర్పించారు.



మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 22 మంది వాహనదారులను సోమవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వీరిలో సంజయ్‌కుమార్‌సాహా, చిన్నబాబు అనే ఇద్దరికి న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 3300 చొప్పున జరిమానా విధించారు. సంపత్ అనే వాహనదారుడికి 2 రోజుల జైలు, రూ. 2100 జరిమానా విధించారు. మిగతా 19 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బీసీలకు అధిక సీట్లు కేటాయించాలి

లిబర్టీ: జనాభా ప్రాతిపదికన బీసీలకు వచ్చే ఎన్నికల్లో అధిక టికెట్లు ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగరాజ్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని టీపీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు దామాషా ప్రకారం కాంగ్రెస్ నాయకత్వం టికెట్లు ఇవ్వాలని విన్నవించారు.

భార్యను కొట్టి చంపాడు..

భర్తపై కేసు నమోదు చేయండి!

పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయవాది

వెంగళరావునగర్: కట్టుకున్న భార్యను అమానుషంగా కొట్టి చంపిన భర్తపై చర్యలు తీసుకోవాలని వెంగళరావునగర్‌కు చెందిన అడ్వకేట్ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల సమాచారం మేరకు... నిజామాబాద్‌కు చెందిన షేక్ సలీంకు కామారెడ్డి నివాసి ఫర్హానా బేగంతో దాదాపు 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరు వెంగళరావునగర్ డివిజన్ మసీదుగడ్డలో నివాసం ఉంటున్నారు. నాటి నుంచి సలీం తన భార్యను తరచూ మద్యం సేవించి వేధిస్తూనే ఉన్నాడు. ఈ ఏడాది జూన్ 15వ తేదీ నాటికి వారికి 13 ఏళ్ల కుమార్తె, 27 రోజుల మరో పాప ఉన్నారు. అదే ఏడాది జూన్ 14వ తేదీ రాత్రి సలీం బాగా మద్యం సేవించి వచ్చి భార్యను చిత్రహింసలకు గురి చేశాడు. అర్ధరాత్రి వరకూ కొట్టాడు. 15వ తేదీ తెల్లవారుజామున భర్త దెబ్బలకు తాళలేక భార్య ఫర్హానా బేగం మృతిచెందింది. ఈ విషయాన్ని దాచిన సలీం ఏమీ తెలియనట్టుగా తన భార్య సాధారణ మృతి చెందినట్టుగా తల్లిదండ్రులు, బంధువులు, చుట్టుపక్కల వారిని నమ్మించాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని కామారెడ్డికి తీసుకెళ్లి సమాధి చేశాడు. అయితే పిల్లలను వదిలేసి గుట్టు చప్పుడు కాకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కొంతకాలం తర్వాత వేరే మహిళను వివాహం చేసుకుని రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. తల్లి మృతిచెంది, తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో చిన్నారులు అనాథలయ్యారు. దాంతో వారి దూరపు బంధువైన అడ్వకేట్ అన్వర్ మహ్మద్ ఖాన్ స్పందించి సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్యను చంపిన సలీంపై చర్యలు తీసుకుని పిల్లలకు తగిన న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మజ్లిస్ బచావో తహరీక్ (ఎంబీటీ) ప్రతినిధి అంజాదుల్లాఖాన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో చర్చించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

గెస్ట్‌హౌస్‌లో పేకాట శిబిరం

ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు: రూ. 9500 స్వాధీనం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.2లోని ఎస్ఎస్‌వీ గెస్ట్‌హౌస్‌లో గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న పేకాట శిబిరంపై జూబ్లీహిల్స్ ఎస్ఐ రాకేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... కొంతకాలంగా ఎస్ఎస్‌వీ గెస్ట్‌హౌస్‌లో మద్యంతో పాటు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి దాడులు చేశారు. గెస్ట్ హౌస్ మేనేజర్ ఎ.శరత్‌కుమార్, ఇందిరానగర్‌కు చెందిన ఎం.శంకర్, బోరబండకు చెందిన షేక్ జహంగీర్, ఎస్.కోటేశ్వర్‌రావు, కె.నాగేష్‌కుమార్‌లు పేకాడుతూ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 9500తోపాటు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సందడిగా ఆర్ఎస్ఎస్ 'ఘోష్ నాదం'

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి సమక్షంలో సోమవారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘోష్ నాదం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. 5.15 నిమిషాల నుంచి 6గంటల వరకు 70 మంది ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఆనక్, శంఖ, వంశీ, ఫ్లూట్‌లతో మహాగణపతి ఎదుట ఘోష్ నాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులకు ఉత్సవ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, వీణామాధురి, సందీప్‌రాజ్, చందు ఘనంగా స్వాగతం పలికారు.

గణనాథులకు ఘనంగా పూజలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వాడవాడలా ప్రతిష్ఠించిన గణనాథులకు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. చాలా మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో నిర్వహించిన గణపతి హోమంలో రచయిత పరుచూరి గోపాలకృష్ణ, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ పాల్గొని పూజలు నిర్వహించారు. సోమాజిగూడ డివిజన్ కపాడియా లేన్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బంజారాహిల్స్‌లోని ఆయా మండపాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు విజయారెడ్డి, రోహిన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. - బంజారాహిల్స్


సోమాజిగూడ గణేష్‌నగర్‌లోని శ్రీలక్ష్మి గణపతి టెంపుల్ వద్ద అన్నదానం


బంజారాహిల్స్‌లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డి


ఎన్‌బీటీనగర్‌లో టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి


సోమాజిగూడ మార్కెట్ బస్తీలో కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్


కపాడియా లేన్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ఫిలింనగర్ దైవసన్నిధానంలో వినాయక హోమంలో పాల్గొన్న రచయిత పరుచూరి గోపాలకృష్ణ, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ


ఫిలింనగర్ బీజేఆర్‌నగర్‌లో బీఆర్ఎస్ నేత మామిడి నర్సింగరావు


హేమావతినగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి, రవిగౌడ్


వినాయకుల రూపంలో చిన్నారులకు చాక్లెట్స్ అందిస్తున్న బర్డ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ చిన్నారులు


ఎర్రగడ్డలో పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్


ఫిలింనగర్‌లో జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ


శ్రీరాంనగర్‌లో అన్నదానం చేస్తున్న రవిశేఖర్‌రెడ్డి




జూబ్లీహిల్స్ కమలానగర్‌లో వినాయకుడి పూజలు భక్తులు

మా గొంతును నొక్కితే ఊరుకోలేం

లోక్‌సభ సీట్ల కేటాయింపుపై కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: '1971 జనాభా లెక్కల ఆధారంగా ప్రస్తుతం లోక్‌సభ సీట్ల కేటా యింపు రాష్ట్రాల వారీగా జరిగింది. 2026 నాటికి ఈ లెక్కల ఆధారంగా అంచనా వేసుకుని సీట్ల కేటాయింపు జరిగితే కొన్ని రాష్ట్రాలకు లాభం, మరికొన్నింటికి నష్టం జరుగుతుంది' అంటూ వస్తున్న వార్తల పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీ రామారావు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో స్పందించారు. ఒకవేళ ఈ సంఖ్యలు నిజమైతే దక్షిణ భారతదేశ వ్యాప్తంగా బలమైన ప్రజా ఉద్యమం మొదలవుతుంది. మేము భారతీయులుగా గర్విస్తానే భారత్‌లో అత్యుత్తమంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాం. దేశంలో అత్యున్నత ప్రజాస్వామ్య వేదికపై మా ప్రాతినిధ్య గొంతును నొక్కితే మౌన ప్రేక్షకుల్లా చూస్తూ ఊరుకోలేము. మేము చెప్తున్న విషయాలను ఢిల్లీ వింటుందని అనుకుంటున్నాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

మహిళా కోటా 2034 తర్వాతే

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై నెట్టా డిసౌజా



సాక్షి, హైదరాబాద్: నారీశక్తి వందన్ బిల్లు అమలు 2034కు ముందు సాధ్యం కాదని జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా అభిప్రాయపడ్డారు. బీజేపీ ప్రభుత్వం చెప్పిన విధంగా జనగణన, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఇప్పట్లో పూర్తయ్యేది కాదని, మహిళా బిల్లు కేవలం ఒక ప్రకటన మాత్రమేనని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, నేతలు పద్మ, చారులతా రాథోడ్, రాధ తదితరులతో కలిసి ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన పదేళ్ల పాటు మహిళా రిజర్వేషన్ల బిల్లును పట్టించుకోకుండా, ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా లోక్‌సభలో పెట్టి ఆమోదించారని, కొత్త పార్లమెంటు భవనం సాక్షిగా మహిళలను అవమానించారని నెట్టా విమర్శించారు. దేశంలో మహిళలెదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడేందుకు ప్రధాని మోదీ సిద్ధంగా లేరని, ఆయన ఒక చెవిటి, మూగ అని వ్యాఖ్యానించారు.

రాజకీయం చేయాలంటే ఉద్యోగం విడిచిపెట్టండి

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మెదక్: పని చేయని అధికారులు తమ వద్ద ఉంటే కొట్టి ఇళ్లకు పంపించేవార మని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అధికారులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు హేమలత అధ్యక్షతన సోమవారం మెదక్‌లో నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ఊరు మన బడి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో పంచాయతీరాజ్ శాఖ అధికారుల తీరును భూపాల్‌రెడ్డి తప్పుబట్టారు. మీ వల్లే జిల్లాలో అభివృద్ధి కుంటుపడుతోందని, రాజకీయం చేయాలనుకుంటే ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి పనుల కోసం సీఎం కేసీఆర్ రూ.20 లక్షలు కేటాయించినా.. బిల్లులు సకాలంలో ఇవ్వక పోవటంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావటం లేదన్నారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలో సీసీరోడ్ల నిర్మాణాలతో పాటు ఇతర పనులకు ఎంబీ రికార్డు చేసి సంగారెడ్డి జిల్లాకు పంపాలని చెప్పినా ఎవరూ పట్టించుకోలేదంటూ మండిపడ్డారు. తీరు మారకుంటే చర్యలు తప్పవన్నారు.

తెలంగాణలో చంపేసి .. ఏపీలో తగలబెట్టేసి..

- ఆస్తి కోసం కొడుకు వేధింపులు..
- తాళలేక రూ.3 లక్షలకు సుపారీ
- కిరాయి హంతకులతో కలిసి చంపేసిన తల్లిదండ్రులు

ఎటపాక(అల్లూరి సీతారామరాజు జిల్లా): తల్లిదండ్రులే కన్న కొడుకుని సుపారీ ఇచ్చి హత్య చేయించిన దారుణ ఘటన ఇది. కేసు వివరాలను రంపచోడవరం అడిషనల్ ఎస్పీ కేవీ మహేందర్‌రెడ్డి సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈనెల పదో తేదీన ఎటపాక మండలం రాయనపేట పంచాయతీ పరిధి తుమ్మలనగర్ సమీపంలో సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో మృతుడు తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణం మెడికల్ కాలనీకి చెందిన పగిల్ల దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. మృతుడు దుర్గాప్రసాద్‌కు తల్లిదండ్రులు సావిత్రి, రాము మధ్య తరచూ ఆస్తి తగదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇల్లు తనకు రాయాలంటూ దుర్గాప్రసాద్ తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవ పడేవాడు. దీంతో విసిగిపోయిన తల్లిదండ్రులు ఇల్లు అమ్ముకుని వేరే ప్రాంతానికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇల్లు అమ్మేందుకు కూడా కన్నకొడుకు దుర్గా ప్రసాద్ అడ్డంకిగా మారడంతో ఎలాగైనా అంతమొందించాలన్న నిర్ణయానికి వచ్చారు.

చంపేసి మృతదేహానికి నిప్పుపెట్టి

భద్రాచలంలోని జగదీష్‌కాలనీకి చెందిన గుమ్మడి రాజు, షేక్ అలీపాషాకు రూ.3 లక్షల సుపారి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనెల 9వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న దుర్గా ప్రసాద్‌ను వారిద్దరితోపాటు తల్లిదండ్రులు కలిసి కత్తితో పీక కోసి చంపేశారు. మృతదేహాన్ని ఆటోలో తీసుకుని సరిహద్దునే ఉన్న ఆంధ్రా పరిధిలోని తుమ్మలనగర్ సమీపంలో పొదల మాటున పడేసి పెట్రోల్ పోసి నిప్పుపెట్టి వెళ్లిపోయారు. హత్యకు పాల్పడిన నలుగురు ఈ నెల 25న ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లిపోతుండగా పురుషోత్తపట్టణం చెక్‌పోస్టు వద్ద వారిని సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ పార్థసారథి అదుపులోకి తీసుకున్నారని అడిషనల్ ఎస్పీ వివరించారు.

అమరావతి.. ఓ ఆర్థిక అగాధమే

ఇప్పుడే కాదు.. భవిష్యత్తులోనూ గుదిబండే

- లోపభూయిష్ట భూ సమీకరణ విధానమే ప్రధాన కారణం
- ప్రభుత్వ భూములను వదిలేసి ప్రైవేట్ భూములా?
- రాజధానిపై నిపుణుల కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదు
- ఆర్థిక ప్రణాళిక లేకుండా సీఆర్‌డీఏ రూ.33,476 కోట్ల ప్యాకేజీ ఒప్పందాలు
- టీడీపీ సర్కారు రాజధాని నిర్వాకాలను ఎండగట్టిన 'కాగ్' నివేదిక



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి రాష్ట్రంపై అంతులేని భారీ ఆర్థిక భారాన్ని మోపుతుందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తక్షణంతో పాటు భవిష్యత్తులోనూ మోయలేని ఆర్థిక భారాన్ని కలిగిస్తుందని స్పష్టం చేసింది. ఇందుకు ప్రధాన కారణం గత సర్కారు గ్రీన్ ఫీల్డ్ రాజధాని పేరుతో నిపుణుల కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, ప్రభుత్వ భూములు విస్తారంగా అందుబాటులో ఉండే ప్రదేశాలను వదిలేసి బయటి వ్యక్తుల నుంచి చాలా ఎక్కువ భూమిని పూలింగ్‌తో సేకరించడమేనని స్పష్టం చేసింది. ఈమేరకు కాగ్ సమర్పించిన తనిఖీ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీకి సమర్పించింది. ఇందులో ప్రధానంగా అమరావతి విషయంలో టీడీపీ సర్కారు అనుసరించిన విధానాలను, భూ సమీకరణను కాగ్ తీవ్రంగా తప్పుబట్టింది.

అంతా అసమగ్రం..

ఇష్టానుసారంగా భూ కేటాయింపులు

రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులపై మూడు సార్లు ఆడిట్ నిర్వహించినట్లు కాగ్ నివేదికలో వెల్లడించింది. గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని ఎంచుకునేటప్పుడు పరిగణలోకి తీసుకున్న కీలక పరిమితులు, రాజధాని నగర అభివృద్ధికి భూమి వాస్తవ అవసరాన్ని అంచనా వేసేందుకు చేపట్టిన సాధ్యాసాధ్యాల అధ్యయన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించలేదని కాగ్ తప్పుబట్టింది. రాజధాని నగర అభివృద్ధికి సంబంధించిన మొత్తం ప్రాజెక్టు ప్రణాళిక వివరాల్లో సమగ్రత లేదని పేర్కొంది. అమరావతిలో ఏకరీతిలో భూ కేటాయింపుల విధానాన్ని అమలు చేయలేదని, వివిధ ప్రైవేట్ సంస్థలకు ఏకపక్షంగా కేటాయింపులు జరిగాయని కాగ్ నివేదిక ఎండగట్టింది. చేపట్టిన పనులన్నీ 2017 నవంబర్ నుంచి 2019 ఫిబ్రవరి వరకు ప్రారంభించలేదని, దీంతో ఎల్‌పీఎస్ (ల్యాండ్ పూలింగ్ స్కీమ్) మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం సాధ్యం కాలేదని కాగ్ పేర్కొంది. రహదారి పనులతో కూడిన ప్రాధాన్యత కలిగిన మౌలిక సదుపాయా లను సరైన అంచనా, ప్రాథమిక సర్వే లేకుండా చేపట్టడంతో పనుల పురోగతి దెబ్బ తిందని కాగ్ తెలిపింది. అమరావతి రాజధాని అభివృద్ధిలో నిపుణుల కమిటీ సిఫార్సులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదని తప్పుబట్టింది. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెంట్లపై తగిన విధానాన్ని అనుసరించకుండా నామినేషన్ పద్ధతిలో ఎంపిక చేశారని కాగ్ పేర్కొంది.

ప్రణాళిక లోపంతో వ్యయంపై ప్రభావం

స్పష్టమైన ఆర్థిక ప్రణాళిక లేకుండా ఏపీ సీఆర్‌డీఏ, ఏడీసీఎల్‌లు రూ.33,476.23 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్యాకేజీల కోసం ఒప్పందాలను కుదుర్చుకున్నాయని కాగ్ నివేదికలో ప్రస్తావించింది. రాజధాని నగర అభివృద్ధిపై విధానపరమైన మార్పు ఫలితంగా 2019 మే నుంచి కాలపరిమితి లేని ఒప్పందాల ప్యాకేజీలు అనిశ్చితిగా ఉన్నాయని తెలిపింది. గత సర్కారు హయాంలో నిబంధనలకు విరుద్ధంగా జలవనరుల పరిధిలో అనధికారికంగా గ్రీవెన్స్ సెల్ భవన నిర్మాణానికి ఏపీ సీఆర్‌డీఏ అనుమతి ఇవ్వడాన్ని కాగ్ తప్పుబట్టింది. రాజధాని నగరానికి భూమి వాస్తవ అవసరాలను అంచనా వేసేందుకు సాధ్యాసాధ్యాల అధ్యయనం రికార్డులను సీఆర్‌డీఏ అందించలేదని కాగ్ పేర్కొంది. పర్యవసానంగా ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం లేనందున ఎల్‌పీఎస్ ద్వారా సేకరించిన భూమి అవసరం హేతుబద్ధతను నిర్ధారించలేకపోయినట్లు కాగ్ వెల్లడించింది. దశలవారీ ప్రణాళిక లేకపోవడంతో ప్రాజెక్టుల వ్యయంపై ప్రభావం పడిందని, కార్యాచరణ ప్రణాళికను సూచించడానికి సలహా కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ కమిటీ సిఫార్సులను ఆడిట్‌కు అందుబాటులో ఉంచలేదని కాగ్ తెలిపింది.

కేంద్రం వివరణ కోరినా..

- టీడీపీ సర్కారు నిర్దిష్ట విధివిధానాలను అనుసరించకుండా కన్సల్టెన్సీ సంస్థలు, కన్సల్టెంట్లను ఎంపిక చేసినట్లు కాగ్ నివేదిక పేర్కొంది. రాజధాని నగర ప్రణాళిక ప్రక్రియలో ఏపీ సీఆర్‌డీఏ టెండరింగ్, కాంపిటేటివ్ బిడ్డింగ్ విధివిధానాలను అనుసరించకుండా మూడు కన్సల్టెన్సీ సంస్థలకు రూ.28.96 కోట్ల ఒప్పంద విలువతో నామినేషన్ ప్రాతిపదికన ఇచ్చినట్లు కాగ్ తెలిపింది. రాజధాని నగరానికి సంబంధించి రూ.1,09,023 కోట్ల అంచనాతో డీపీఆర్‌లు రూపొందించినప్పటికీ వీటిలో రూ.46,400 కోట్ల మేర డీపీఆర్‌లను నీతి ఆయోగ్‌కు సమర్పించలేదని వెలుగులోకి తెచ్చింది. డీపీఆర్‌లు లోప భూయిష్టంగా ఉన్నాయని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం దీనిపై వివరణ కోరినా గత సర్కారు సమర్పించలేదని కాగ్ తెలిపింది.

రూ.44.24 కోట్లు రోడ్ల పాలు..!

- అమరావతిలో భూమిలేని పేదలు, రైతులకు పెన్షన్ల చెల్లింపులు, యాన్యుటీ చెల్లింపుల్లోనూ అవకతవ కలు జరిగాయని కాగ్ నివేదిక పేర్కొంది. 110 కేసుల్లో పెన్షన్లు, యాన్యుటీ రెండూ చెల్లించారని కాగ్ వెలుగులోకి తెచ్చింది. రాజధానిలో 30 పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు 2016–17 నుంచి 2018–19 మధ్య కాలంలో రూ.1,282.83 కోట్లు అడ్వాన్స్‌లు ఇచ్చారని, ఇందులో రూ.338.57 కోట్లు మాత్రమే ఇప్పటివరకు వసూలు చేశారని, మిగతా రూ.944.36 కోట్లను వసూలు చేయలేదని కాగ్ పేర్కొంది. సీడ్ యాక్సెస్ రోడ్డును నాలుగు వరుసల నుంచి తొమ్మిది వరుసలు చేసేందుకు రహదారి విస్తరణ పనులు చేపట్టగా జాతీయ రహదారులకు అనుసంధానించకపోవడం, భూ సేకరణ సమస్య కారణంగా రూ.44.24 కోట్లు అనాలోచితంగా వ్యయం చేసినట్లు కాగ్ తప్పుబట్టింది.

చంద్రబాబును మరో 5 రోజులు మా కస్టడీకి ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

సీఐడీ వివరించింది. కోర్టు ఇచ్చిన కస్టడీ ఉత్తర్వులను చదివే పేరుతో గంటల కొద్దీ సమయాన్ని వృథా చేశారని తెలిపింది. 2 రోజుల కస్టడీకి మాత్రమే ఇవ్వడంతో ఆ గడువును ఆయన అడ్డం పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారంది. ఆయన నుంచి పలు అంశాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని రాబట్టాల్సి ఉందని, అందువల్ల ఆయనను తమ కస్టడీకి అప్పగించడం అత్యావశ్యకమని తమ పిటిషన్‌లో కోర్టుకు నివేదించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుపుతామని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులను ఆదేశించింది.

మధ్యాహ్నం వరకు కోర్టు ఉత్తర్వులను చదువుతూనే ఉన్నారు

'చంద్రబాబును 5 రోజుల కస్టడీకి అప్పగించాలంటూ మొదట ఈ నెల 11న పిటిషన్ దాఖలు చేశాం. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పలు షరతులతో కేవలం 2 రోజుల కస్టడీకే అప్పగిస్తూ ఈ నెల 22న ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు విధించిన షరతులకు లోబడి చంద్రబాబును విచారించాం. విచారణ సందర్భంగా ఆయన నుంచి పలు వివరాలు రాబట్టేందుకు ఈ కేసుకు సంబంధించిన విషయాలతో ప్రశ్నలను సిద్ధం చేశాం. మా ప్రశ్నల తీరు మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేశాం. మొదటి రోజు విచారణలో చంద్రబాబు మేం అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేశారు. కోర్టు ఇచ్చిన పోలీసు కస్టడీ ఉత్తర్వులను ప్రశ్నించారు. పోలీసు కస్టడీ ఉత్తర్వుల కాపీని తనకు అందచేస్తే తప్ప, దర్యాప్తు అధికారి అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేది లేదని కరాఖండిగా చెప్పారు. తనకు ఎలాంటి ఆధారాలు ఇవ్వకుండానే పోలీసు కస్టడీకి ఇచ్చారని, న్యాయవాదిని కలుసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని చంద్రబాబు చెప్పారు. కోర్టు ఇరుపక్షాల వాదనలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తరువాతనే మిమ్మల్ని పోలీసు కస్టడీకి ఇవ్వడం జరిగిందని దర్యాప్తు అధికారి ఆయనకు చెప్పారు. ఒకవేళ పోలీసు కస్టడీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే, న్యాయ వాది ద్వారా ఆ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని కూడా చంద్రబాబుకు దర్యాప్తు అధికారి స్పష్టం చేశారు. మిమ్మల్ని విచారించేందుకు కోర్టు మాకు అనుమతినిచ్చిందని, మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ఆయనకు దర్యాప్తు అధికారి తేల్చి చెప్పారు. కస్టడీ ఉత్తర్వులను తీసుకున్న చంద్రబాబు వాటిని మధ్యాహ్నం 1 గంట వరకు చదివారు. దర్యాప్తు అధికారి గంట పాటు భోజన విరామ సమయం ఇచ్చారు. భోజన విరామం తరువాత వచ్చి కూడా 2 గంటల వరకు కోర్టు ఉత్తర్వులను చదువుతూనే ఉన్నారు. 2.20 గంటల సమయంలో మాకు కోర్టు కేవలం రెండు రోజుల కస్టడీ మాత్రమే ఇచ్చిందని చంద్రబాబుకు దర్యాప్తు అధికారి స్పష్టంగా చెప్పారు. చదవడం ఆపి, తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆయనను దర్యాప్తు అధికారి కోరారు. అయితే దీనిని చంద్రబాబు పట్టించుకోలేదు. అలా మరికొద్దిసేపు కోర్టు ఉత్తర్వులను చదువుతూనే ఉన్నారు' అని సీఐడీ తన పిటిషన్‌లో పేర్కొంది.

15 రోజుల తరువాత విచారణకు ఆస్కారం లేదనే..

'మేం ఏ సరళిలో ప్రశ్నలు అడగాలనుకున్నామో మమ్మల్ని అలా చంద్రబాబు అడగనివ్వలేదు. అంతేకాక ఆయన చెప్పే విషయాలను రాసుకోవాలని దర్యాప్తు అధికారికి చెప్పారు. తనకు తెలిసిన విషయాలకు సంబంధించి కూడా ఆయన నోరు మెదపలేదు. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దాటవేశారు. చాలా సందర్భాల్లో దర్యాప్తు అధికారిని మాటలతో వంచించే వైఖరిని అవలంబించారు. తాను విచారణ సందర్భంగా ఇలానే వ్యవహరించాలని చంద్రబాబు ముందే ఓ నిర్ణయానికి రావడంతో, ఈ కేసులో కీలక నిందితులైన వికాస్ ఖన్వేల్కర్, షెల్ కంపెనీల డైరెక్టర్లు, ఇతర కుట్రదారులైన గంటా సుబ్బారావు (ఏ1), లక్ష్మీనారాయణ (ఏ2)ల వాంగ్మూలాలను ఆయన ముందుంచి వివరాలు రాబట్టే అవకాశం లేకుండా పోయింది. అలాగే కీలక సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా చంద్రబాబు నుంచి తగిన వివరాలు తెలుసుకోలేకపోయాం. ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ, కావాల్సిన సమాచారాన్ని రాబట్టనివ్వకుండా దర్యాప్తు సంస్థను నిరోధిస్తూ వచ్చారు. విచారణ సందర్భంగా తీసిన వీడియోను పరిశీలిస్తే చంద్రబాబు వేసిన కాలయాపన ఎత్తులు సులభంగా అర్థమవుతాయి. అరెస్ట్ చేసిన నాటి నుంచి 15 రోజుల తరువాత ఎలాంటి జ్యుడీషియల్ ఇంటరాగేషన్ ఉండదన్న ఉద్దేశంతోనే చంద్రబాబు కావాలనే దర్యాప్తు అధికారి కోరిన సమాచారాన్ని ఇవ్వలేదు.' అని సీఐడీ వివరించింది.

చంద్రబాబు సహాయ నిరాకరణ వల్ల అది సాధ్యం కాలేదు...

- 'ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో లోతైన కుట్ర దాగి ఉంది. ఈ కుట్ర వెనుక వాస్తవాలను వెలికితీసేందుకు చంద్రబాబును విచారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార దుర్వినియోగ, ప్రైవేటు వ్యక్తులకు చేకూర్చిన లబ్ధి గురించి ప్రశ్నించాల్సి ఉంది. సాక్షులు చెప్పిన వివరాలను ఆయన ముందుంచి వాటి ఆధారంగా వాస్తవాలను రాబట్టాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థగా మాపై ఉంది. చంద్రబాబు సహాయ నిరాకరణ వల్ల వివరాలను రాబట్టలేక పోయాం. కీలక ఫైళ్లు గల్లంతయ్యాయి. ఈ ఫైళ్ల గల్లంతు వ్యవహారంలో చంద్రబాబు, అచ్చెన్నాయుడు, గంటా సుబ్బారావు, డాక్టర్ లక్ష్మీనారాయణ ప్రధాన లబ్ధిదారులుగా అనుమానిస్తున్నాం. గల్లంతైన ఫైళ్ల ఆచూకీ తెలుసుకునేందుకు చంద్రబాబు కస్టోడియల్ విచారణ అత్యావశ్యకం' అని సీఐడీ తన పిటిషన్‌లో పేర్కొంది.

హైకోర్టు ఉత్తర్వుల వల్ల 5 రోజుల పాటు కస్టడీలోకి తీసుకోలేకపోయాం...

'కోట్లాది రూపాయల డబ్బు 2018–20 సంవత్సరాల మధ్య తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు దర్యాప్తులో గుర్తించాం. ఆ బ్యాంకు ఖాతాలకు తానే అథరైజ్డ్ సిగ్నేటరీ అన్న విషయాన్ని చంద్రబాబు కూడా అంగీకరించారు. భారీ స్థాయిలో వచ్చిన నగదు డిపాజిట్ల వివరాలను చంద్రబాబు ముందు ఉంచి, వాటి గురించి ఆయన్ను ప్రశ్నించాల్సి ఉంది. టీడీపీ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన అన్ని వివరాలు అందించాలని హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ మేనేజర్‌ను కోరాం. ఆ వివరాలు రావాల్సి ఉంది. వచ్చిన తరువాత వాటిని విశ్లేషించి చంద్రబాబును విచారిస్తాం. తనపై మేం నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఈ నెల 13న విచారణ జరిపిన హైకోర్టు, 18వ తేదీ వరకు మా పోలీసు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబును ఒత్తిడి చేయవద్దని ఉత్తర్వులిచ్చింది. ఈ ఆరు రోజులను మొదటి 15 రోజుల గడువు నుంచి మినహాయించాల్సిన అవసరం ఉంది. హైకోర్టు ఆదేశాల వల్ల మా కస్టడీ పిటిషన్‌పై ఈ ఏసీబీ కోర్టు విచారణ జరిపే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో తగినంత గడువు లేకపోవడంతో మేం కోరుకున్న విధంగా చంద్రబాబును 5 రోజుల పోలీసు కస్టడీకి తీసుకోలేకపోయాం' అని సీఐడీ తన పిటిషన్‌లో తెలిపింది.

ప్రధాన సూత్రధారి చంద్రబాబేనని దర్యాప్తులో తేలింది...

'ఈ స్కిల్ కుంభకోణం డబ్బు మొత్తం చివరకు నగదు రూపంలో చేరింది వికాస్ ఖన్వేల్కర్, షెల్ కంపెనీలకు. ఇందుకు ప్రధాన సూత్రధారి చంద్రబాబు అని దర్యాప్తులో తేలింది. షెల్ కంపెనీల ద్వారా డబ్బు మొత్తం తిరిగి ఆయనకే చేరింది. సుమన్ బోస్, వికాస్ ఖన్వేల్కర్, లక్ష్మీనారాయణ, గంటా సుబ్బారావు, సంజయ్ దాగాలు చెప్పిన వివరాల ఆధారంగా చంద్రబాబును ప్రశ్నించాల్సి ఉంది. ఈ కుంభకోణం అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ అని మా దర్యాప్తులో తేలింది. నిధుల మళ్లింపులో ఎవరెవరి పాత్ర ఏమిటన్న విషయాలు చంద్రబాబుకు పూర్తిగా తెలుసు. కుట్ర పన్నిన తీరు, ఇతర నిందితుల పాత్ర, ఇతర కీలక వివరాలన్నీ చంద్రబాబుకు తెలుసు. ఈ వివరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చంద్రబాబును 5 రోజుల పాటు మా కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం' అని సీఐడీ తన పిటిషన్‌లో తెలిపింది.

చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లను ఒకేరోజు విచారిస్తాం

- రెండింటిలో ఒకేసారి ఉత్తర్వులిస్తాం
- స్పష్టంచేసిన ఏసీబీ ప్రత్యేక కోర్టు
- తదుపరి విచారణ నేటికి వాయిదా
- చంద్రబాబు న్యాయవాదులపై తీవ్ర అసహనం
- కోర్టును కార్నర్ చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్య

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబునాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుపుతామని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే, చంద్రబాబును మరో ఐదు రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా అదేరోజు విచారణ జరుపుతామని తేల్చిచెప్పింది. ఈ రెండు వ్యాజ్యాలపై ఒకేరోజు విచారణ జరిపి, ఒకేసారి తీర్పు వెలువరిస్తామని కోర్టు తెలిపింది. వాస్తవానికి.. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం కోర్టు విచారణ జరపాల్సి ఉంది. అయితే, రెండ్రోజుల పోలీసు కస్టడీలో విచారణకు చంద్రబాబు ఏమాత్రం సహకరించకపోవడంతో మరో ఐదురోజుల పాటు ఆయనను తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ తాజాగా పిటిషన్ దాఖలు చేసింది. కస్టడీ ఎందుకు కోరుతున్నామో సీఐడీ అందులో వివరించింది. ఈ సమయంలో చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదులు ప్రమోద్‌కుమార్ దూబే, దమ్మాలపాటి శ్రీనివాస్‌లు స్పందిస్తూ.. తమ బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టాల్సిందేనని పట్టుబట్టారు. తాము బెయిల్ పిటిషన్ దాఖలు చేసి చాలా రోజులైందన్నారు. దీంతో సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగ వివేకానంద, హైకోర్టు అదనపు పీపీ దుష్యంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేసినప్పుడు ముందు దానిపైనే విచారణ జరపాల్సి ఉంటుందన్నారు. పోలీసు కస్టడీ పిటిషన్‌ను తేల్చిన తరువాత బెయిల్‌పై విచారణ జరపవచ్చని తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో ఆరు రోజులపాటు తమ పోలీసు కస్టడీపై ఏసీబీ కోర్టు విచారణ జరపలేని పరిస్థితి వచ్చిందన్నారు. పైగా.. చంద్రబాబు రెండ్రోజుల కస్టడీలో సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించలేదన్నారు. అందుకే ఆయనను మరో ఐదు రోజులపాటు కస్టడీ కోరుతున్నామని.. ముందు తమ పోలీసు కస్టడీ పిటిషన్‌పై తేల్చి, ఆ తరువాత బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపవచ్చునని వారు సూచించారు. ఆ మేర మెమో దాఖలు చేశామన్నారు. పోలీసు కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు ముందు దానినే విచారించి ఆ తరువాత బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును వారు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

బాబు లాయర్లపై కోర్టు ఘాటు వ్యాఖ్యలు..

దీనిని చంద్రబాబు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. ముందు తమ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలన్నారు. సీఐడీ దాఖలు చేసిన మెమోపై ఏదో ఒక నిర్ణయం వెలువరించాలని వారు పట్టుబట్టారు. మెమోను ఆమోదించడమో, తిరస్కరించడమో చేస్తూ ఉత్తర్వులు జారీచేయాల్సిందేనన్నారు. దీనిపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. కోర్టును ఇలాగే చేయాలని పట్టుబట్టలేరని వారికి తేల్చిచెప్పింది. ఈ కోర్టును కార్నర్ చేస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇరువక్షాల వాదనలు విన్న తరువాత ఏం చేయాలన్నది తమ విచక్షణపై ఆధారపడి ఉంటుందని వారికి కోర్టు తేల్చిచెప్పింది. మొదటి నుంచీ ఈ కేసులో ఇలాగే పట్టుపడుతున్నారని తెలిపింది. దీంతో బాబు న్యాయవాదులు వెనక్కి తగ్గారు. తమ ఉద్దేశం అది కాదన్నారు. అటు పోలీసు కస్టడీ, ఇటు బెయిల్ పిటిషన్‌పై ఒకేరోజు విచారణ జరుపుతామని న్యాయస్థానం వారికి తేల్చిచెప్పింది. రెండింటిలోనూ ఒకేసారి తీర్పు వెలువరిస్తానంటూ విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. పోలీసు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు న్యాయవాదులను ఆదేశించింది.

మెన్షన్ చేసి రండి

- చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తేల్చి చెప్పిన సీజేఐ
- మంగళవారం మెన్షనింగ్ జాబితా ద్వారా రావాలని స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్వాష్ పిటిషన్‌ను సోమవారం విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. మంగళవారం మెన్షన్ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ పిటిషన్‌ను విచారించాలంటూ చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సోమవారం ధర్మాసనం ముందు ప్రస్తావించగా, ఈరోజు కాదని, రేపు మెన్షనింగ్ జాబితా ద్వారా రావాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టంచేశారు. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను విచారించాలంటూ సిద్ధార్థ లూథ్రా సోమవారం మెన్షనింగ్ సమయంలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంశమని, ప్రతిపక్షాలను అణచివేస్తున్నారంటూ సిద్ధార్థ లూథ్రా చెప్పబోతుండగా సీజేఐ వారించారు. ఎప్పుడు కస్టడీలోకి తీసుకున్నారని ప్రశ్నించారు. ఈ నెల 8న అని లూథ్రా చెప్పగా.. ఎన్ని రోజులు రిమాండులో ఉన్నారని సీజేఐ మరోసారి ప్రశ్నించారు. వివరాలు చెప్పడానికి లూథ్రా ప్రయత్నిస్తుండగా.. మంగళవారం మెన్షనింగ్ జాబితా ద్వారా రావాలని ధర్మాసనం సూచించింది. లూథ్రా మరోసారి చెప్పడానికి యత్నించినప్పటికీ మంగళవారమే రావాలని సీజేఐ మరోసారి స్పష్టం చేశారు.

ఏపీలో 'అసైన్డ్' రైతులకు యాజమాన్య హక్కులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నిరుపేద రైతులకు వారి అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కేటాయించి 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై వాటి యజమానులకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల (ప్రొహిబిషన్ ట్రాన్స్‌ఫర్) చట్టం –1977 సవరణ బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపింది. దీనితో పాటు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు 10 ఏళ్ల తర్వాత యాజమాన్య హక్కులు బదిలీ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. సోమవారం శాసన సభ మూడో రోజు సమావేశాల్లో మంత్రులు ప్రవేశపెట్టిన 10 బిల్లులతో పాటు బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ చేసిన తీర్మానానికి కూడా సభ ఆమోదం తెలిపింది.

యుగతులసి పార్టీకి రోడ్డు రోలర్ గుర్తు కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా యుగతులసి పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం రోడ్డు రోలర్ గుర్తును కేటాయించిందని ఆ పార్టీ అధ్యక్షుడు కె.శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'నోటరీ' క్రమబద్ధీకరణ జీవోపై హైకోర్టు స్టే

విచారణ నాలుగు వారాలకు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నోటరీ ఆస్తుల క్రయవిక్రయాలను చట్టబద్ధం చేసి క్రమబద్ధీకరిస్తామంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 84పై హైకోర్టు స్టే విధించింది. ఇండియన్ స్టాంప్స్ యాక్ట్–1899 సెక్షన్ 9కు విరుద్ధంగా ఈ జీవో ఉన్నట్లు స్పష్టం చేసింది. దీనికి సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. నోటరీ ఆస్తుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైన విషయం తెలిసిందే. జూలై 26న ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 84 కొట్టివేయాలని కోరుతూ ది భాగ్యనగర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ పిల్ దాఖలు చేసింది. ఈ పిల్ పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

ఆ జీవో నిబంధనలకు విరుద్ధమన్న పిటిషనర్

'ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 84.. ఆస్తి బదిలీ చట్టం–1882, రిజిస్ట్రేషన్ చట్టం–1908, ఇండియన్ స్టాంప్ యాక్ట్–1899 నిబంధనలకు పూర్తి విరుద్ధం. పట్టణాల్లోని వ్యవసాయేతర ఆస్తుల విషయంలో నోటరీ పత్రాల ద్వారా జరిగిన లావాదేవీల ప్రకారం క్రమబద్ధీకరణ సాధ్యంకాదు' అని పిటిషనర్ తరఫున న్యాయవాది డి.నరేందర్ నాయక్ వాదనలు వినిపించారు. చట్ట ప్రకారం నిషేధించిన ఏ పత్రాలనూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌కు అనుమతించబోదని స్పెషల్ జీపీ హరేందర్ పరిషద్ వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు జీవోపై స్టే విధిస్తూ, విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

పోలవరంలో మరో కీలక ఘట్టం

- జలాశయాన్ని ఎడమ కాలువతో అనుసంధానం చేసే సొరంగం పూర్తి
- బాబు కమీషన్ల బాగోతం రట్టు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల్లో మరో కీలక ఘట్టం పూర్తయింది. జలాశయాన్ని ఎడమ కాలువతో అనుసంధానం చేసే సొరంగం (టన్నెల్) తవ్వకం పనులు పూర్తయ్యాయి. 919 మీటర్ల పొడవుతో 18 మీటర్ల వ్యాసంతో 20 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ఈ సొరంగం తవ్వకం పనులను పూర్తిచేశామని.. లైనింగ్ పనులను ప్రారంభించామని పోలవరం ప్రాజెక్టు సీఈ సుధాకర్‌బాబు 'సాక్షి'కి వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఈ పనుల అంచనా వ్యయాన్ని పెంచేసిన అప్పటి సీఎం చంద్రబాబు.. రూ.292.09 కోట్లకు కాంట్రాక్టు సంస్థకు అప్పగించి, కమీషన్లు వసూలుచేసుకున్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నిపుణుల కమిటీ సిఫార్సు మేరకు ఆ కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దుచేసి.. రూ.292.09 కోట్లనే కాంట్రాక్టు విలువగా నిర్ణయించి.. రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. టీడీపీ సర్కార్ హయాంలో కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థే.. ఆ పనులను రూ.231.47 కోట్లకే చేయడానికి 2019, సెప్టెంబరు 19న ముందుకొచ్చింది. దీంతో ఖజానాకు రూ.60.62 కోట్లు ఆదా అయ్యాయి. దీనిద్వారా చంద్రబాబు కమీషన్ల బాగోతాన్ని సీఎం జగన్ రట్టుచేశారు. తక్కువ ఖర్చుతోనే సొరంగాన్ని పూర్తిచేయడం ద్వారా ప్రణాళికాబద్ధంగా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడంలో సీఎం మరో అడుగు ముందుకేశారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

నేషనల్ హార్టీకల్చర్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: నేషనల్ హార్టీకల్చర్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా (అనధికార సభ్యులు) తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన వాణిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌కు చెందిన సింగమ్ సోమశేఖర్‌రెడ్డిలను కేంద్ర ప్రభుత్వం నియమించింది. మొత్తం 8 మందిని నేషనల్ హార్టీకల్చర్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌లో నాన్-అఫీషియల్ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. వీరు మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. కాగా, సోమవారం వాణిపల్లి శ్రీనివాస్‌రెడ్డిని బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించారు.

ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి

• బిహారీ బహూ జెస్సికా





మన దేశంలో పుట్టిన చాలామందికి హిందీ మాట్లాడటం రాదు. కొంతమందికి అర్థమైనప్పటికీ మాట్లాడలేరు. అమెరికా నుంచి వచ్చిన జెస్సికా మాత్రం హిందీలో అనర్గళంగా మాట్లాడేస్తుంది. ఇలా పలకాలి అని హిందీ పాఠాలు కూడా చెబుతోంది. మనదేశానికి వచ్చే విదేశీయులకు హిందీతోపాటు సంస్కృతీ సంప్రదాయాలను పరిచయం చేస్తూ నెటిజనుల మన్ననలను అందుకుంటోంది ఈ 'బిహారీ బహూ'. పదిహేడేళ్లుగా ఇండియాతో చక్కని బంధాన్ని కొనసాగిస్తోన్న జెస్సికా గురించి ఆమె మాటల్లోనే...

''నేను చికాగోలో పుట్టాను. అమ్మానాన్న ఇరు కుటుంబాలకు చెందిన తాత, బామ్మలతో కలిసి ఉండే ఉమ్మడి కుటుంబం మాది. అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములతో కలిసి స్కూలుకు వెళ్లి చదువుకునేదాన్ని. ఆదివారం వచ్చిందంటే... కుటుంబమంతా కలిసి గడుపుతాం. నాన్న అంతర్జాతీయ వ్యాపారి కావడంతో తరచూ చైనా, కొరియాలు వెళ్తుండేవారు. ఆయన్ని చూసి నేను కూడా అలా తిరగాలని అనుకునేదాన్ని. కాలేజీ చదువుకోసం 18 ఏళ్ల వయసులో చికాగో నుంచి వేరే రాష్ట్రానికి వెళ్లాను. నాలుగేళ్లపాటు హాస్టల్‌లో ఉన్నాను. 'చైనా, ఇండియాలలో ఆర్థికమాంద్యం వస్తుంది' అని కాలేజీలో ఎక్కువ మంది విద్యార్థులు మాట్లాడుకునేవారు. అది విన్న నాకు ఇండియా వెళ్లి అక్కడి పరిస్థితులు చూడాలనిపించేది.



• పిల్లలతో జెస్సికా, అభిషేక్

ఏడాదిలో తిరిగి వచ్చేస్తాను అనుకున్నా...

కాలేజీ చదువు పూర్తయిన తరువాత తెలిసిన వాళ్ల ఐటీ కంపెనీ హరిద్వార్‌లో ఉంటే.. అక్కడ ఇంటర్న్‌షిప్ చేయడానికి ఇండియా వచ్చాను. ఇంటర్న్‌షిప్‌తోపాటు భారతీయులు, వారి భాషల గురించి తెలుసుకోవచ్చని అనుకున్నాను. అనుకున్నట్టుగానే ఇరుగు పొరుగు నుంచి కూరగాయలు విక్రయించేవాళ్ల వరకు అందరితో పరిచయం ఏర్పడింది. అందరూ చక్కగా కలిసి పోయేవారు. ఏడాదిలో ఇంటర్న్‌షిప్ పూర్తయిన తరువాత అదే కంపెనీలో ఉద్యోగంలో చేరాను. అలా ఏడాదిలో తిరిగి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయాను. కొంతమంది స్నేహితుల ద్వారా అభిషేక్ పరిచయం అయ్యాడు. నేను ఇక్కడ ఉంటే.. అభిషేక్ అమెరికాలో చదువుకుంటున్నాడు. ఇద్దరం మంచి స్నేహితులుగా మారాం. నేను మా ఇంటికి వెళ్లినప్పుడల్లా అభిషేక్‌ను కలిసేదాన్ని. అలా మా ఇద్దరి స్నేహం ప్రేమగా మారి పెళ్లి వరకు వచ్చి బిహార్ కోడలిని అయ్యాను.

అత్తమామల అనురాగం చూసి...

హరిద్వార్‌లో ఉండే రోజుల్లో ఇక్కడి అత్తమామలు కుటుంబ పెద్దలుగా కోడళ్లు, మనవళ్లను చూసే విధానం నాకు బాగా నచ్చింది. అభిషేక్‌ను పెళ్లిచేసుకోవడానికి అది కూడా ఒక కారణం. మేము పెళ్లి చేసుకుంటామని మా నాన్నని అడిగాం. 'చదువుకున్నాడు, సంపాదిస్తున్నాడు. నిన్ను బాగా చూసుకుంటాడు కాబట్టి పెళ్లిచేసుకో' అని నాన్న చెప్పారు. అభిషేక్ కుటుంబ సభ్యుల్లో సగం మంది అమెరికాలో నివసిస్తుండడంతో వారి గురించి బాగా అర్థం చేసుకోవడం కూడా నాన్న ఒప్పుకోవడానికి ఒక కారణం. అభిషేక్ తల్లిదండ్రులు విదేశీ అమ్మాయిని కోడలుగా ఒప్పుకోవడానికి మొదట్లో భయపడ్డారు. ఎలాంటి అమ్మాయో అని సందేహించినప్పటికీ మా కుటుంబం గురించి తెలుసుకుని పెళ్లికి సమ్మతించడంతో 2010లో మా వివాహం జరిగింది.

ఇండియా విత్ జెస్సికా

ఇక్కడ ఉండే భారతీయులకు, విదేశాల్లో ఉండే ఇండియన్స్‌కు హిందీ నేర్పిస్తున్నాను. అమెరికా, కెనడాలలో స్థిరపడిన ఎంతోమంది భారతీయుల పిల్లలకు హిందీలో మాట్లాడటం తెలీదు. ఇది వాళ్లకు పెద్ద సమస్య. అందుకే నేను హిందీ నేర్పిస్తున్నాను. నాలుగున్నరేళ్ల క్రితం 'ఇండియా విత్ జెస్సికా' పేరిట యూట్యూబ్ ఛానల్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచాను. వీటిద్వారా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిచయం చేస్తున్నాను. కొన్నిసార్లు వివిధ రకాల అంశాలపై మాట్లాడడానికి అతిథిగా కూడా వెళ్తున్నాను. అమెరికా అమ్మాయి ఇండియా గురించి మాట్లాడడం, అందులో హిందీలో అనర్గళంగా మాట్లాడుతుంది అని తెలిసిన వాళ్లంతా ఆశ్చర్యంగా నా క్లాసులు వినడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమంది డబ్బుల కోసం లిప్‌సింక్ వీడియోలు పోస్టు చేస్తుంటారు. నేను అవేమీ చేయడం లేదు. కేవలం తెలియని సమాచారం ఇవ్వడమే నా లక్ష్యం. అందుకే ఫాలోవర్స్ గురించి కూడా పట్టించుకోను. కొంతమంది మెసేజ్‌లకు జవాబులు చెప్పడం లేదని తిడుతుంటారు. నన్ను సెలెబ్రిటీలా చూస్తున్నారు. కానీ నేను సెలబ్రిటీని కాదు. ఇద్దరు పిల్లలకు తల్లిని. వాళ్లకు నేర్పించాలి. వంట చేయాలి. ఇంటిని చూసుకోవాలి. నాకంటూ వ్యక్తిగత జీవితం ఉంది. నేను అందరిలాగే సామాన్యమైన వ్యక్తిని'' అని ఎంతో నిరాడంబరంగా చెబుతోంది జెస్సికా.

జీవితాంతం ఆధారపడాల్సిందే...

పెళ్లి అయిన తరువాత అమెరికాలో కొన్నిరోజులు, ఇండియాలో కొన్ని రోజులు ఉండేవాళ్లం. ఆరేళ్ల తరువాత బిహార్‌కి వచ్చి స్థిరపడ్డాం. మాకు ఇద్దరు పిల్లలు బాబు, పాప. ప్రపంచంలో కూతురికంటే కొడుకులనే మరింత ప్రేమగా చూసుకుంటారు. ఇండియాలో ఇది కాస్తంత ఎక్కువే. అమ్మాయిలకు ఇంట్లో పనులన్నీ చక్కబెట్టేలా అన్నీ నేర్పిస్తారు. అబ్బాయిలకు మాత్రం ఏమీ నేర్పించరు. కొంతమంది తల్లులు అయితే 'మా అబ్బాయికి కప్పు టీ పెట్టడం కూడా రాదు' అని గర్వంగా చెబుతుంటారు. ఇలా అయితే వాళ్లు స్వయంసమృద్ధిని సాధించలేరు. జీవితాంతం ఇతరుల మీద ఆధారపడి జీవించాల్సిందే. అందుకే నేను నా పిల్లలకు లింగభేదం లేకుండా అన్నీ నేర్పిస్తున్నాను.

నేర్చుకుని నేర్పిస్తున్నా...

హరిద్వార్‌లో ఉన్నప్పుడే హిందీ నేర్చుకున్నాను. కోర్సు కూడా చేశాను. బిహార్‌కి వచ్చిన తరువాత నా హిందీ బాగా మెరుగుపడింది. బిహారీలు మాట్లాడే హిందీ సరిగాలేదని, వారి మాటలు విని నవ్వుతుంటారు చాలామంది. కానీ ఇక్కడ మాట్లాడే హిందీలో సంస్కృతం, భోజ్‌పూరి, మైథిలి, అంగిక వంటి భాషలు కూడా కలుస్తాయి. అందుకే బిహారీలు మాట్లాడే హిందీ కొంచెం విభిన్నంగా ఉంటుంది. బిహారీలు మాట్లాడే హిందీపై చాలామందికి ఉండే చిన్నచూపు, వివక్ష పోవాలని నా వీడియోల్లో.. బిహారీ స్టైల్ హిందీనే మాట్లాడుతున్నాను.

న్యూస్ మేకర్



• అపర్ణ అయ్యర్

డైనమిక్ అయ్యర్

సవాలును తలకెత్తుకోవడం అంటే 'తలకు మించిన భారం' అనుకుంటారు కొందరు.

సవాలును స్వీకరించడం అనేది తమను తాము నిరూపించుకునే అపూర్వ అవకాశం అనుకుంటారు మరికొందరు.

అపర్ణ అయ్యర్ రెండో కోవకు చెందిన వ్యక్తి.

'సీఏ పరీక్ష పాస్ కావడం అంటే మాటలు కాదు' లాంటి ప్రతికూల మాటలు అదేపనిగా వినిపించినా 'సీఏ' పై ఆసక్తిని ఎప్పుడూ కోల్పోలేదు. ఆ ఆసక్తే ఆమెను సీఏ బంగారు పతక విజేతను చేసింది. సవాలును చిరునవ్వుతో స్వీకరించే ఆమె ధైర్యం 'విప్రో' లాంటి పెద్ద సంస్థలో సీఎఫ్‌వో (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్)గా బాధ్యతలు స్వీకరించేలా చేసింది...

లీడర్ అంటే ఎవరు?

దారి తెలిసిన వారు, ఆ దారిలో ఆటంకాలు లేకుండా ప్రయాణించే వారు, అవసరమైతే కొత్త దారి చూపించేవారు. ఇలాంటి నాయకత్వ లక్షణాలు ఎన్నో అపర్ణ అయ్యర్‌లో దండిగా ఉన్నాయి కాబట్టే ఆమె మల్టీనేషనల్ ఐటీ కార్పొరేషన్ విప్రోలో ఎన్నో ఉన్నతస్థానాల్లో పనిచేసింది. విప్రోతో ఆమెది రెండు దశాబ్దాల అనుబంధం.

సీనియర్ ఇంటర్నల్ ఆడిటర్‌గా విప్రోలోకి అడుగు పెట్టిన అపర్ణ అక్కడి ఫైనాన్స్ టీమ్‌తో పని చేస్తూ ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ సీఎఫ్‌వో స్థాయికి చేరింది.

ఫైనాన్షియల్ రిస్క్ మేనేజ్‌మెంట్, క్యాపిటల్ అలోకేషన్, ఫండ్ రైజింగ్, బిజినెస్ స్ట్రాటజీ అండ్ గ్రోత్... మొదలైన సబ్జెక్ట్‌లలో అపర్ణ నిపుణురాలు. సబ్జెక్ట్‌లో నైపుణ్యం ఉండగానే సరిపోదు. వివిధ సందర్భాలలో ఆ నైపుణ్యాన్ని సృజనాత్మకంగా అన్వయించి మంచి ఫలితాలు సాధించగలగాలి. ఈ విషయంలో ఎప్పుడూ వెనకబడిపోలేదు అపర్ణ అయ్యర్.

ఇంటర్నల్ ఆడిట్, బిజినెస్ ఫైనాన్స్, ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ ఎనాలటిక్స్, కార్పొరేట్ ట్రెజరీ....ఇలా కంపెనీకి సంబంధించి ఎన్నో విభాగాలలో కీలకపాత్ర పోషించింది.

ముంబై నర్సీ మోంజీ కాలేజీ నుంచి కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన అపర్ణ 2002 సీఏ (చార్టెట్ ఎకౌంటెంట్) గోల్డ్ మెడలిస్ట్.

'అపర్ణ అయ్యర్‌లో అద్భుతమైన నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. తన ముందుచూపు, సాహసోపేతమైన నిర్ణయాలతో సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది' అంటున్నాడు విప్రో సీయివో డెలాపోర్ట్.

'కీలకమైన సమయంలో సీఎఫ్‌వోగా బాధ్యతలు స్వీకరిస్తున్నందుకు సంతోషంగా ఉంది. మరిన్ని విజయాలు సాధించే లక్ష్యంతో మా ప్రయాణం కొనసాగుతుంది' అంటుంది అపర్ణ అయ్యర్.



బ్యూటిప్స్

బౌల్ మసాజ్‌తో మెరిసిపోండి

కొబ్బరి నూనె, ఫేస్ ఆయిల్, మాయిశ్చరైజర్... వీటిలో ఏదైనా ఒకటి ముఖానికి రాయాలి. ఇప్పుడు చిన్న స్టీల్ గిన్నెను తీసుకుని ముఖమంతా మర్దన చేయాలి. నుదురు, కనుబొమ్మలు, బుగ్గలు, మెడ భాగంలో గిన్నెను గుండ్రంగా తిప్పుతూ ముఖానికి రాసిన నూనె లేదా మాయిశ్చరైజర్ చర్మంలోకి పూర్తిగా ఇంకిపోయేంత వరకు మర్దన చేయాలి.



ఇలా చేస్తే...

- ముఖం మీద ముడతలు తగ్గుతాయి.
- చర్మం మృదువుగా మారుతుంది.
- రక్తప్రసరణ మెరుగుపడి చర్మం కాంతిమంతంగా మెరుస్తుంది.
- కండరాల మీద ఒత్తిడి తగ్గి చర్మానికి విశ్రాంతి దొరుకుతుంది.

సాగుబడి

ఉత్తర కార్తె: సెప్టెంబర్ 27 వరకు
హస్త కార్తె: 28 నుంచి

రొయ్యల రైతుకు చేదోడు చైన్ డ్రాగింగ్ బోట్!

- చైన్ డ్రాగింగ్ బోట్‌తో ఆక్వా రైతులకు సమయం, ఖర్చు ఆదా
- బోట్‌పై మనిషి కూర్చొని నడపొచ్చు.. అర గంటలో పదెకరాల్లో చైన్ డ్రాగింగ్ పూర్తి..
- ఏఎన్‌యూ అధ్యాపకుడు డా. తౌసీఫ్ అహ్మద్ ఆవిష్కరణ
- 'అంగ్రూ' ప్రోత్సాహంతో రైతులకు అందుబాటులోకి తేనున్న ఆవిష్కర్త




• 'చైన్ డ్రాగింగ్ బోట్' ఆవిష్కర్త డాక్టర్ తౌసీఫ్ అహ్మద్

సబ్సిడీ కోసం ప్రయత్నిస్తున్నాం

చైన్ డ్రాగింగ్ బోట్ వాడకం వల్ల రొయ్యల నాణ్యత, సర్వయివల్ రేటు పెరుగుతుంది. 'అంగ్రూ' సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఆక్వా రైతులకు ఈ బోట్లను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. తౌహ టెక్నాలజీ ఇన్నోవేషన్ అనే స్టార్టప్ ద్వారా రైతులకు వారం రోజుల్లో తయారు చేయించి ఇస్తున్నాం.

– డా. తౌసీఫ్ అహ్మద్ (98852 09780), ఆవిష్కర్త, నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్, గుంటూరు

'చైన్ డ్రాగింగ్ బోట్'.. రొయ్యల సాగులో రైతులకు ఉపయోగపడే ఒక ఆవిష్కరణ ఇది. ఆక్వా సాగులో శారీరక కష్టం, ఖర్చు, వ్యాధుల బెడద తగ్గించడంతో పాటు రొయ్యల నాణ్యత పెంపొందించేందుకు ఈ చైన్ డ్రాగింగ్ బోట్ ఉపయోగపడుతుంది.



• 'చైన్ డ్రాగింగ్ బోట్'ను రొయ్యల చెరువులో ఉపయోగిస్తున్న దృశ్యం

చైన్ డ్రాగింగ్ అంటే?

రొయ్యల పట్టుబడి పూర్తయిన తర్వాత చెరువును ఎండగడతారు. ఎండి నెర్రెలు బారిన ఆ చెరువులో మళ్లీ రొయ్యల సాగు ప్రారంభించడానికి చెరువులో నీరు నింపిన తర్వాత.. నేలను సిద్ధం చేసే క్రమంలో ఇనుప గొలుసులు చెరువు అడుగున వేసి, ఇద్దరు మనుషులు నడుములోతు నీటిలో నడుస్తూ లాగుతారు. దీన్నే చైన్ డ్రాగింగ్ అంటారు. తద్వారా చెరువు అడుగు మట్టిలో వ్యర్థాలు, విషవాయువులు బయటకు వెళ్లిపోవటంతో పాటు రొయ్యలకు సహజ ఆహారమైన ప్లవకాలు వృద్ధి చెందుతాయి. అయితే, మనుషులు నీటిలో నడుస్తూ చైన్ డ్రాగింగ్ చేయటం వ్యయ ప్రయాసలతో కూడిన పని.

ఈ పనిని సులువుగా, తక్కువ కాలంలో, తక్కువ ఖర్చుతో చేయడానికి ఉపయోగపడే వినూత్నమైన పడవను గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు డాక్టర్ తౌసీఫ్ అహ్మద్ రూపకల్పన చేశారు. ఈ 'చైన్ డ్రాగింగ్ బోట్' ఆక్వా రైతులకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తోంది. గుంటూరు జిల్లా నిజాంపట్నం ప్రాంతంలోని ఆక్వా రైతుల కోరిక మేరకు నాలుగేళ్ల క్రితం డాక్టర్ తౌసీఫ్ పరిశోధనలు ప్రారంభించారు. ఈ క్రమంలో యూనివర్సిటీలోని త్రీడీ ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్‌లో 'చైన్ డ్రాగింగ్ బోట్'ను డిజైన్ చేశారు. ఈ ఆవిష్కరణకు భారతీయ పేటెంట్ సంస్థ 2020లో డిజైన్ పేటెంట్‌ను మంజూరు చేసింది.

'చైన్ డ్రాగింగ్ బోట్' లీటరు పెట్రోల్‌తో 2 గంటలు పనిచేస్తుంది. దీనితో అర గంట సమయంలోనే 10 ఎకరాల్లోని రొయ్యల చెరువుల్లో చైన్ డ్రాగింగ్ పనిని పూర్తి చేయవచ్చని డా. తౌసీఫ్ తెలిపారు. మనుషులు చేసిన దానికంటే అధిక సామర్థ్యంతో స్లడ్జ్ వంటి వ్యర్థాలను తొలగించటం, చెరువు అడుగు నేలను గుల్లబరచటంలో ప్రయోజనకారిగా నిలుస్తోందన్నారు.

'అంగ్రూ' ప్రోత్సాహం

'చైన్ డ్రాగింగ్ బోట్'కు సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలోని త్రీడీ ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్‌లో ప్రత్యేక డిజైన్‌ను రూపొందించిన డా. తౌసీఫ్ అహ్మద్.. అందుకు అనుగుణంగా మూడు ప్రత్యేక స్టీల్ ఫ్రేమ్‌లతో కూడిన బోట్‌ను తయారు చేయించారు. దానికి జీఎక్స్ 160 హోండా ఇంజన్‌ను, వెనుక చైన్‌ను అమర్చారు. పెట్రోల్‌తో నడిచే ఈ బోట్‌పై ఒకరు కూర్చుని నడపవచ్చు. దీని తొలి బోట్‌ను రైతులకు ఇచ్చి వాడిన తర్వాత వారి సూచనల మేరకు తగు మార్పులు చేశారు. చైన్ డ్రాగింగ్ బోట్ ప్రాజెక్టుకు తిరుపతిలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) పోషన్ ఇంక్యుబేషన్ సెంటర్ రూ. 5 లక్షలను అందించింది. ఈ ఆవిష్కరణను న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి కిసాన్ మేళాలో కూడా ఇటీవల ప్రదర్శించారు.

రొయ్యలు పెరిగే కాలంలో కూడా..

'చైన్ డ్రాగింగ్ బోట్'కు ఆక్వా రైతుల నుంచి ఆదరణ లభిస్తోంది. డా. తౌసీఫ్ అహ్మద్ రెండు బోట్లను తయారు చేసి నిజాంపట్నం ప్రాంతంలోని ఆక్వా రైతులకు అందజేశారు. ఒక్కొక్క బోట్ తయారీ వ్యయం రూ. 80 నుంచి 90 వేలు ఉంటుందని, ఆర్డర్ ఇచ్చిన వారం రోజుల్లో తయారు చేసి ఇవ్వగలం. ఆక్వా రైతులకు అవగాహన కల్పించేందుకు ఒక బోట్‌ను విజయవాడలోని కృష్ణా నదీ తీరంలో ప్రదర్శనకు పెట్టారు.

బోట్‌ను మనిషి గట్టు మీద నుంచే రిమోట్ పద్ధతిలో విద్యుత్తు బ్యాటరీ లేదా సౌర విద్యుత్తు ద్వారా నడిపించేందుకు పరిశోధనలు కొనసాగిస్తున్నానని డా. తౌసీఫ్ తెలిపారు. రొయ్యల సాగు ప్రారంభ దశలోనే కాకుండా, రొయ్యల పెంపకం జరిగే కాలంలో కూడా చైన్ డ్రాగింగ్ బోట్‌ను నడిపేందుకు ఆయన పరిశోధనలు కొనసాగిస్తున్నారు. పనిలో పనిగా డైనమిక్ ఎయిరేషన్ వ్యవస్థను కూడా ఈ బోట్‌కు అనుసంధానం చేస్తున్నామన్నారు. రొయ్య పిల్లలకు హాని కలగకుండా ఉండేలా అల్యూమినియం ప్రొపెల్లర్‌కు బదులు ఫైబర్ ప్రొపెల్లర్‌ను వినియోగించనున్నామని వివరించారు.

– దాళా రమేష్ బాబు, సాక్షి ప్రతినిధి, గుంటూరు

ఇన్‌పుట్స్: డా.ఎస్.అశోక్ కుమార్, సాక్షి, ఏఎన్‌యూ

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

• పెరటి కోళ్ల పెంపకం

అరెకరంలో అధికాదాయం

• అరెకరంలో నాటు కోళ్ల పెంపకం, పంటల ద్వారా ఏటా రూ. లక్ష ఆర్జిస్తున్న గిరిజన మహిళా రైతులు



పెరట్లో నాటు కోళ్ల పెంపకం ద్వారా చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు, ముఖ్యంగా మహిళా రైతులకు, ఏడాది పొడవునా స్థిరంగా ఆదాయంతో పాటు కుటుంబ స్థాయిలో పౌష్టికాహార లభ్యతను సైతం పెంపొందించవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి వాసన్ తదితర స్వచ్ఛంద సంస్థలు గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు ద్వారా నిర్ధారణైంది. పెరటి కోళ్ల పెంపకం కొత్తేమీ కాదు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 70% కుటుంబాలు అన్నో ఇన్నో పెరటి కోళ్లు పెంచుకుంటూనే ఉంటాయి. అయితే, కోళ్లు పరిసర ప్రాంతాల్లో తిరిగి రావటంతో పాటు రాత్రుళ్లు చెట్ల మీదో, పందిళ్ల మీదో నిద్రించటం వల్ల కుక్కలు, పిల్లుల బారిన పడి మరణిస్తూ ఉంటాయి. ఈ సమస్యలను అధిగమించడానికి వాసన్ సంస్థ దేశవాళీ పెరటి కోళ్లను అరెకరం విస్తీర్ణంలో చుట్టూ ప్రత్యేకంగా కంచె వేసి అందులో స్థానికంగా లభించే జాతుల నాటు కోళ్లు పెంచటంపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల తోడ్పాటుతో అమలు చేస్తోంది. కోళ్లు రాత్రి పూట భద్రంగా విశ్రమించడానికి షెడ్డు నిర్మించటం.. చిరుధాన్యాలు, అజొల్లా, చెద పురుగులను మేపటం.. వ్యాక్సిన్లు వేయటం ద్వారా నాటు కోడి పిల్లల మరణాలను తగ్గించి, ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం కల్పించటం.. ప్రతి 25 కుటుంబాలకు ఒకటి చొప్పున స్థానిక మహిళా రైతు ద్వారానే బ్రీడింగ్ ఫామ్‌ను ఏర్పాటు చేయించటం.. వంటి చర్యల ద్వారా చక్కటి ఫలితాలు వస్తున్నాయని వాసన్ చెబుతోంది. అరెకరం పెరటి కోళ్ల నుంచి రూ. 70–80 వేలు, ఆ అరెకరంలో పండ్లు, కూరగాయలు, దుంప పంటల ద్వారా మరో రూ. 20 వేల వరకు రైతు కుటుంబానికి ఆదాయం వస్తున్నట్లు తమ అధ్యయనంలో తేలినట్లు వాసన్ తెలిపింది. ఏపీ గిరిజన ప్రాంతాల్లో మహిళా రైతుల అనుభవాలు దేశవ్యాప్తంగా అమలు చేయదగినవిగా ఉన్నాయని వాసన్ చెబుతోంది. ఈ అనుభవాలపై చర్చించేందుకు ఈ నెల 27వ తేదీన విశాఖలో వాసన్, ఏపీ ప్రభుత్వ పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి చర్చాగోష్టి జరగనుంది. ఈ సందర్భంగా అరెకరంలో నాటు కోళ్లను పెంచుతూ ఏడాదికి దాదాపు రూ. లక్ష ఆదాయం గడిస్తున్న చిన్నమ్మి, చంద్రయ్య గిరిజన దంపతుల అనుభవాలను ఇక్కడ పరిశీలిద్దాం.

చిన్నమ్మి నాటు కోళ్ల బ్రీడింగ్ ఫామ్

కుండంగి చిన్నమ్మి(58), చంద్రయ్య గిరిజన దంపతులది మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేట మండలం చినరామ గ్రామం. వీరికి ముగ్గురు పిల్లలు. కుమారుడు రవికుమార్ డిగ్రీ వరకు చదువుకొని తల్లిదండ్రులతో కలసి గ్రామంలోనే వ్యవసాయం చేస్తున్నాడు. వారికి 70 సెంట్ల మాగాణి, ఎకరంన్నర మెట్ట పొలంతో పాటు 2 ఎకరాల కొండ పోడు భూములు ఉన్నాయి.

రెండేళ్ల క్రితం వాసన్ సంస్థ తోడ్పాటుతో అరెకరం పెరట్లో నాటు కోళ్ల పెంపకం చేపట్టారు. భర్త, కుమారుడు ఇతర పొలాల్లో పనులు చూసుకుంటూ ఉంటే చిన్నమ్మి పెరటి కోళ్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉంటుంది. మరో 25 కుటుంబాలకు కూడా కోడి పిల్లలను అందించే బ్రీడింగ్ ఫామ్‌ను చిన్నమ్మి నిర్వహిస్తుండటం విశేషం.

అరెకరం స్థలంలో చుట్టూ 4 అడుగుల ఎత్తు గ్రీన్ మెష్‌తో పాటు కొండ చీపురు గడ్డి, వెదురు బొంగులతో గట్టి కంచెను ఏర్పాటు చేసుకున్నారు. 50 కోళ్లతో ప్రారంభించారు. ఇప్పుడు 80 కోళ్లు ఉన్నాయి. కొన్ని పందెం కోళ్లు కూడా పెంచుతున్నారు. 18×24 అడుగుల స్థలంలో 200 కోళ్లు రాత్రిళ్లు నిద్రించడానికి సరిపోయే రేకుల షెడ్‌ను 3 సెంట్లలో నిర్మించారు. వాసన్ అందించిన రేకులు తదితర సామగ్రిని ఉపయోగించారు. కోళ్లు ఆరుబయట తిరిగి మేస్తూ ఉంటాయి. అదనంగా తమ పొలాల్లో పండించిన చోళ్లు తదితర చిరుధాన్యాలు కోళ్లకు వేస్తున్నారు. చిన్న కుంటలో పెంచిన అజొల్లాను కోళ్లకు, మట్టి కుండల్లో పెంచిన చెద పురుగులను కోడి



• పెరటి కోళ్లతో చిన్నమ్మి, చంద్రయ్య దంపతులు

పిల్లలకు మేతగా వేస్తుండటంతో అవి బలంగా పెరుగుతున్నాయి. వారం కోడి పిల్లలకు విధిగా లసోటా వాక్సిన్‌తో పాటు రెండు నెలలకోసారి ఇతర వాక్సిన్లు వేస్తున్నారు. ఈ అరెకరంలో కోళ్ల పెంపకంతో పాటు అదనపు ఆదాయం కోసం 43 రకాల పండ్లు, కూరగాయలు, దుంప పంటలను 5 దొంతర్లలో పండిస్తుండటం విశేషం. పసుపు, అల్లం, సీతాఫలాలు, బొప్పాయి, చింతపండుతో పాటు ఆగాకర తదితర తీగ జాతి కూరగాయలను సైతం పండిస్తున్నారు. కోడి మాంసం, గుడ్లు, కూరగాయలు, పండ్లను తాము తినటంతో పాటు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. ఏడాదికి రూ. 70–80 వేల వరకు నాటుకోళ్లు, గుడ్ల ద్వారా, మరో రూ. 20 వేలు పంటల ద్వారా ఈ అరెకరం నుంచి ఆదాయం పొందుతున్నామని రవి(94915 42102) తెలిపారు. చిన్నమ్మి శ్రద్ధగా పని చేస్తూ ఆదర్శ నాటుకోళ్ల బ్రీడింగ్ ఫామ్ రైతుగా గుర్తింపు పొందటం విశేషం.



బోపన్న జోడీకి షాక్

ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. కచ్చితంగా స్వర్ణ పతకం సాధిస్తారనుకున్న రోహన్ బోపన్న–యూకీ బాంబ్రీ జోడీ రెండో రౌండ్‌లోనే ఓడిపోయింది. సెర్గీ ఫోమిన్–సుల్తనోవ్ (ఉజ్బెకిస్తాన్) జంటతో జరిగిన రెండో రౌండ్‌లో బోపన్న–యూకీ ద్వయం 6–2, 3–6, 6–10తో ఓటమి చవిచూసింది.

వుషులో పతకం ఖాయం



మహిళల వుషు క్రీడాంశంలో భారత క్రీడాకారిణి నోరెమ్ రోషిబినా దేవి సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. 60 కేజీల సాండా ఈవెంట్ క్వార్టర్ ఫైనల్లో రోషిబినా 2–1తో ఐమన్ కర్షాగ్యా (కజకిస్తాన్)పై గెలిచింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో దీపక్



పురుషుల బాక్సింగ్ ఈవెంట్‌లో భారత బాక్సర్లు దీపక్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. తొలి రౌండ్‌లో దీపక్ 5–0తో అబ్దుల్ ఆరిఫిన్ (మలేసియా)పై, నిశాంత్ 5–0తో దీపేశ్ లామా (నేపాల్)పై గెలుపొందారు.


స్వర్ణ పతకాలతో భారత మహిళా క్రికెటర్లు

బోణీలోనే బంగారం

- భారత మహిళల క్రికెట్ జట్టుకు స్వర్ణ పతకం
- ఫైనల్లో శ్రీలంకపై విజయం

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో గతంలో రెండుసార్లు (2010, 2014) మాత్రమే క్రికెట్ క్రీడాంశంగా ఉంది. అయితే ఆ రెండుసార్లూ భారత క్రికెట్ జట్లు బరిలోకి దిగలేదు. దాంతో మహిళల విభాగంలో పాకిస్తాన్ రెండుసార్లు స్వర్ణం సాధించగా... పురుషుల విభాగంలో బంగ్లాదేశ్ (2010), శ్రీలంక (2014) ఒక్కోసారి బంగారు పతకం గెల్చుకున్నాయి. మూడోసారి మాత్రం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మనసు మార్చుకొని ఆసియా క్రీడల్లో భారత జట్లను పంపించాలని నిర్ణయం తీసుకుంది. బీసీసీఐ నిర్ణయం సరైందేనని నిరూపిస్తూ భారత మహిళల జట్టు బరిలోకి దిగిన తొలిసారే బంగారు పతకాన్ని తమ ఖాతాలో జమ చేసుకుంది. టి20 ఫార్మాట్‌లో జరిగిన ఈ పోటీల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత మహిళల జట్టు చాంపియన్‌గా అవతరించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. శ్రీలంకతో సోమవారం జరిగిన ఫైనల్లో భారత్ 19 పరుగుల తేడాతో గెలిచింది. రెండు మ్యాచ్‌ల నిషేధం ముగియడంతో ఫైనల్లో రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సారథ్యంలో భారత్ పోటీపడింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. స్వర్ణ పతకం నెగ్గిన భారత జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బారెడ్డి అనూష సభ్యురాలిగా ఉంది. అయితే ఆమెకు మ్యాచ్‌లు ఆడే అవకాశం రాలేదు.

టిటాస్ సాధు కట్టడి...

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 116 పరుగులు సాధించింది. స్మృతి మంధాన (45 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (40 బంతుల్లో 42; 5 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. అనంతరం 117 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 97 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. భారత టీనేజ్ పేస్ బౌలర్ టిటాస్ సాధు 4 ఓవర్లలో 6 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి శ్రీలంకను దెబ్బ తీసింది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టుకు కాంస్య పతకం లభించింది. కాంస్య పతక మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది.

ఆసియా క్రీడల్లో సోమవారం భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జాతీయ గీతం రెండుసార్లు మోగింది. షూటింగ్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో... మహిళల క్రికెట్‌లో టీమిండియా స్వర్ణ పతకాలతో సత్తా చాటుకుంది. భారత్‌కు షూటింగ్‌లోనే రెండు కాంస్యాలు, రోయింగ్‌లో మరో రెండు కాంస్యాలు లభించాయి. ఓవరాల్‌గా రెండో రోజు భారత్ ఖాతాలో ఆరు పతకాలు చేరాయి. ఈ మూడు క్రీడాంశాల్లో మినహా ఇతర ఈవెంట్స్‌లో భారత క్రీడాకారులు నిరాశపరిచారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) ప్రబోధని (బి) రణవీర 46; షఫాలీ వర్మ (స్టంప్డ్) సంజీవని (బి) సుగంధిక 9; జెమీమా (సి) విష్మీ (బి) ప్రబోధని 42; రిచా ఘోష్ (సి) సంజీవని (బి) రణవీర 9; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) సంజీవని (బి) ప్రబోధని 2; పూజ వస్త్రకర్ (సి) విష్మీ (బి) సుగంధిక 2; దీప్తి శర్మ (నాటౌట్) 1; అమన్‌జోత్ కౌర్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 116. వికెట్ల పతనం:** 1–16, 2–89, 3–102, 4–105, 5–108, 6–114, 7–116. **బౌలింగ్:** ఒషాది 2–0–11–0, ఉదేశిక ప్రబోధని 3–0–16–2, ఇనోషి 3–1–11–0, సుగంధిక 4–0–30–2, చమరి ఆటపట్టు 2.5–0–19–0, కవిశ 1.1–0–7–0, ఇనోక రణవీర 4–0–21–2.

శ్రీలంక ఇన్నింగ్స్: చమరి ఆటపట్టు (సి) దీప్తి (బి) టిటాస్ సాధు 12; అనుష్క సంజీవని (సి) హర్మన్ (బి) టిటాస్ సాధు 1; విష్మీ (బి) టిటాస్ సాధు 0; హాసిని పెరీరా (సి) పూజ (బి) రాజేశ్వరి 25; నీలాక్షి (బి) పూజ 23; ఒషాది (సి) టిటాస్ సాధు (బి) దీప్తి 19; కవిశ (సి) రిచా (బి) దేవిక 5; సుగంధిక (స్టంప్డ్) రిచా (బి) రాజేశ్వరి 5; ఇనోషి (నాటౌట్) 1; ఉదేశిక ప్రబోధని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 97. వికెట్ల పతనం:** 1–13, 2–13, 3–14, 4–50, 5–78, 6–86, 7–92, 8–96. **బౌలింగ్:** దీప్తి శర్మ 4–0–25–1, పూజ 4–1–20–1, టిటాస్ సాధు 4–1–6–3, రాజేశ్వరి 3–0–20–2, అమన్‌జోత్ కౌర్ 1–0–6–0, దేవిక వైద్య 4–0–15–1.

'పసిడి' బుల్లెట్...

- పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణం
- కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పిన రుద్రాంక్ష్, ఐశ్వరీ, దివ్యాంశ్ త్రయం
- వ్యక్తిగత విభాగంలో ఐశ్వరీకి కాంస్యం
- పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్యం


దివ్యాంశ్ · ఐశ్వరీ ప్రతాప్ · రుద్రాంక్ష్ పాటిల్

హాంగ్జౌ: తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా భారత యువ షూటర్లు ఆసియా క్రీడల్లో తమ గురికి పదును పెట్టారు. పోటీల రెండో రోజు భారత షూటర్లు ఒక స్వర్ణం, రెండు కాంస్యాలు అందించారు. ఈ క్రమంలో కొత్త ప్రపంచ రికార్డు కూడా సృష్టించారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రుద్రాంక్ష్ పాటిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, దివ్యాంశ్ సింగ్ పన్వర్‌లతో కూడిన భారత జట్టు 1893.7 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ ఏడాది ఆగస్టు 23న చైనా జట్టు 1893.3 పాయింట్లతో సాధించిన ప్రపంచ రికార్డును భారత త్రయం తిరగరాసింది. క్వాలిఫయింగ్‌లో ఆయా దేశాల షూటర్లు చేసిన స్కోరును లెక్కించి టాప్–3లో నిలిచిన జట్లకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను అందజేస్తారు. క్వాలిఫయింగ్‌లో భారత్ నుంచి రుద్రాంక్ష్ 632.5 పాయింట్లు, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ 631.6 పాయింట్లు, దివ్యాంశ్ 629.6 పాయింట్లు సాధించారు. టాప్–8లో నిలిచిన ఈ ముగ్గురూ ఫైనల్‌కు అర్హత సాధించారు. అయితే నిబంధనల ప్రకారం ఒక దేశం నుంచి గరిష్టంగా ఇద్దరు షూటర్లకు మాత్రమే ఫైనల్లో ఆడేందుకు అనుమతి ఉంది. దాంతో దివ్యాంశ్ కంటే ఎక్కువ పాయింట్లు స్కోరు చేసిన రుద్రాంక్ష్, ఐశ్వరీ ప్రతాప్ భారత్ తరఫున ఫైనల్లో పోటీపడ్డారు. ఎనిమిది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో రుద్రాంక్ష్ 208.7 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో నిలువగా... ఐశ్వరీ ప్రతాప్ సింగ్ 228.8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. లిహావో షెంగ్ (చైనా; 253.3 పాయింట్లు) కొత్త ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా... హాజున్ పార్క్ (దక్షిణ కొరియా; 251.3 పాయింట్లు) రజత పతకాన్ని గెల్చుకున్నాడు. మరోవైపు పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధూ (582 పాయింట్లు), ఆదర్శ్ సింగ్ (576 పాయింట్లు), అనీశ్ (560 పాయింట్లు)లతో కూడిన భారత జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. భారత త్రయం మొత్తం 1718 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. ఇండోనేసియా కూడా 1718 పాయింట్లు సాధించినా... 10 పాయింట్ల షాట్‌లు భారత్‌కంటే (45) ఇండోనేసియా (37) తక్కువగా కొట్టడంతో టీమిండియాకు కాంస్యం ఖరారైంది. క్వాలిఫయింగ్‌లో విజయ్‌వీర్ సిద్ధూ ఆరో ర్యాంక్‌లో నిలిచి వ్యక్తిగత విభాగం ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో విజయ్‌వీర్ 21 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో కాంస్య పతకానికి దూరమయ్యాడు.


కాంస్య పతకాలతో ఆదర్శ్, విజయ్‌వీర్, అనీశ్

పతకాల పట్టిక (టాప్–10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	39	21	9	69
దక్షిణ కొరియా	10	10	13	33
జపాన్	5	14	12	31
ఉజ్బెకిస్తాన్	4	4	6	14
హాంకాంగ్	3	4	7	14
భారత్	2	3	6	11
చైనీస్ తైపీ	2	1	3	6
ఇండోనేసియా	1	1	4	6
థాయ్‌లాండ్	1	0	2	3
మకావు	1	0	1	2

నోట్: స్వ–స్వర్ణం, ర–రజతం, కాం–కాంస్యం, మొ–మొత్తం.

ఏషియాడ్‌లో నేటి భారతీయం

మెడల్ ఈవెంట్స్



ఈక్వెస్ట్రియన్: హృదయ్, అనూష్, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలా (వ్యక్తిగత డ్రెస్సేజ్, టీమ్ ఈవెంట్... ఉ. గం. 5.30 నుంచి). షూటింగ్: దివ్యాంశ్–రమితా జిందాల్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్; ఉదయం గం. 8.15 నుంచి). సెయిలింగ్: అద్వైత్ మీనన్ (లేజర్ 4.7), నేహా ఠాకూర్ (లేజర్ రేడియల్ 4.7), ప్రీతి కొంగర, సుధాన్షు శేఖర్ (మిక్స్‌డ్ 470... ఉదయం గం. 8.30 నుంచి). కేసీ గణపతి, వరుణ్ ఠక్కర్ (49 ఈఆర్... ఉదయం గం. 11.30 నుంచి).

రెండు కాంస్యాలతో ముగింపు


భారత రోయింగ్ జట్టు హెడ్ కోచ్ ఇస్మాయిల్ బేగ్‌తో క్వాడ్రాపుల్ డబుల్ స్కల్ కాంస్య పతక విజేతలు సుఖ్‌మీత్ సింగ్, పర్మిందర్ సింగ్, జకర్ ఖాన్, సత్నామ్ సింగ్

రోయింగ్‌లో మెరుగైన భారత్ ప్రదర్శన

హాంగ్జౌ: గత ఆసియా క్రీడల్లో మూడు పతకాలు సాధించిన భారత రోయర్లు ఈసారి ఐదు పతకాలు గెలిచి తమ ప్రదర్శనను మెరుగుపర్చుకున్నారు. సోమవారం నాలుగు ఫైనల్స్‌లో భారత క్రీడాకారులు పోటీపడగా... రెండు ఈవెంట్స్‌లో కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం భారత రోయర్లకు రెండు రజతాలు, ఒక కాంస్యం లభించాయి. సోమవారం పురుషుల ఫోర్ ఈవెంట్‌లో జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్, ఆశిష్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం నెగ్గింది. భారత బృందం 2000 మీటర్ల దూరాన్ని 6ని:08.61 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. పురుషుల క్వాడ్రాపుల్ డబుల్ స్కల్స్ ఈవెంట్‌లో సత్నామ్ సింగ్, పర్మిందర్ సింగ్, జకర్ ఖాన్, సుఖ్‌మీత్ సింగ్‌లతో కూడిన భారత జట్టు కాంస్యం గెల్చుకుంది. భారత బృందం 2000 మీటర్ల దూరాన్ని 6ని:10.81 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచింది.

నాడు తండ్రి... నేడు తనయుడు...

2002 బుసాన్ ఆసియా క్రీడల్లో ఇందర్‌పాల్ సింగ్ సభ్యుడిగా ఉన్న భారత జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. 21 ఏళ్ల తర్వాత ఇందర్‌పాల్ సింగ్ తనయుడు పర్మిందర్ సింగ్ తండ్రి ఘనతను అందుకున్నాడు. పర్మిందర్ సభ్యుడిగా ఉన్న భారత జట్టు ఈసారి క్వాడ్రాపుల్ డబుల్ స్కల్స్‌లో కాంస్యం గెలిచింది.

'వీసా' వచ్చేసింది...

రేపు హైదరాబాద్‌కు పాకిస్తాన్ జట్టు

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో పాల్గొనే పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు ఎట్టకేలకు వీసా సమస్య తీరింది. సోమవారం సాయంత్రం జట్టు సభ్యులు, సహాయక సిబ్బందికి భారత వీసాలు మంజూరైనట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్ధారించింది. పాక్ బృందానికి వీసాలు ఇచ్చేందుకు భారత ప్రభుత్వం ఆమోదముద్ర వేసినట్లు వెల్లడించింది. 48 గంటల్లో భారతదేశానికి బయల్దేరాల్సి ఉన్నా... ఇంకా తమకు వీసాలు రాకపోవడంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ అసంతృప్తిని వెల్లడించింది. సోమవారం ఉదయం ఈ విషయంపై పాక్ బోర్డు ఐసీసీకి లేఖ రాసింది. చివరకు సాయంత్రానికి పరిస్థితి చక్కబడింది. వరల్డ్ కప్‌కు ముందు దుబాయ్‌లో రెండు రోజుల పాటు తమ జట్టుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయాలని భావించిన పాక్ వీసా సమస్య కారణంగా దానిని రద్దు చేసుకుంది. ఇప్పుడు తాజా షెడ్యూల్ ప్రకారం బుధవారం తెల్లవారుజామున లాహోర్ నుంచి బయల్దేరే పాక్ టీమ్ దుబాయ్ మీదుగా సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటుంది. శుక్రవారం ఆ జట్టు ఉప్పల్ స్టేడియంలో న్యూజిలాండ్‌తో తొలి వామప్ మ్యాచ్ ఆడుతుంది.



రారండోయ్ వేడుక చూద్దాం...

వన్డే ప్రపంచకప్ మరో 9 రోజుల్లో



టి20ల జోరులో వన్డేలకు కాలం చెల్లిందంటూ అంతటా వినిపిస్తున్న సమయంలో ఇప్పుడు ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఊపు తెచ్చే మెగా ఈవెంట్‌కు రంగం సిద్ధమైంది. మన దేశంలో ఫార్మాట్‌తో సంబంధం లేకుండా క్రికెట్‌ను విపరీతంగా అభిమానించడం దాదాపు అన్ని చోట్లా కనిపించేదే. అలాంటి చోట వరల్డ్ కప్ అంటే సహజంగానే ఆసక్తి రెట్టింపు అవుతుంది. పుష్కర కాలం తర్వాత వన్డే ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యం ఇస్తుండటంతో ఈ టోర్నీ మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ 12 ఏళ్లలో వన్డే క్రికెట్ ఎంతో మారింది... నిబంధనలు మాత్రమే కాదు, టి20ల కారణంగా ఆటలో వేగం పెరిగింది. నాలుగేళ్ల క్రితం ఇంగ్లండ్ గడ్డపై జరిగిన వరల్డ్‌కప్ తుది పోరును ఎవరూ మరచిపోలేరు... ఇప్పుడూ అదే తరహా జోష్‌ను ఈ టోర్నీ కూడా అందిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. గతంలో మూడుసార్లు ప్రపంచకప్‌కు ఆతిథ్యమిచ్చినా... ఇతర దేశాలతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన భారత్ ఈసారి మాత్రం మరో దేశంతో జత కట్టకుండా పూర్తి స్థాయిలో విడిగా నిర్వహిస్తుండటం విశేషం. 2011 తర్వాత భారత్ రెండు టి20 వరల్డ్‌కప్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. 2016లో మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే జరగ్గా... 2021లో పేరుకు మనదే ఆతిథ్యం అయినా కరోనా కారణంగా మ్యాచ్‌లకు యూఏఈ వేదికైంది. ఇప్పుడు మరోసారి పూర్తి స్థాయి క్రికెట్ పండగ భారత్‌లో కనిపించనుంది. అభిమానుల కోణంలో చూస్తే నెలన్నర పాటు పండగ వాతావరణం ఖాయం. అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లో గత టోర్నీ ఫైనలిస్ట్‌లు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరిగే మ్యాచ్‌తో వరల్డ్‌కప్ సంబరానికి తెర లేవనుంది. నవంబర్ 19న అదే అహ్మదాబాద్ ఆఖరి పోరాటానికి వేదిక కానుంది. 10 దేశాలు, 10 వేదికలు, 46 రోజులు, 48 మ్యాచ్‌లు... మన దేశంలోని శీతల వాతావరణ సమయంలోనూ క్రికెట్ సమరాలు వేడెక్కించడం ఖాయం.

–సాక్షి క్రీడా విభాగం

సినిమా

ఒక సామాన్యుడి ఘర్షణ


సందీప్, దామోదర ప్రసాద్

సందీప్ కిషన్ హీరోగా సోమవారం కొత్త చిత్రం ఆరంభమైంది. సందీప్ కిషన్‌తో త్వరలో రిలీజ్‌కు రెడీ కానున్న 'ఊరు పేరు భైరవకోన' చిత్రం రూపొందించిన ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని కూడా నిర్మించనుంది. 'మాయవన్' చిత్రం తర్వాత సందీప్ కిషన్, దర్శకుడు సీవీ కుమార్ కాంబినేషన్‌లో 'మాయవన్'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందనుంది. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వెంకట్ బోయనపల్లి కెమెరా స్విచాన్ చేయగా, దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. పి. కిరణ్ దర్శకత్వం వహించారు. ''ఒక సూపర్ విలన్‌తో ఓ సామాన్యుడి ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. రెగ్యులర్ షూటింగ్‌ని నవంబర్‌లో ఆరంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, కెమెరా: కార్తీక్ కె. తిల్లై, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి (జీకే).

యువతకు మురళీధరన్ స్ఫూర్తి

– వీవీఎస్ లక్ష్మణ్


కృష్ణప్రసాద్, లక్ష్మణ్, మురళీధరన్, మధుర్ మిట్టల్

''మురళీధరన్ గొప్ప క్రికెటర్ అని అందరికీ తెలుసు. కానీ, అంతకంటే గొప్ప మనసున్న వ్యక్తి. నిగర్వి. ఈ తరం యువతకు రోల్ మోడల్, స్ఫూర్తి. అతనిలాంటి స్నేహితుడు ఉండటం అదృష్టం. తనకు క్రికెట్టే జీవితం'' అని క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ అన్నారు. క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం '800'. ముత్తయ్యగా మధుర్ మిట్టల్, ఆయన భార్య మది మలర్‌గా మహిమా నంబియార్ నటించారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో మూవీ ట్రైన్ మోషన్ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో అక్టోబర్ 6న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన '800' ప్రీ రిలీజ్ వేడుకకి వీవీఎస్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో ముత్తయ్య మురళీధరన్ మాట్లాడుతూ– ''క్రికెట్ అంటే రికార్డులు కాదు... స్నేహితుల్ని చేసుకోవడం. లక్ష్మణ్ నాకు క్లోజ్ ఫ్రెండ్. ఇండియన్ సెలబ్రిటీలతో క్రికెట్ టీమ్ ఏర్పాటు చేయాల్సి వస్తే హీరో వెంకటేశ్‌ని కెప్టెన్ చేయాలి.. ఆయనకు క్రికెట్ అంటే చాలా ఇష్టం'' అన్నారు. ''కన్నీళ్లు పెట్టుకునే సన్నివేశాలు ఎన్నో ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''ఈ సినిమాలో మురళీధరన్ క్రికెట్ గురించి మాత్రమే కాదు. ప్రజలకు తెలియని ఆయన జీవితం ఎంతో ఉంది'' అన్నారు మధుర్ మిట్టల్.

బలమైన పాత్ర చేశాను

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన ప్రగతి శ్రీవాస్తవ విలేకరులతో మాట్లాడుతూ – ''మను చరిత్ర' సినిమా తర్వాత కోవిడ్ వల్ల గ్యాప్ రావడంతో ముంబై వెళ్లిపోయా. 'పెద కాపు 1'కి చాన్స్ రావడంతో, ఆడిషన్ ఇచ్చాను. సెలక్ట్ అయ్యాను. శ్రీకాంత్ అడ్డాలగారి గత సినిమాల్లో హీరోయిన్ పాత్రలు బలంగా ఉంటాయి. అలా ఈ సినిమాలో నా పాత్ర కూడా చాలా బలంగా ఉంటుంది. ఇందులో నాది రూరల్ క్యారెక్టర్.. చాలెంజింగ్ రోల్. ఈ పాత్రను బాగా చేయగలిగానంటే దానికి కారణం శ్రీకాంత్‌గారే. ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకూ మంచి సస్పెన్స్‌తో ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు.


ప్రగతి

వినోదం.. సందేశం


వెంకట రమణ, సుమన్

సుమన్, అజయ్ ఘోష్, కిశోర్, వెంకట రమణ, ప్రగ్యా నైనా ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జనం'. పి. పద్మావతి సమర్పణలో వెంకట రమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో సుమన్ మాట్లాడుతూ– ''జనం' షూటింగ్ ఒంగోలులో చేశాం. 'నేటి భారతం' షూటింగ్ అక్కడే జరిగింది. అదే కోవలో వస్తోన్న చిత్రం 'జనం'. సందేశంతో పాటు మంచి వినోదం ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమాలో సుమన్‌గారు పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా నటించారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నాం. త్వరలో పార్ట్ 2 చిత్రీకరణ ప్రారంభమవుతుంది'' అన్నారు వెంకట రమణ. డైరెక్టర్ వి. సముద్ర, నటుడు అజయ్ ఘోష్, నిర్మాతలు టి. రామ సత్యనారాయణ, సాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
26-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 15	నిఫ్టీ 0
66,024	19,675

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,239	▲	27
డోజోన్స్	33,906	▼	58
ఎఫ్‌టీఎస్ఈ 100	7,624	▼	60
డాక్స్	15,405	▼	152
షాంఘై	3,116	▼	17
నికాయ్	32,679	▲	276

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)	58,670
బంగారం (22 క్యారట్)	55,880
వెండి (కేజీ)	79,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.30	83.97
£	బ్రిటన్ పౌండ్		100.11	103.48
€	యూరో		86.98	90.08
¥	జపాన్ ఎన్ (100)		55.19	56.90
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.34	54.64
S$	సింగపూర్ డాలర్		59.91	61.83
SAR	సౌదీ రియాల్		21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్		21.74	23.53
¥	చైనా యువాన్		10.26	12.33

రెలిగేర్ వాటాకు ఓపెన్ ఆఫర్

26 శాతానికి బర్మన్ కుటుంబం రెడీ



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థ రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ వాటాదారులకు బర్మన్ కుటుంబం ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. తద్వారా ఎఫ్ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా ప్రమోటర్లు రెలిగేర్‌లో 26 శాతం వాటాను అదనంగా కొనుగోలు చేయనున్నారు. షేరుకి రూ. 235 ధరలో 9 కోట్లకుపైగా షేర్లను సొంతం చేసుకోనున్నారు. ఇందుకు రూ. 2,116 కోట్లు వెచ్చించనున్నారు. దీంతో రెలిగేర్‌లో బర్మన్ కుటుంబ వాటా ప్రస్తుత 25 శాతం నుంచి 51 శాతానికి జంప్ చేయనుంది. వెరసి రెలిగేర్ బర్మన్ కుటుంబ నియంత్రణలోకి చేరనుంది. తద్వారా ఫైనాన్షియల్ సర్వీసుల విభాగంలోకి డాబర్ కుటుంబం ప్రవేశించనుంది. డాబర్ గ్రూప్ ఇప్పటికే యూకే కంపెనీ అవైవా ఇంటర్నేషనల్ హోల్డింగ్స్‌తో భాగస్వామ్యం ద్వారా లైఫ్ ఇన్సూరెన్స్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాగా.. గతేడాది డాబర్ ఇన్వెస్ట్ కార్ప్ నుంచి అవైవా పీఎల్‌సీ 25 శాతం అదనపు వాటాను కొనుగోలు చేసింది. దీంతో అవైవా లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియాలో వాటాను 74 శాతానికి పెంచుకుంది.

ఓపెన్ ఆఫర్ వార్తల నేపథ్యంలో రెలిగేర్ షేరు బీఎస్ఈలో 7 శాతం పతనమై రూ. 253 వద్ద ముగిసింది.

అన్‌లిస్టెడ్ కంపెనీలకు కఠినతర నిబంధనలు

కంపెనీ లా కమిటీ పరిశీలన



న్యూఢిల్లీ: బడా అన్‌లిస్టెడ్ కంపెనీలకు కఠినతరమైన నిబంధనలను కంపెనీ లా కమిటీ ప్రతిపాదించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద స్టార్టప్స్ ఆర్థిక వ్యవహారాలపై ఒక కన్నేసి ఉంచేందుకు.. అన్‌లిస్టెడ్ కంపెనీలు మూడు నెలలకోసారి ఆర్థిక ఫలితాలను సమర్పించడం తప్పనిసరి చేయొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో పాటు కంపెనీల చట్టానికి సవరణలు చేసే అంశంపై అంతర్‌మంత్రిత్వ శాఖల స్థాయిలో చర్చలు జరుగుతున్నట్లు వివరించాయి. ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో అవకతవకల ఆరోపణలు, ఆడిటర్లు రాజీనామా చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది.

ఒడిదుడుకుల ట్రేడింగ్

అక్కడక్కడే ముగిసిన సూచీలు



ముంబై: తీవ్ర హెచ్చుతగ్గుల్లో సాగిన సోమవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు అక్కడికక్కడే ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని బలహీనతలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు ప్రతికూల ప్రభావం చూపాయి. రోజంతా 462 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 15 పాయింట్ల లాభంతో 66,024 వద్ద ముగిసింది. దీంతో సెన్సెక్స్ నాలుగు రోజుల వరుస నష్టాలకు ముగింపు పడినట్లైంది. నిఫ్టీ ఎలాంటి లాభ, నష్టాలకు లోనవకుండా 19,675 వద్దే స్థిరపడింది. బ్యాంకులు, ఫైనాన్స్, వినిమయ, రియల్టీ షేర్లు రాణించగా..., ఐటీ, ఆటో, ఇంధన, ఫార్మా, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వడ్డీరేట్ల పెంపు ఆందోళనలు, బాండ్లపై అధిక రాబడుల నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి.

- గృహ రుణాలపై వడ్డీ రాయితీ కల్పించేందుకు కేంద్రం రూ.60 వేల కోట్లతో కొత్త పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు వార్తలు వెలుగులోకి రావడంతో రియల్టీ రంగ షేర్లకు డిమాండ్ నెలకొంది. శోభ లిమిటెడ్ షేరు అత్యధికంగా 5% ర్యాలీ చేసింది.
- డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ నుంచి పెద్ద మొత్తంలో పన్ను నోటీసు అందడంతో డెల్టా కార్ప్ షేరు 18% నష్టపోయి రూ.143 వద్ద స్థిరపడింది.
- బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ ప్రణాళికలో ఉన్నట్లు వార్తలు రావడంతో బజాజ్ ఫైనాన్స్ షేరు 5% ర్యాలీ చేసి రూ.7819 వద్ద స్థిరపడింది.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 19 పైసలు బలహీనపడి 83.13 స్థాయి వద్ద స్థిరపడింది. క్రూడ్ ధర పెరగడం, డాలర్ బలపడటంతో దేశీయ కరెన్సీ కోతకు గురైంది.

ఎఫ్అండ్‌వో సమయం పెంపు!

- ఎన్ఎస్ఈ తాజా ప్రణాళికలు
- అనుమతుల కోసం సెబీకి దరఖాస్తు



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజ్ దిగ్గజం ఎన్ఎస్ఈ ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో దశలవారీగా ట్రేడింగ్ సమయాన్ని పెంచే ప్రణాళికలకు తెరతీసింది. తద్వారా ప్రపంచ సమాచార ప్రభావంతో ఏర్పడే ఓవర్‌నైట్ రిస్కులకు చెక్ పెట్టాలని యోచిస్తోంది. రోజువారీ ట్రేడింగ్ సమయం(ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 3.30 వరకూ) ముగిశాక కొంత విరామమిచ్చి ప్రత్యేక ఎఫ్అండ్‌వో సెషన్‌ను అనుమతించాలని భావిస్తున్నట్లు ఎన్ఎస్ఈ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ పేర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి 9 వరకూ ట్రేడింగ్‌కు తెరతీయాలని ప్రణాళికలు వేసినట్లు వెల్లడించారు. అయితే సాయంత్రం నమోదయ్యే లావాదేవీలను మర్నాడు నిర్వహించే సాధారణ ట్రేడింగ్‌లో కలపాలనుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కాలపరిమితిపై వ్యక్తమయ్యే స్పందన ఆధారంగా క్రమంగా రాత్రి 11.55వరకూ ట్రేడింగ్ సమయాన్ని పెంచే యోచనలో ఉన్నట్లు తెలియజేశారు. కమోడిటీ డెరివేటివ్స్ బాటలో ఈక్విటీ ఎఫ్అండ్‌వోను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

తొలుత ఇండెక్స్‌తో..

తొలి దశలో ఇండెక్స్ డెరివేటివ్స్‌తో ప్రారంభించి, ఆపై సింగిల్ స్టాక్ ఆప్షన్స్, తదితరాలను ప్రవేశపెట్టనున్నట్లు కృష్ణన్ వివరించారు. ఈ అంశాలపై అనుమతుల కోసం సెబీకి ప్రతిపాదనలు అందించినట్లు వెల్లడించారు. సెబీ నుంచి త్వరలోనే అనుమతులు లభించగలవని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా ట్రేడింగ్ కమ్యూనిటీ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు ఎఫ్అండ్‌వో గడువు పెంపు ప్రక్రియకు తెరతీసినట్లు పేర్కొన్నారు. సెబీ అనుమతిస్తే ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ సిద్ధం చేయనున్నట్లు కృష్ణన్ వివరించారు. కాగా.. ట్రేడింగ్ వేళలను పెంచడం ద్వారా దేశీయంగా మరింతమంది స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడంతోపాటు.. విదేశీ ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలకు ఈక్విటీ ఎఫ్అండ్‌వో ద్వారా హెడ్జింగ్ చేపట్టేందుకు వీలుంటుందని, ఇది మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకట్టుకుంటుందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలకు జోష్!

- అమ్మకాలకు పండుగలు, వన్డే ప్రపంచకప్ దన్ను
- 20 శాతం వృద్ధికి అవకాశం
- రూ.70,000 కోట్ల వ్యాపారం



న్యూఢిల్లీ: గృహోపకరణాలు, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్ పరిశ్రమ ఈ ఏడాది అమ్మకాలపై బలమైన అంచనాలను పెట్టుకుంది. పండుగల సీజన్‌కుతోడు, వన్డే ప్రపంచ క్రికెట్ కప్ పోటీలు ఉండడంతో అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయని, క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తోంది. ఏటా పండుగల సీజన్‌లో అధిక విక్రయాలు నమోదవుతుండడం సాధారణమే. కాకపోతే ఈ ఏడాది క్రికెట్ పోటీలు కూడా రావడం అమ్మకాలకు కలిసొస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 1987 తర్వాత పండుగల సీజన్ సమయంలో క్రికెట్ ప్రపంచ కప్ టోర్నమెంట్ రావడం ఇదే మొదటిసారి కానుంది. దీంతో టీవీలు, ముఖ్యంగా పెద్ద తెరల సెట్లు, ఆడియో ఉత్పత్తులు, సౌండ్ బార్లు, హెడ్‌ఫోన్లు, ఇయర్‌బడ్స్ అధికంగా అమ్ముడుపోతాయనే అంచనాలు నెలకొన్నాయి. సంప్రదాయ, చిన్న తెరల టీవీల స్థానంలో 55 అంగుళాల పెద్ద టీవీలను వినియోగదారులు కొనుగోలు చేసే అవకాశాలు ఉంటాయని కంపెనీలు భావిస్తున్నాయి. ప్రీమియం, అల్ట్రా ప్రీమియం అయిన క్యూఎల్ఈడీ, ఓఎల్ఈడీ టీవీలకు సైతం డిమాండ్ ఉంటుందని అంచనాతో ఉన్నాయి. వన్డే వరల్డ్‌కప్ అక్టోబర్ 5న ప్రారంభం అవుతుండగా, నవంబర్ 19న ముగియనుంది.

ఆకర్షణీయమైన ఆఫర్లు

గత సీజన్ల మాదిరే ఈ ఏడాది కూడా వడ్డీ రహిత రుణ సదుపాయం, కొత్త మోడళ్ల ఆవిష్కరణ, విస్తృత ప్రచారంతో అమ్మకాలు పెంచుకోవాలని ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల కంపెనీలు యోచిస్తున్నాయి. ప్రస్తుత పండుగల సమయంలో అమ్మకాలు గతేడాది స్థాయిలోనే ఉండొచ్చు. కాకపోతే ఈ ఏడాది ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని అంచనా వేస్తున్నాం. వీటి అమ్మకాలు 30% పెరగొచ్చు. కాకపోతే మాస్ విభాగం (తక్కువ ధరల ఉత్పత్తులు) ఒత్తిడిని ఎదుర్కొనవచ్చు. ఈ ఏడాది ఆరంభం నుంచి ద్రవ్యోల్బణ ప్రభావం కొనసాగుతోంది. దీంతో విచక్షణారహిత వినియోగంపై ఒత్తిడి నెలకొంది. రుతుపవనాల్లో వ్యత్యాసం, కొన్ని రాష్ట్రాల్లో సరైన వర్షాలు కురవకపోవడం వ్యవసాయ ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది. ఇవి మాస్ ఉత్పత్తుల అమ్మకాలపై ప్రభావం పడేలా చేస్తాయి. కనుక ఈ విభాగంలో అమ్మకాలు ఏమంత మెరుగ్గా ఉంటాయని భావించడం లేదు" అని గోద్రేజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది వివరించారు.

బలమైన అంచనాలు..

హోమ్ అప్లయెన్సెస్, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు ఈ సీజన్‌లో రూ.70,000 కోట్లుగా ఉండొచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. వాతావరణంలో అస్థిరతల వల్ల ఎయిర్ కండీషనర్ల అమ్మకాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నాయి. "వర్షాలు తక్కువగా ఉండడంతో వర్షాకాలంలోనూ డిమాండ్ బలంగా ఉంది. ముఖ్యంగా దక్షిణాది, ఉత్తరాది, పశ్చిమ, ఈశాన్య ప్రాంతాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలతో ఈ ధోరణి నెలకొంది. దీంతో ఏసీలకు డిమాండ్ కొనసాగుతోంది" అని కమల్ నంది తెలిపారు. రెండంకెల అమ్మకాల వృద్ధి ఉంటుందని పానాసోనిక్ ఇండియా అంచనా వేస్తోంది. ముఖ్యంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్ల అమ్మకాలపై బలమైన అంచనాలతో ఉంది. "గతేడాది పండుగల సీజన్‌లో అమ్మకాల పరిమాణం కంటే అమ్మకాల విలువ ఎక్కువగా ఉంది. ఈ ఏడాది కూడా అదే కొనసాగుతుందని భావిస్తున్నాం. వినియోగదారులు విలువ ఆధారిత ఫీచర్ల కోసం చూస్తున్నారు" అని పానాసోనిక్ మార్కెటింగ్ ఇండియా ఎండీ ఫుమియను ఫుజిమోరి తెలిపారు. ఓనమ్ పండుగ సమయంలో 20 శాతం అమ్మకాలు పెరిగినట్టు ఎల్‌జీ ఇండియా తెలిపింది. ఈ ఏడాది పండుగల సీజన్‌లో విలువ, పరిమాణం పరంగా ఈ ఏడాది మంచి వృద్ధి ఉంటుందని అంచనా వేస్తోంది.

ఐవోసీ గ్రీన్ హైడ్రోజన్ బస్



న్యూఢిల్లీ: చమురు రంగ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) భారత్‌లో తొలిసారిగా గ్రీన్ హైడ్రోజన్‌తో నడిచే బస్‌లను సోమవారం ఆవిష్కరించింది. హైడ్రోజన్ మండినప్పుడు ఉప ఉత్పత్తిగా నీటి ఆవిరిని మాత్రమే ఈ బస్ విడుదల చేస్తుంది. 30 కిలోల గ్రీన్ హైడ్రోజన్ సామర్థ్యం ఉన్న నాలుగు సిలిండర్లతో ఈ బస్ 350 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ప్రస్తుతానికి ఢిల్లీ రోడ్లపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఒక కిలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి 50 యూనిట్ల పునరుత్పాదక విద్యుత్, 9 కిలోల డీయోనైజ్డ్ నీరు అవసరం. చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి జెండా ఊపి రెండు బస్‌లను ప్రారంభించారు. 2023 చివరినాటికి ఐవోసీ ఖాతాలో బస్‌ల సంఖ్య 15కు చేరనుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామ్-2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డులో కేటగిరీ–1, కేటగిరీ-2 పోస్టులను భర్తీ చేయనున్నారు. సంబంధిత విభాగాల్లో పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 56
- » అర్హత: మాస్టర్స్ డిగ్రీ(జియోలాజికల్ సైన్స్/జియాలజీ/అప్లైడ్ జియాలజీ/జియో ఎక్స్‌ప్లోరేషన్/మినరల్ ఎక్స్‌ప్లోరేషన్/ఇంజనీరింగ్ అప్లైడ్ జియోఫిజిక్స్/మెరైన్ జియోఫిజిక్స్/అప్లైడ్ జియోఫిజిక్స్/కెమిస్ట్రీ/అప్లైడ్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ/హైడ్రోజియాలజీ), ఎంఎస్సీ (టెక్)–అప్లైడ్ జియోఫిజిక్స్.
- » వయసు: 01.01.2024 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- » పరీక్ష విధానం: స్టేజ్1 ప్రిలిమినరీ పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), స్టేజ్ 2 మెయిన్ ఎగ్జామినేషన్(డిస్క్రిప్టివ్ టైప్), స్టేజ్-3 పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.10.2023
- » దరఖాస్తుల ఉపసంహరణ తేదీలు: 11.10.2023 నుంచి 17.10.2023 వరకు
- » ప్రిలిమినరీ పరీక్ష తేది: 18.02.2024.
- » మెయిన్ పరీక్ష తేదీలు: 22.06.2024.
- » వెబ్‌సైట్: www.upsc.gov.in

ఐడీబీఐ బ్యాంక్‌లో 600 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు ద్వారా అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 600
- » అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- » వయసు: 31.08.2023 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఇస్తారు.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.09.2023
- » ఆన్‌లైన్ పరీక్ష తేది: 20.10.2023.
- » వెబ్‌సైట్: www.idbibank.in

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోలు

పాడేరులోని కలెక్టర్ కార్యాలయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో తాత్కాలిక ప్రాతిపదికన ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో (నీతి ఆయోగ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- » మొత్తం ఖాళీల సంఖ్య: 03
- » అర్హత: పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. డేటా అనాలిసిస్, ప్రెజెంటేషన్ స్కిల్, సోషల్ మీడియా తదితరాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.
- » స్టైపెండ్: నెలకు రూ.55,000 చెల్లిస్తారు.
- » దరఖాస్తు విధానం: దరఖాస్తును పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఆఫీస్, నార్త్ బ్లాక్, డిస్ట్రిక్ట్ కలెక్టర్ ఆఫీస్ కాంపౌండ్, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 28.09.2023.
- » వెబ్‌సైట్: allurisitharamaraju.ap.gov.in

పశ్చిమ గోదావరి జిల్లాలో 57 మెడికల్, పారా మెడికల్ పోస్టులు

ఏపీ వైద్య విధాన పరిషత్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదికన మెడికల్, పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 57
- » పోస్టుల వివరాలు: గైనకాలజిస్ట్–01, అనస్థీటిస్ట్-06, పీడియాట్రీషియన్-01, ఫిజీషియన్-04, జనరల్ సర్జన్-01, కార్డియాలజిస్ట్-01, మెడికల్ ఆఫీసర్-16, స్టాఫ్ నర్స్-20, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్-2, ఆప్టోమెట్రిషియన్-01, సోషల్ వర్కర్-01, ల్యాబ్ టెక్నీషియన్-01, న్యూట్రిషనల్ కౌన్సిలర్-01, అటెండర్ కమ్ క్లీనర్-01.
- » అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ, ఎంబీబీఎస్, డీఎన్‌బీ, ఎండీ, పీజీ, ఎంఫిల్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 42 ఏళ్లు మించకూడదు.
- » దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఏలూరులోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అందజేయాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 27.09.2023.
- » వెబ్‌సైట్: eluru.ap.gov.in

డిగ్రీతో కేంద్ర బ్యాంక్‌లో కొలువు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రించే, పర్యవేక్షించే కేంద్ర బ్యాంక్. ఆర్‌బీఐ తీసుకునే నిర్ణయాలు బ్యాంకింగ్ రంగంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థనూ ప్రభావితం చేస్తాయి. ఇంతటి కీలకమైన ఆర్‌బీఐ.. ఏటా పలు పోస్ట్‌లకు నియామకాలు చేపడుతోంది. తాజాగా 450 అసిస్టెంట్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.47,849 వేతనం అందించనుంది! ఈ నేపథ్యంలో.. ఆర్‌బీఐ అసిస్టెంట్ పోస్టుల వివరాలు, ఎంపిక విధానంతో పాటు పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

- » 450 అసిస్టెంట్ పోస్ట్‌ల భర్తీకి ఆర్‌బీఐ నోటిఫికేషన్
- » ప్రిలిమ్స్, మెయిన్స్, లాంగ్వేజ్ టెస్ట్ ద్వారా ఎంపిక
- » ప్రారంభంలో నెలకు రూ.47,849 వేతనం
- » బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం

మొత్తం 450 పోస్ట్‌లు

ఆర్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా 18 ప్రాంతీయ కార్యాలయాల్లో మొత్తం 450 పోస్ట్‌లను భర్తీ చేయనుంది. ప్రాంతీయ కార్యాలయాల వారీగా పోస్ట్‌ల సంఖ్య వివరాలు.. అహ్మదాబాద్ 13 పోస్టులు, బెంగళూరు 58, భోపాల్ 12, భువనేశ్వర్ 19, చండీగఢ్ 21, చెన్నై 13, గువహటి 26, హైదరాబాద్ 14, జైపూర్ 5, జమ్ము 18, కాన్పూర్ అండ్ లక్నో 55, కోల్‌కత 22, ముంబై 101, నాగ్‌పూర్ 19, న్యూఢిల్లీ 28, పాట్నా 10, తిరువనంతపురం అండ్ కొచి 16 పోస్టులు. వీటితోపాటు 11 బ్యాక్‌లాగ్ పోస్ట్‌లను కూడా భర్తీ చేయనున్నారు.

విద్యార్హతలు

సెప్టెంబర్ 1 ,2023 నాటికి 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీస ఉత్తీర్ణత మార్కులు సాధిస్తే సరిపోతుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న కార్యాలయం ఉన్న రాష్ట్రానికి సంబంధించిన భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. అదేవిధంగా కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉండాలి.

వయసు

సెప్టెంబర్ 1, 2023 నాటికి 20 – 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల చొప్పున గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఆకర్షణీయ వేతనం

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనంతో కెరీర్ ప్రారంభమవుతుంది. రూ.20,700-రూ.55,700 వేతన శ్రేణిలో ప్రారంభంలో నెలకు రూ.47,849 స్థూల వేతనం లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఆర్‌బీఐ అసిస్టెంట్ పోస్ట్‌ల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ రాత పరీక్ష, మెయిన్ ఎగ్జామ్. దీంతోపాటు లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ కూడా ఉంటుంది.

వంద మార్కులకు ప్రిలిమినరీ

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ పరీక్షను మూడు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్షకు కేటాయించే సమయం ఒక గంట. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది.

మెయిన్‌కు 200 మార్కులు

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున రెండో దశ మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. దీన్ని అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40ప్రశ్నలు–40 మార్కులు, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ40 ప్రశ్నలు–40 మార్కులు,టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్40ప్రశ్నలు–40 మార్కులు, టెస్ట్ ఆఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు.. ఇలా మొత్తం 200 ప్రశ్నలు–200 మార్కులకు మెయిన్ పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటల 15 నిమిషాలు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. ప్రిలిమినరీ, మెయిన్ రెండు పరీక్షల్లోనూ నెగెటివ్ మార్కింగ్ (0.25 మార్కులు)నిబంధన అమల్లో ఉంది.

లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు ఇద్దరిని చొప్పున(1:2 నిష్పత్తి)ఎంపిక చేసి.. మలి దశలో లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్ ఆయా రాష్ట్రాల అధికారిక భాషలో ఉంటుంది.హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయంలో ఖాళీలకు సంబంధించి తెలుగులో లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ విభాగాలు ఉంటాయి. ఇందులోనూ ప్రతిభ చూపితే..మెయిన్ ఎగ్జామ్,లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ మార్కులను క్రోడీకరించి.. తుది విజేతల జాబితా రూపొందిస్తారు. ఇందులో చోటు సాధించిన వారికి నియామకం ఖరారు చేస్తారు.

ప్రాక్టీస్‌తోనే సక్సెస్

- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ అంశాల్లో అవగాహన పెంచుకోవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో మంచి స్కోర్ కోసం బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- న్యూమరికల్ ఎబిలిటీకి సంబంధించి.. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా అర్థమెటిక్ సంబంధిత అంశాల(రేషియోస్, పర్సంటేజెస్, టైమ్ అండ్ వర్క్, టైమ్ అండ్ డిస్టెన్స్, రిలేషన్స్ తదితర)పై పట్టు సాధించాలి.
- జనరల్ అవేర్‌నెస్‌ను మరింత ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, ఆర్‌బీఐ కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. వీటితోపాటు ఆర్థిక, సామాజిక అంశాలు, జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం, ఇండియన్ ఎకానమీ, గ్లోబలైజేషన్, భారత సామాజిక విధానం, ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ, ఇతర ఆర్థిక సంస్థలు, ఆర్‌బీఐ విధులు, దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ తదితరాలపై అవగాహన పెంచుకోవాలి.
- కంప్యూటర్ నాలెడ్జ్‌కు సంబంధించి.. కంప్యూటర్ ఫండమెంటల్స్ ముఖ్యంగా ఆపరేటింగ్ టూల్స్ గురించి తెలుసుకోవాలి. కీ బోర్డ్ షార్ట్ కట్ మెథడ్స్, ఎంఎస్ ఆఫీస్ అప్లికేషన్స్, డాక్యుమెంట్ క్రియేషన్, ఎక్సెల్ షీట్ క్రియేషన్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

చీఫ్ మేనేజర్ స్థాయికి


ఆర్‌బీఐ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన వారు భవిష్యత్తులో చీఫ్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. సర్వీస్ నిబంధనలను అనుసరించి తొలుత ఆఫీసర్/ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎ హోదాకు పదోన్నతి లభిస్తుంది. ఆ తర్వాత మేనేజర్ గ్రేడ్–బి(స్కేల్–2), సీనియర్ మేనేజర్ గ్రేడ్-సి(స్కేల్–3), చీఫ్ మేనేజర్ గ్రేడ్–డి (స్కేల్–4) హోదాలకు పదోన్నతి పొందొచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 04.10.2023
- ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీ:21, 23.10.2023
- ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: డిసెంబర్ 02, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rbi.org.in

టుడేస్ గ్రాఫిక్

ప్రతి గంటకు ఎంతమంది మరణిస్తున్నారో తెలుసా?
(టాప్–10 దేశాలు)



రంగులు మార్చే చీర

సిరిసిల్ల నేతకళాకారుడు విజయ్‌కుమార్ ఆవిష్కరణ



బంగారు, వెండిపోగుల చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/సాక్షి, హైదరాబాద్: చీరను కదిలిస్తే చాలు.. రంగులు మారతాయి.. బంగారు, వెండి పోగులు మెరిసిపోతాయి. వనితల దేహంపై మెరిసిపోతాయి. బంగారం, వెండి పోగులు, పట్టుదారంతో పట్టు చీర నేశాడు సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్. నెల రోజులపాటు మగ్గంపై శ్రమించి ఈ చీరను నేశాడు. 30 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండిపోగులతోపాటు పట్టు పోగులతో రూపొందించాడు. ఈ చీర పొడవు 6.30 మీటర్లు ఉండగా.. 48 అంగుళాల వెడల్పుతో 600 గ్రాముల బరువుంటుంది. ప్రముఖ వ్యాపారి దూరపూడి విష్ణు ఆర్డర్ మేరకు రూ.2.8 లక్షలు వెచ్చించి ఈ చీరను నేసినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ చీరను మంత్రి కె.తారక రామారావు సోమవారం సెక్రటేరియట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్‌ను మంత్రి అభినందించారు.

నూతన నిబంధనల మేరకు ఐటీ రిటర్న్స్ సమర్పించాలి

తెలంగాణ, ఏపీ, ఒడిశా రాష్ట్రాల ఆదాయపన్ను శాఖ కమిషనర్ బాలకృష్ణ




మాట్లాడుతున్న బాలకృష్ణ. చిత్రంలో కోటేశ్వరమ్మ

ఖమ్మంగాంధీచౌక్: నూతన నిబంధనల మేరకు ఐటీ రిటర్న్స్ సమర్పించాలని తెలంగాణ, ఏపీ, ఒడిశా రాష్ట్రాల ఆదాయపన్నుశాఖ (మినహాయింపుల విభాగం) కమిషనర్ బి.బాలకృష్ణ అన్నారు. ఖమ్మంలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో సోమవారం నూతన ఆదాయ పన్ను నిబంధనలపై అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన బాలకృష్ణ నూతన నిబంధనలపై పన్ను చెల్లింపుదారులకు వివరిస్తూ, వివిధవర్గాల వారికి ఉన్న పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలకు ఆదాయ పన్ను మినహాయింపులు, చెల్లింపు అంశాలపై చట్టంలో చేసిన నూతన మార్పుల గురించి వివరించారు. నూతన నిబంధనల ఆధారంగా ఈ నెల 30వ తేదీలోగా ఐటీదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని, లేనిపక్షంలో అదనపు పన్ను చెల్లించాల్సి వస్తుందన్నారు. ఆదాయ పన్ను చట్టం నూతన నిబంధనలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. హైదరాబాద్ రేంజ్ జాయింట్ కమిషనర్ వి. కోటేశ్వరమ్మ, ఆదాయపు పన్ను అధికారులు సాయిశంకర్ సిద్దం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినబడకున్నా.. కనిపిస్తుంది

- చెవిటి, మూగ చోదకులకు వినూత్న హెల్మెట్
- హారన్ మోగితే దీపం వెలిగే హెల్మెట్
- ఖమ్మం కుర్రాడి ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: ద్విచక్రవాహనాలు నడిపే చెవిటి, మూగ దివ్యాంగులకు శుభవార్త. వెనుక నుంచి వస్తున్న వాహనాల హారన్ శబ్దం వినిపించక దివ్యాంగులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాంటివారి కోసం ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్‌కే రజలిపాషా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వినూత్న హెల్మెట్‌ను తయారు చేశారు. వెనుక నుంచి వచ్చే వాహనాలు హారన్ మోగించినప్పుడు.. వెంటనే హెల్మెట్ ముందుభాగంలో దీపం వెలుగుతుంది. అలా వెలగడంతో ఆ కాంతి హెల్మెట్ అద్దంపై కనిపిస్తుంది.దీంతో అప్రమత్తమై వాహనాన్ని మరింత జాగ్రత్తగా నడపవచ్చు. హారన్ నుంచి వచ్చే ధ్వని తరంగాల ఆధారంగా ఈ హెల్మెట్ దీపాలు వెలిగేలా రూపకల్పన చేయడం విశేషం.

ఆహా పాము రుచి.. తినరా మైమరచి!



పాము దొరికిందంటే అతనికి పసందైన విందే.. దాన్ని చంపి తోలు ఒలిచి పచ్చిదే ఆరగిస్తుంటాడు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం శనగలగూడూరు గ్రామానికి చెందిన పుల్లన్నకు పాములు తినే అలవాటుంది. గతంలో చిన్నచిన్న పాములను పట్టుకుని తినే పుల్లన్న సోమవారం చనిపోయిన ఆరడుగుల పామును మెడలో వేసుకుని కొరుక్కుని తింటూ గ్రామ వీధుల్లో తిరిగాడు. ఈ ఘటన చూసిన గ్రామస్తులు విస్తుపోయారు. దీనిపై పుల్లన్నను ప్రశ్నించగా పామును తినడం తనకు అలవాటేనని, కోడికూర తిన్నట్లే ఉంటుందని చెప్పాడు. అయితే ఈ పాము బాగా ముదిరిపోయి ఉన్నందున మూరెడు ముక్క మాత్రమే తినగలిగానని చెప్పాడు. – పుట్లూరు

కొబ్బరి పీచుతో రోడ్డు!



రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన కొబ్బరి పీచు జాలీ

ఖర్చు తక్కువ.. మన్నిక ఎక్కువ

కాయిర్ జియో టెక్స్‌టైల్ టెక్నాలజీతో బీటీ రోడ్డు

రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శ్రీకారం

కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ. 2 లక్షలు ఆదా



కాయిర్ జియో టెక్స్‌టైల్ టెక్నాలజీతో నిర్మించిన బీటీ రోడ్డు

రాష్ట్రంలో సరికొత్త మార్పులు, ప్రయోగాలకు సిద్దిపేట కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణంలో మరో కొత్త విధానానికి ఇక్కడే శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో కాయిర్‌జియో టెక్స్‌టైల్ (కొబ్బరినార) సాంకేతికతతో తొలిసారిగా రోడ్డు నిర్మించడంతో.. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

సాక్షి, సిద్దిపేట: సాధారణంగా రోడ్ల నిర్మాణం చేసేటప్పుడు ముందుగా నేలను చదును చేస్తారు. ఆ తర్వాత వివిధ సైజుల్లో ఉన్న కంకరను పొరలు పొరలుగా పోసి రోలర్ సాయంతో తొక్కిస్తారు. ఆ మార్గం గట్టిపడిందని నిర్ధారించుకున్న తర్వాత బ్లాక్‌టాప్ (బీటీ) మిశ్రమంతో రోడ్డును నిర్మిస్తారు. లేదంటే నేరుగా సిమెంట్ రోడ్డును నిర్మించడం ఇప్పటివరకు చూశాం. అయితే, ఇటీవల సిద్దిపేటలో కొత్తగా కొబ్బరినారతో రోడ్డును నిర్మించారు.

కాయిర్ జియో టెక్స్‌టైల్ టెక్నాలజీతో హుస్నాబాద్‌లో ఉమ్మాపూర్ నుంచి పోతారం(ఎస్) వరకు నాగారం మీదుగా 3.5 కి.మీ. నిడివితో బీటీ రోడ్డు వేశారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.2.31 కోట్లు కేటాయించారు. అయితే నేషనల్ రూరల్ రోడ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌ఆర్‌ఆర్‌డీ) సూచనలతో కాయిర్ జియో టెక్స్‌టైల్ టెక్నాలజీతో ఈ రోడ్డు నిర్మించారు.

తాగి పడేసిన కొబ్బరి బొండాల నుంచి..

ఈ విధానంలో తాగి పడేసిన కొబ్బరి బొండాల నుంచి నారను వేరు చేశారు. దీన్ని ఒక మిషన్‌లో వేసి జాలీ మాదిరిగా అల్లారు. ముందుగా నేలను చదునుగా చేసి రోలర్‌తో తొక్కించిన తర్వాత కొబ్బరి నారతో చేసిన జాలీని పరిచారు. దీనిపై 5 అంగుళాల సన్న కంకరను ఒక పొరగా వేసి.. దానిపై 6 అంగుళాల మందంతో కంకరను మరో పొరగా పోసి రోలర్‌తో తొక్కించారు. అనంతరం పై నుంచి బ్లాక్‌టాప్ దాంబర్ వేసి రోడ్డును వేశారు. రాష్ట్రంలో తొలిసారిగా వేసిన ఈ రోడ్డును పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఇటీవల పరిశీలించారు. ఇలాంటి రోడ్ల నిర్మాణానికి డబ్బు ఆదా అవుతుందని, నాణ్యత కూడా బాగా ఉంటుందని ఆయన చెప్పారు.

ఖర్చు తక్కువ

సాధారణ రోడ్ల నిర్మాణంలో 9 అంగుళాలు, 6 అంగుళాల మందంతో కూడిన కంకరను వినియోగిస్తారు. దీని వల్ల ఖర్చు పెరుగుతుంది. పైగా రోడ్డు వాడకంలోకి వచ్చాక వాహనాల బరువుతో కలిగే ఒత్తిడి వల్ల 9 అంగుళాల మందమున్న కంకర స్థానభ్రంశం చెంది రోడ్డు కుంగిపోతుంది. ఇలా వచ్చిన పల్లపు ప్రాంతంలో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు నిలుస్తుంది. దీని వల్ల బ్లాక్‌టాప్‌లో ఉండే పటుత్వం తగ్గుతుంది. ఫలితంగా రోడ్డులో గుంతలు ఏర్పడతాయి. అదీగాక, 15 అంగుళాల ఎత్తుతో రోడ్డు నిర్మించడం వల్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల కంటే రోడ్డు ఎక్కువ ఎత్తుగా కనిపిస్తుంది.

- రోడ్డు నిర్మాణంలో కొబ్బరి పీచు వాడితే నిర్మాణ వ్యయం ప్రతి కిలోమీటరుకు రూ.2 లక్షల వరకు తక్కువ అవుతుంది. దీంతోపాటు వృథాగా ఉంటూ దోమల పెరుగుదలకు కారణమయ్యే కొబ్బరి బొండాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని నిపుణులు అంటున్నారు.



రోడ్డుపై వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా హుస్నాబాద్‌లో కాయిర్ జియో టెక్స్‌టైల్ టెక్నాలజీతో రోడ్డు నిర్మించాం. రోడ్డు పైన పడే వర్షపు నీరు భూమిలోకి వెళ్లకుండా కొబ్బరి పీచులోకి ఇంకుతుంది. తర్వాత ఈ నీరు బయటకు రావడం వల్ల రోడ్డు చాలా రోజులు మన్నికగా ఉంటుంది. గుంతలు పడే అవకాశాలు తక్కువ. ఇదే విధంగా మరిన్ని రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం చెప్పింది.

–సదాశివరెడ్డి, డీఈ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్

పీవోపీ వినాయక విగ్రహాలకు నో

హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయవద్దన్న హైకోర్టు

సాక్షి,హైదరాబాద్/ముషీరాబాద్: ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన వినాయక విగ్రహాలను హుస్సేన్‌సాగర్, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయవద్దని, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొలనుల్లో చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అన్ని చర్యలు అమలు చేసి.. తదుపరి విచారణ లోగా నివేదిక అందజేయాలని హైదరాబాద్ సీపీకి ఆదేశాలు జారీ చేసింది. విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం విధిస్తూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనలను సవాల్ చేస్తూ.. తెలంగాణ గణేశ్‌మూర్తి కళాకార్ వెల్ఫేర్ అసోసియేషన్ గత సంవత్సరం వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయవద్దని, ప్రత్యేక తాత్కాలిక కొలనుల్లోనే నిమజ్జనం చేయాలని గత సంవత్సరం ఇచ్చిన ఉత్తర్వులనే పాటించాలని తేల్చిచెప్పింది.

గణేశ్‌ఉత్సవ సమితి సభ్యుల ధర్నా

పీవోపీతో తయారు చేసిన వినాయక విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయరాదని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిరసిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ నేతలు సోమవారం రాత్రి ట్యాంక్ బండ్‌పై లేపాక్షి వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో ట్యాంక్ బండ్‌పై పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ నేతలకు తోడు పలు గణేశ్ మండపాల నిర్వాహకులు కూడా బైఠాయించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఆందోళన చేస్తున్నవారిని అరెస్టు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.